# లోకానికి నేనే వెలుగు




## మరియ - కతోలిక విశ్వాస సిద్ధాంతము

(మరియ శాస్త్రము - 1)

సంపుటి : 47 జూలై - సెప్టెంబర్ 2024 సంచిక : 3

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం :**
ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా
ఫాదర్ మేడంకి ఆనంద్ అంద్రూ

**గురు విద్యార్థుల బృందం :**
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్
బ్రదర్ కాకుమాను జాన్‌రాజు
బ్రదర్ కొట్టె అరవింద్
బ్రదర్ తుడుం సంపత్
బ్రదర్ తురకా మహేష్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 47 జూలై - సెప్టెంబరు 2024 సంచిక : 3

# మరియ - కతోలిక విశ్వాస సిద్ధాంతము

## (మరియ శాస్త్రము -1)

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

సంచిక సంపాదకులు

మరియు

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామాంతపురం, హైదరాబాదు-500 013.

ఫోన్ : 91-040-29561761, 29561762

E-mail : stjohnshyd2@gmail.com

Website : stjohnseminary.org

# విషయసూచిక


సంపాదకీయం

– *ఫాదర్ పిల్లి అంతోని దాస్* ................................ **05**

**1. మొదటి మరియ విశ్వాస సిద్ధాంతం :**
**మరియ దివ్య మాతృత్వం**

– *ఫాదర్ పిల్లి అంతోని దాస్* ................................ **09**

**2. రెండవ మరియ విశ్వాస సిద్ధాంతం :**
**మరియ నిత్య కన్యత్వం**

– *బ్రదర్ కరసాల జోసెఫ్ తంబి* ................................ **33**


**3. మూడవ మరియ విశ్వాస సింద్ధాంతం :**
**మరియ నిష్కళంక ఉద్భవం**

– *బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్* ................................ **61**

**4. నాలుగవ మరియ విశ్వాస సిద్ధాంతం :**
**మరియ మోక్షారోపణం**

– *ఫాదర్ పిల్లి అంతోని దాస్*................................ **85**

# సంపాదకీయం



కతోలిక శ్రీసభలో మరియ ఒక ప్రధానమైన భూమిక పోషిస్తుంది. ఆమె సన్నిధి ఆదర్శనీయం. రక్షణ చరిత్రలో ఆమె పాత్ర ప్రసంశనీయం. విశ్వాసుల కొరకై ఆమె ప్రార్థన మహోన్నత ప్రభావవంతం. ఆమె జీవితం, జీవనం, మరణం, మోక్షారోపణం క్రీస్తు అనుచరులకు ఒక బలమైన నమ్మకం, ఒక ఆనందమైన నిరీక్షణ, ఒక అమోఘమైన వాగ్దానం. కాబట్టి, ఆమె గురించి తెలుసుకోవడం, ఆమె పాత్రలో లీనం కావడం, ఆమె పవిత్రతను ధ్యానించడం సమంజసం. మరియ ఎప్పుడూ క్రీస్తుకు దూరంగా ఉండలేదు. ఆమె ఎల్లప్పుడు క్రీస్తుతో, క్రీస్తు శ్రీసభతో అనిర్వచనీయ సంబంధం కలిగి ఉంది. మరియ విశ్వాస సిద్ధాంతాలు (డాగ్మా లేదా డాక్ట్రిన్) అధ్యయనం అంత్యంత అవసరం. దేవుని సంకల్పానికి తలొగ్గి ఆమె ఏవిధంగా దైవకుమారుని ఈలోకానికి అందించింది, మానవ రక్షణ కార్యానికి మొదటి బీజం వేసింది తెలుసుకోవాలి. స్వయంగా దేవుడే ఆ మరియను తన ప్రియ పుత్రికగా ఎన్నుకొని, ఆమెను సంపూర్ణ అనుగ్రహములతో నింపి, తన కుమారునికి తల్లిగా పిలచి ఉన్నాడో, అందులోని దైవ రహస్యమును ధ్యానించాలి. దేవుని ఎన్నిక, మరియ సమర్పణం – రెండూ ఏకమైయ్యాయి. అందుకే మరియ అత్యున్నత మహిమకు పాత్రురాలు అయ్యింది. కాబట్టి ఆమె విశ్వాస ప్రయాణమును పరిశీలించి చూడడం మన ప్రధాన కర్తవ్యం.

మరియ శాస్త్రము ఎప్పుడు కూడా క్రీస్తు శాస్త్రముతో ఏకమై ఉంటుంది. రెండు శాస్త్రాల పురోగతి కూడా పరస్పరంగా సాగుతుంది. క్రీస్తు రక్షకుడైతే,

మరియ సహరక్షకిగా తన పాత్రను పోషించింది. క్రీస్తు తండ్రి కుడిప్రక్క కూర్చొని రారాజుగా పరిపాలిస్తుంటే, మరియ పరలోక భూలోక రాణిగా ప్రార్ధనతో మానవాళిని నడిపిస్తుంది. శ్రీసభ ఒకవైపు యేసు శ్రమలను ధ్యానిస్తూ ఆయనను భాధమయ సేవకునిగా ప్రకటిస్తూ ఉంటే, అదే శ్రీసభ మరోవైపు మరియ వ్యాకులములను ధ్యానిస్తూ ఆమెను కరుణామయిగా కొనియాడుతుంది. దీనివలన మనకు కొన్ని సత్యాలు బోధపడుతున్నాయి: మరియ ఎల్లప్పుడూ క్రీస్తుతో కలిసి నడిసింది, క్రీస్తు కొరకే జీవించింది, క్రీస్తుపై మాత్రమే ఆధారపడి బ్రతికింది. అనగా, క్రీస్తు అధ్యయనం ఉన్నచోట మరియ అధ్యయనం కూడా ఉండాలి. క్రీస్తు శాస్త్రము పరిపూర్ణంగా అర్ధం కావాలంటే, మరియ శాస్త్రమును అవగాహన చేసుకోవాలి. ఒకమాట చెప్పడంలో అతిశయోక్తి లేదని నమ్ముతున్నాను: “క్రీస్తు లేని మరియ లేదు, మరియ లేని క్రీస్తు అర్ధం కాడు”. ఇది నా ప్రగాఢ విశ్వాసం.

ఈ క్రీస్తు శాస్త్ర, మరియ శాస్త్ర సంయుక్త అధ్యయనంలో రెండు ప్రమాదాలు ఉన్నాయి. దేవుని రక్షణ ప్రణాళికలో మరియ పాత్రను అధ్యయనం చేసినపుడు రెండు పరస్పర విభిన్న ధృవాలను స్పుర్శించే ప్రమాదం ఉంది. మొదటిది: మరియను దైవత్వంతో సమానంగా నిలబెట్టడం. తరచుగా, మరియను మనం దేవునితో సమానంగా చూస్తూ ఆరాధిస్తూ ఉంటాం. ఇది మహా ప్రమాదకరం. మరియకు పరిపూర్ణ దైవత్వమును ఆపాదిస్తాం. అంతే మహోన్నతంగా ఆమెను పూజిస్తాము, ఊరేగిస్తాము, కొన్నిసార్లు దేవతగా అభివర్ణిస్తాము. ఇది క్రైస్తవ విశ్వాస కార్యం కాదు. రెండవది: మరియ పాత్రను పరిమితం చేయడం. రక్షణ ప్రక్రియలో మరియ చూపిన చొరవ, విధేయత, అంకితభావం, దృడసంకల్పం అమోఘమైనవి. వాటిని తక్కువ చేసి చూపించకూడదు. మరియను కేవలం ‘ఒక మంచి శిష్యురాలు’ గా మాత్రమే చూపిస్తూ ఉంటాం. కేవలం యేసుకు మనకు మధ్య ఒక మధ్యవర్తిగా మాత్రమే వివరిస్తూ ఉంటాం. ఇది కూడా ప్రమాదకరమే. మరియ పాత్రను ఏమాత్రం తగ్గించి మాట్లాడ కూడదు. ఈ రెండు భిన్న అభిప్రాయాలను నిర్మూలించాలి. అప్పుడే మరియ నిర్మలమైన, నిత్యమైన పాత్ర మనకు అర్ధం అవుతుంది.

మరియ గురించి పరిపూర్ణ అవగాహన పొందాలంటే ఆమె గురించిన 'విశ్వాస సిద్ధాంతాలను' ఒకవైపు, ఆమె యందు ప్రజలు చూపించు భక్తిప్రపత్తులను మరోవైపు అధ్యయనం చేయాలి. అందుకే ఈ అధ్యయనమును రెండు సంపుటాలుగా అందించడం జరుగుతుంది. మొదటిది: "మరియ కతోలిక విశ్వాస సిద్ధాంతము" – మరియ శాస్త్రము Iగా ఇప్పుడు ప్రచురిస్తున్నాము. రెండవది: "మరియ భక్తి ప్రపత్తుల అధ్యయనం" – మరియ శాస్త్రము 2 గా తదుపరి పత్రికలో ప్రచురిస్తాము. అందుకే మరియశాస్త్ర ఈ మొదటి సంపుటిలో మరియకు సంబంధించి శ్రీసభ ప్రబోధించిన 'విశ్వాస సత్యాలు' (Four Dogmas) మీ ముందుకు తీసుకొని వస్తున్నాము.

**మొదటి మరియ విశ్వాస సిద్ధాంతం:** మరియ దివ్య మాతృత్వం. దీనిని ఫాదర్ పిల్లి అంతోని దాస్ అందిస్తున్నాడు. మరియ దేవుని తల్లి. పరిశుద్ధ గ్రంధములో దీని ఆనవాళ్ళు ప్రత్యక్షంగా కనిపస్తాయి. వాటినే శ్రీసభ సంప్రదాయం ముఖ్యముగా ఎఫేసు సమావేశంలో ధ్రువీకరించి క్రైస్తవ లోకానికి ప్రకటించింది.

**రెండవ మరియ విశ్వాస సిద్ధాంతం:** మరియ నిత్య కన్యత్వం. దీనిని బ్రదర్ జోసెఫ్ తంబి అందిస్తున్నాడు. మరియ కన్యత్వమునకు ఏనాడు భంగం కలుగలేదు. మరియ ఏనాడు పాపము చేయలేదు. యేసు జననమునకు పూర్వము, యేసు జనన సమయములోనూ, యేసు జనన అనంతరము కూడా మరియ కన్యకగానే జీవించింది. దీనికి కూడా పరిశుద్ధ గ్రంధ ఆధారాలు ఉన్నాయి. కొన్ని వచనాలను వక్రీకరించి మరియకు ఇతర బిడ్డలు ఉన్నారని దుష్ప్రచారము జరిగినా కూడా, అది వాస్తవం కాదని, భాషాపూరిత అపార్ధాలే అని మనకు తెలుస్తుంది. అనగా, మరియ నిత్య కన్యక. అందులో ఎటువంటి సందేహం లేదని మనం అధ్యయనం చేస్తున్నాము.

**మూడవ మరియ విశ్వాస సిద్ధాంతం:** మరియ నిష్కళంక ఉద్భవి. దీనిని బ్రదర్ పి. ఒబెజ్ అందిస్తున్నాడు. మరియ జన్మపాపము లేకుండా జన్మించింది అని గ్రహించడమే దీని ఉద్దేశ్యము. తండ్రి దేవుని ప్రణాళికలో, సంకల్పంలో మరియ జన్మించింది. ఆమెను ఎటువంటి పాపకళంకము లేకుండా ఏర్పరచాడు దేవుడు. ముఖ్యముగా నిష్కళంక ఉద్భవ సాధ్యాఅసాధ్యాల గురించి కొన్ని

సందేహాలు ఉన్నప్పటికీ, మరియ ఎన్నిక తీరును బట్టి, కతోలిక శ్రీసభ సంప్రదాయం ఆమె అమలోద్భవిగా జన్మించిందని నిరూపించి, దానికి 1854వ సంవత్సరంలో ఒక విశ్వాస సిద్ధాంతంగా ప్రకటించారు.

**నాలుగవ మరియ విశ్వాస సిద్ధాంతం:** మరియ మోక్షారోపణం. దీనిని ఫాదర్ పిల్లి అంతోని దాస్ అందిస్తున్నాడు. మరియ ఆత్మ శరీరములతో పరలోకమునకు కొనిపోబడినది. ఆమె మరణము గురించి శ్రీసభ పూర్తి స్పష్టతను ఇవ్వకపోయినప్పటికీ, దైవీక ప్రణాళికలో మరియ దేవుని తల్లి కాబట్టి, పాపము సోకని నిత్య కన్యక కాబట్టి, నిష్కళంక ఉద్భవి కాబట్టి, ఆమె శరీరము మట్టిలో కలిసిపోకూడదు, అది పరలోక మహిమలో చేరాలి. ఈ విశ్వాసంతోనే శ్రీసభ 1950వ సంవత్సరంలో లోతైన అధ్యయనం చేసిన తర్వాత ఈ సత్యమును దృవీకరిస్తూ ఒక ప్రకటన చేసారు. ఆమె మోక్షారోపణం క్రీస్తు కృపకు సంకేతం, శరీర ఉత్థానానికి ఆదర్శం.

ఈ నాలుగు విశ్వాస సిద్ధాంతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మనకు అందించిన రచయితలు అభినందనలు, కృతజ్ఞతలు. పాఠకులకు కూడా నా కృతజ్ఞతలు. ఈ గ్రంథములోని లోతైన విషయాలను అవగాహన చేసుకొని, మరియతల్లి పట్ల నిజమైన భక్తిని, అనురాగ పూరిత విశ్వాసమును ప్రదర్శించి, ఆమెను తగువిధముగా గౌరవించగలరని నా ప్రగాఢ అభ్యర్ధన. యేసుక్రీస్తు నామములో, మరియతల్లి ప్రార్ధనా సహకారంలో మీకు శుభములు కలుగును గాక! ఆమెన్.


ప్రేమతో ... ప్రార్ధనతో ...

**మీ ఫాదర్ పిల్లి అంతోని దాస్**

సంచిక సంపాదకులు

# 1. మొదటి మరియ విశ్వాస సిద్ధాంతం : మరియ దివ్య మాతృత్వం (శ్రీసభ విశ్వాస ప్రబోధనం)

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**



మరియ దివ్య మాతృత్వం అను విశ్వాస సత్యం క్రీస్తుకు, శ్రీసభకు సంబంధించి యేసు తల్లి మరియ పోషించిన పాత్రను ప్రత్యక్షపరుస్తుంది. నిజమైన సత్య ప్రబోధంలో ఒక వ్యక్తిగా మరియ భూమికను విశదం చేస్తుంది. రక్షణ ప్రక్రియలో మరియ 'ఎటువంటి' పాత్ర పోషించిందో తెలుసుకోడంలో అసలు మరియ 'ఎవరు' అను ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. మరియను ప్రేమిస్తే ఆమె గురించి వాస్తవాన్ని అన్వేషిస్తాము. ఈ వ్యాసంలో కతోలిక సత్యాలలో ప్రధానమైంది పరిశుద్ధ కన్య మరియ 'దివ్య మాతృత్వం' అను విశ్వాస సత్యం గురించి తెలుసుకుందాము.

## 1. మరియ: దేవుని తల్లి

మరియ దేవుని తల్లి. మరియ గురించిన సత్యాలలో ఇదే ప్రధమము, ప్రధానము. ఈ సత్యము నుండే మరియ పాత్రలు, గౌరవాలు ప్రవహిస్తాయి. కన్య మరియ మనుష్యవతారము పొందిన దేవుడైన యేసుక్రీస్తునకు నిజమైన తల్లి. మరియ గూర్చి 'దివ్య మాతృత్వ' సత్యమునకు సాక్షమిచ్చునవి స్వయముగా పరిశుద్ధ గ్రంథ ప్రవచనములే. మంగళవార్త సందర్భంలో గబ్రియేలు దూత మరియకు ప్రకటిస్తుంది: "ఇదిగో! నీవు గర్భము ధరించి కుమారుని కనెదవు. ఆ శిశువునకు 'యేసు' అని పేరు పెట్టుము" (లూకా 1:31). అంతేకాదు, ఇంకా ముందుకు వెళ్లి కుమారుని తత్వమును తెలియపరుస్తున్నాడు: "అందుచేత

ఆ పవిత్ర శిశువు 'దేవుని కుమారుడు' అని పిలువబడును" (లూకా 1:35). దేవుని వద్ద నుండి పంపబడిన దూత కాబట్టి ఇది దేవుని సందేశమే. ఇక్కడ రెండు సత్యాలు ప్రకటింపబడినాయి: మొదటిది  మరియ నిజముగా యేసు తల్లి, రెండవది – యేసు నిజముగా దేవుని కుమారుడు. ఈ వార్త నుండి మనము వేదాంతపరమైన ఒక సామాన్య సత్యమును గ్రహించగలము: మరియ యేసు తల్లి, యేసు దేవుడు, కాబట్టి మరియ దేవుని తల్లి. యేసు నిజముగా దేవుని కుమారుడు కాబట్టి, పరిశుద్ధ గ్రంథంలో మరియ 'యేసు తల్లి'గా అభివర్ణింపబడింది (మత్తయి 2:13; 2:20; యోహాను 2:1,3; అ.కా. 1:14), అనగా, మానవునిగా జన్మించిన దేవునికి మరియ నిజమైన తల్లి.

శ్రీసభ సాంప్రదాయం ప్రకారం 'మరియ దివ్య మాతృత్వం' మొదటగా అపోస్తలుల విశ్వాసప్రమాణంలో కనిపిస్తుంది. ఈ ఉన్నతమైన విశ్వాస సత్యాల సారాంశమును శ్రీసభ తన ప్రధమ విశ్వాసమును ప్రకటించడంలో వ్యక్తం చేస్తుంది: "అతని ఏకైక కుమారుడు, మన ప్రభువైన యేసుక్రీస్తు, పవిత్రాత్మ ప్రభావమువలన కన్య మరియ నుండి జన్మించెను." ఈ శ్రీసభ అధికారపూర్వక ప్రబోధము నుండి ఈ గొప్ప మరియ సంఘటన 431 వ సంవత్సరంలో జరిగిన ఎఫేసు సమావేశంలో ప్రస్తావించబడింది. ఈ సమావేశం ఒక మహా సత్యమును ప్రకటించింది, పరిశుద్ధ కన్య మరియ 'దేవుని తల్లి' అనగా 'తెయోటొకోస్' అనగా 'దేవుని మోసిన స్త్రీ'. నేస్తోరియస్ తప్పుడు సిద్ధాంతాలకు వ్యతిరేకముగా పునీత అలక్సాంద్రియా సిరిల్ ప్రతిపాదించిన ప్రబోధనను ఈ ఎఫేసు మహాసభ దృఢీకరిస్తూ ఇలా సెలవిస్తుంది: "యిమ్మానుయేలు (క్రీస్తు) వాస్తవముగా దేవుడు. అందువలన పవిత్ర కన్య దేవుని తల్లి (తెయోటొకోస్). ఎందుకన, ఆమె మానవ శరీరమును ధరించిన దేవుని వాక్కుకు జన్మనిచ్చింది. ఈ సత్యమును అంగీకరించని వానికి బహిష్కరణ".

నేస్తోరియస్ మరియను 'దేవుని తల్లి' అని సంబోధించడానికి నిరాకరించాడు. దానికి మొదటి కారణం మరియశాస్త్ర పొరపాటు కాదు, కాని క్రీస్తుశాస్త్ర పొరపాటు. అనగా యేసు గురించిన సత్యమైన ఉనికిని గురించిన పొరపాటు. అసలు నేస్తోరియస్ పొరపాటు ఏంటి? నేస్తోరియస్, యేసుక్రీస్తు

వ్యక్తిత్వమును విభజించి, యేసు క్రీస్తు వాస్తవముగా ఇద్దరు వేరు వేరు వ్యక్తులు అని తప్పుగా అర్థం చేసుకున్నాడు. అందుకే మరియ కేవలము 'మానవుడైన యేసు' కు మాత్రమే తల్లి, దేవుని తల్లి కాదు అని నమ్మాడు. ఎఫేసు సమావేశము ప్రకటించిన 'తెయోటొకోస్', మరియ దేవుని తల్లి అను సిద్ధాంతము వాస్తవానికి యేసు గురించిన సత్యమును సంరక్షించడానికి దోహదపడుతుంది. ఏమిటి ఈ యేసు నిజమైన తత్వం: యేసు రెండు తత్వాలు కలిగిన ఒక దివ్య వ్యక్తి, అతనిలో దైవ స్వభావము మానవ స్వభావము అను రెండు తత్వాలు విడదీయలేనంతగా ఏకమై ఉన్నాయి, కాబట్టి యేసు ఒకేఒక దివ్య వ్యక్తి. మరియ శాస్త్రము క్రీస్తు శాస్త్రమును పరిరక్షిస్తుంది అని ఈ ఎఫేసు సమావేశము రుజువుచేసింది. ఆదిమ శ్రీసభలో ఇటువంటి సందర్భాలు చాలానే ఉన్నాయి. మన ప్రభువైన యేసుక్రీస్తు గురించి ఏదైనా విశ్వాస సత్యానికి ఎటువంటి స్పష్టత లోపించినా దానిని 'మరియ' కు ఆపాదించి అధ్యయనం చేసేవారు. అప్పుడు క్రీస్తు శాస్త్రములో పరిపూర్ణత కనిపించేది. ఈవిధముగా, మరియ సిద్ధాంతము యేసుక్రీస్తు సిద్ధాంతమునకు ఒక ఆధారముగా, ఒక ఆకారముగా, ఒక సంరక్షణగా ఉంటుంది.

## 2. మాతృత్వ లక్షణం:

మరియ దివ్య మాతృత్వమును అర్థం చేసుకోవాలంటే, ముందుగా అసలు మాతృత్వం యొక్క తత్వం ఏమిటి అని గ్రహించాలి.

మాతృత్వం అనునది ఒక స్త్రీ తను కలిగిన తత్వముతో మరొకరికి జన్మనిచ్చు ఒక ప్రక్రియ. ఈ ప్రక్రియకు ఒక క్రమము ఉంటుంది: మొదటగా బిడ్డ ఉద్భవిస్తుంది, తదుపరి తొమ్మిది నెలలు కడుపులో పెరుగుతుంది, చివరగా పుడుతుంది. ఈ క్రమము యొక్క ప్రతిఫలము: కేవలం భౌతిక దేహమునకు మాత్రమే జన్మనివ్వడం కాదు, కుమారుడైనా కుమార్తె అయినా పరిపూర్ణ బిడ్డకు జన్మనివ్వడం. దీనినే మాతృత్వ ఉత్పత్తి అంటాము. ఉదాహరణకు: బాప్తిస్మ యోహాను తల్లి ఎలిజబెతమ్మ. ఆమె పరిపూర్ణ యోహాను అను వ్యక్తికి తల్లి గాని, కేవలము యోహాను శరీరానికి కాదు. ఎలిజబెతమ్మ యోహాను ఆత్మకు జన్మనివ్వలేదు, ఎందుకంటే ఆత్మ దేవుని చేత నిర్మించబడింది, బిడ్డకు

అందించబడింది. ఇది మనకు తెలుసు. అయినప్పటికీ, యోహాను అను పరిపూర్ణ వ్యక్తికి ఆమె జన్మనిచ్చింది. కాబట్టి, మాతృత్వం అనగా తనలాంటి ఒక వ్యక్తికి జన్మనివ్వడం. పరిపూర్ణ వ్యక్తికి జన్మనివ్వడం. ఇటువంటి అర్ధమును మరియకు ఆపాదించినపుడు, ఆమె నిజముగా 'దేవుని తల్లి' అని పిలువబడుతుంది.

అసలు మరియ తన కుమారుడు యేసుకు తన మాతృత్వం ద్వారా ఏమి ఇచ్చింది? ముందుగా, ఆమె యేసుకు ఏమి ఇవ్వలేదో చూద్దాం. ఆమె యేసుకు దైవస్వభావమును ఇవ్వలేదు. ఆమె యేసుకు దైవ వ్యక్తిత్వమును ఇవ్వలేదు. ఎందుకంటే యేసు ఒక దివ్య వ్యక్తిగా, దివ్య స్వభావములో శాశ్వతంగా ఉన్నవాడు. కాబట్టి మరియ వీటికి జన్మనివ్వలేదు. అయితే 'కాలము పరిపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను, ఆయన ఒక స్త్రీ మూలమున ఈ లోకమున ప్రవేశించెను' (గలతీ 4:4). మరియ యేసుకు తన దగ్గర ఉన్న, తనదైన, తనలాంటి మానవ స్వభావమును ఇచ్చింది. ప్రతి తల్లి తన బిడ్డకు జననములో ఇచ్చిన విధముగానే ఇచ్చింది. అయితే యేసుని మానవ స్వభావము దివ్యవ్యక్తియైన క్రీస్తు దివ్య స్వభావముతో విభజింపబడలేని ఒక ఐఖ్యతను కలిగి ఉంది. అనగా, మరియ నిజమైన దేవునికి, తన ద్వారా నిజమైన మానవునికి జన్మనిచ్చింది. అనగా, మరియ మనుష్యవతారము దాల్చిన దైవవాక్కుకు ఒక శరీరమును అందించింది, అందువలన, ఆమె దేవుని తల్లి అని ప్రకటింపగలము. దీని మూలముగా, యేసు 'దేవుని కుమారుడు' మరియు 'మరియ కుమారుడు' అని పిలువబడతాడు. యేసు దేవుని కుమారుడు, ఎందుకన, తన దివ్య స్వభావమును శాశ్వతముగా తండ్రి నుండి పొంది ఉన్నాడు. యేసు మరియ కుమారుడు, ఎందుకన, తన మానవ స్వభావమును, భూలోక తల్లి యైన మరియ నుండి పొంది ఉన్నాడు.

పరిశుద్ధ కన్య మరియ దివ్య మాతృత్వం, దాని ఔనత్యం గురించి ద్వితీయ వాటికన్ మహా సమావేశం ఇలా మాట్లాడుతుంది:

"ఆమె మహోన్నతమైన కార్యముతో, దైవకుమారుని తల్లిగా ఉండు ఉన్నతమైన ఆశయంతో అనుగ్రహించబడింది. అందువలననే, ఆమె తండ్రికి ప్రియమైన కుమార్తెగా, పవిత్రాత్మకు పరిశుద్ధమైన ఆలయంగా మలచబడింది.

ఈ తేజోమయమైన అనుగ్రహ వరముతో నింపబడినది కాబట్టి ఆమె పరలోక భూలోకమందలి సకల జీవరాసులకంటే మిన్నగా మహోన్నతంగా వెలుగొందుతుంది" (లూమెన్ జేన్సియుం, 53).

మరియ గురించిన అన్ని వేదాంతసిద్ధాంతాలలో ప్రముఖమైనది, ప్రధానమైనది: మరియ దివ్య మాతృత్వం. మరియ యెడల భక్తిలో లీనమైనపుడు, ఆమె అమోఘమైన మహిమలలో, రహస్యాలలో మునిగిపోవడం చాలా సులభం. మరియను నిష్కళంక ఉద్భవిగా, మోక్ష రాణిగా కొనియాడుతుంటాము. అది సరియైనదే. అయితే మనం ఒక సత్యమును మరువరాదు. ఆమె బహుబిరుదులు నిష్కళంక ఉద్భవి, రాణి, కన్య, వాగ్దత్త మందసం, అసత్యాల వినాశిని, సహరక్షకి. వీటి అన్నిటినీ మించి, వీటి అన్నిటికీ పునాదిగా ఆధారముగా ఉంది మాత్రం ఆమె 'దివ్య మాతృత్వం' – తెయోతోకోస్ – దేవుని తల్లి. మరియకు ఇవ్వబడిన అరుదైన, అందమైన, అమూల్యమైన అనుగ్రహం, బహుమానం: దివ్య మాతృత్వం. ఆమె దేవుని తల్లిగా ఎన్నిక చేయబడింది కాబట్టి మిగిలిన అన్ని అనుగ్రహాలు ఆమెకు ఇవ్వబడినాయి. ఆమె దేవుని తల్లిగా ఉండాలి కాబట్టి, నిష్కళంకముగా జన్మించింది, ఎప్పటికీ పాపము ఆమెను సోకలేదు, నిత్య కన్యకగా ఉండిపోయింది, రక్షణ కార్యంలో పరిపూర్ణ సహకారిగా తన పాత్ర నిర్వహించింది, అన్నిటికీ మించి, ఆత్మశరీరములతో మోక్షమునకు ఎత్తబడింది, శాశ్వతంగా రాణిగా పరిపాలిస్తుంది. ఇందంతా కేవలం ఆమె 'దివ్య మాతృత్వ' ప్రతిఫలాలే.

ఇది మన విశ్వాసము. అనేక మంది దీనిని అంగీకరించకపోవొచ్చు. అయితే ఫాదర్ రెజినాల్డ్ గార్రిగౌ లగ్రాన్, తోమిస్టిక్ వేదాంతి, తన గ్రంథం "రక్షకుని మాత – మన అంతరంగ జీవితాలు" లో మరియ తత్వం గురించి ఇలా రాస్తున్నాడు: "మన పరిశుద్ధ మరియమ్మ గురించి రెండు సత్యాలు పర్వత శిఖరాల వలె ప్రతిబింబిస్తున్నాయి. ఈ రెండింటి చుట్టూ మిగిలిన అన్ని లక్షణాలు పరిభ్రమిస్తున్నాయి. ఆ రెండు సత్యాలు: ఒకటి – ఆమె దివ్య మాతృత్వం, రెండు – ఆమె పరిపూర్ణ అనుగ్రహము. ఈ రెండు సత్యాలు సువార్తలోను మరియు శ్రీసభ సమావేశాలలోనూ దృవీకరించబడినాయి."

ఎఫేసు మహాసభ అంటుంది: పరిశుద్ధ కన్య మరియ క్రీస్తుని తల్లి కాబట్టి ఆమె నిజముగా వాస్తవముగా దేవుని తల్లి.

పునీత తోమాస్ ఇలా అంటాడు: ఉద్భవం – జననం ఒక వ్యక్తికి ఆపాదించబడిన అంశాలు. హైపోస్టాసిస్ (కలయిక ఐఖ్యత) ఉద్భవించి జన్మించిన వ్యక్తి 'స్వభావము' నకు సంబందించినది. కావున, దివ్యమైన వ్యక్తి (ఆదిలో వాక్కు) ఉద్భవ మొదటి క్షణమునుండే మానవ స్వభావమును తీసుకున్నాడు, కాబట్టి, దీనిని బట్టి మనకు అర్ధం అవుతుంది: దేవుడు ఒక కన్య ద్వారా ఉద్భవించాడు, జన్మించాడు. అందువలన, ఆమె నిజముగా దేవుని తల్లి.

పరిశుద్ధ కన్య మరియ మొదటగా దివ్య మాతృత్వ అనుగ్రహముతో నింపబడింది. దానికి పర్యవసానంగా ప్రతిఫలంగా ఆమె పరిపూర్ణ మహిమతో, వరములతో దీవించబడింది. ఈ వరములు ఆమెను దేవుని తల్లిగా నిలబెట్టడానికి ఉపయోగపడుతున్నాయి. తొమ్మిదవ భక్తినాధ పాపుగారు తన పత్రములో ప్రస్తావించాడు: అనిర్వచనీయ దేవుడు ప్రారంభంనుండి శాశ్వతంనుండి తన జనితైక కుమారునికి ఒక తల్లిని ఎన్నుకున్నాడు, క్రమపరచాడు. కాలము పరిపూర్ణమైనపుడు ఆమె నుండి తన ఏకైక కుమారుడు ఈ లోకములో మానవ శరీరాన్ని ధరించాలి. అందుకొరకే అన్ని జీవరాసులకంటే మరియను అమితంగా ప్రేమించాడు, ఆమెలో ఉన్నతమైన ఆనందమును కనుగొన్నాడు, అంతేకాదు అన్ని ప్రాణులకంటే అధికంగా ఆమెను అనుగ్రహించాడు. మనుష్యవతార దైవీక విజ్ఞానంలో తన కుమారుని ఈ లోకమునకు పంపించు ప్రక్రియలో దేవుడు ఆమెను ఎన్నుకున్నాడు.

మనుష్యవతార రహస్యం కేవలం ఒక ఊహ కాదు. అది దైవీక శాశ్వత క్రమములో భాగము. అది దైవీక సంకల్పం ప్రకారం చరిత్రలో వాస్తవముగా చోటుచేసుకున్న సంఘటన. ఒక మరియ అను కన్య ద్వారా దైవకుమారుడే మానవునిగా జన్మించిన మహా సంఘటన. దీనినే నిసేయ – కాన్స్టంటినోపుల్ విశ్వాస ప్రమాణ సూత్రము. అందువలన, ఈ శాశ్వత క్రమము ప్రకారమే మానవునిగా పుట్టిన క్రీస్తు వాస్తవముగా దేవుని కుమారునిగా, పరిశుద్ధ కన్య మరియ దేవుని తల్లి గా ఉండాలని నిర్దేశింపబడింది. క్రీస్తు ఫలముల ద్వారా

రక్షణను స్వీకరించు వారందరికీ, అంతేకాదు, మానవాళి మహిమ, అనుగ్రహమును పొందు వారందరికీ ఈ శాశ్వత ప్రణాళిక ఆధారము. అనగా, తత్వములో క్రీస్తు దేవుని కుమారునిగా ముందుగానే నిర్ణయింపబడి మహిమకు పాత్రుడయ్యాడో, అలాగే పరిశుద్ధ కన్యమరియ కూడా దైవ ప్రణాళికలో దేవునితల్లిగా ముందుగానే ఎన్నిక చేయబడి, మహిమకు పాత్రురాలిగా పరిపూర్ణ అనుగ్రహముతో నింపబడింది. మరియ దేవుని తల్లిగా ముందుగానే నిర్ణయింపబడినది కాబట్టి, దానికి సిద్ధపాటుగా ఆమెకు మహిమ అనుగ్రహము ఇవ్వబడినాయి. కాబట్టి, దేవుని ఆలోచనలో ముందుగా మరియ 'దేవుని తల్లి' గా నిర్దేశింపబడింది. అందువలననే ఆమెను దేవుడు అమితమైన అనుగ్రహాలతో నింపాడు.

## 3. మరియ దివ్య మాతృత్వం - ఆధిక్యతకు ఆధారాలు

మొదటిది - మరియ ముందస్తు ఎన్నిక: సంపూర్ణ ఉచిత వరము. పరిశుద్ధ కన్య మరియ తాను పొందిన అనుగ్రహ పరిపూర్ణత ద్వారా శాశ్వత జీవితమును పొందగలదేమో గాని, మనుష్యవతార వరమును పొందలేదు, కాబట్టి దివ్య మాతృత్వ వరమును కూడా పొందలేదు. దానిని దేవుడే స్వయముగా మరియను ఎన్నుకొని ఆమెకు ఆ వరమును అందించి ఉన్నాడు. కాబట్టి, అది మరియ స్వయంకృషి కాదు, దేవుని శాశ్వత ఉచిత అనుగ్రహము.

రెండవది - మరియ దివ్య మాతృత్వం: ఒక ఔనత్యం. దివ్య మాతృత్వం మరియ కోరుకుంటే వచ్చినది కాదు. అది మనుష్యవతారం దాల్చిన వాక్కుకు సంబందించినది. అనగా, మహోన్నత స్థితికి చెందినది. దైవీక లక్షణానికి, ఆదిలో వాక్కు తత్వానికి చెందినది. అందుకే అది అనుగ్రహము, మహిమకు అతీతముగా ఉండునది. అంతటి ఔనత్యముగల దివ్య మాతృత్వంతో మరియ ఆశీర్వదించబడింది.

మూడవది - మరియ దివ్య మాతృత్వం: సకల అనుగ్రహాలకు ఆధారం. దేవుడు మరియను తన కుమారునికి తల్లిగా ఎన్నుకున్నాడు కాబట్టి సంపూర్ణ అనుగ్రహాలతో దీవించినాడు. వాటికి ఆధారము, వాటికి అంతము దివ్య మాత్రుత్వమే. అందుకే దివ్య మాతృత్వం అన్ని అనుగ్రహాలకు మూలము అని

వేదాంత ప్రబోధనలలో కనిపిస్తుంది.

నాలుగవది – మరియ దివ్య మాతృత్వం: మరియ గౌరవమునకు కారణము. మరియ దేవుని తల్లి కాబట్టి ఆమె పరిపూర్ణ అనుగ్రహాలకు నిలయము, పునీతులందరికంటే అతీతము, తాను పొందుతున్న ఉన్నతమైన విశ్వాస భక్తి గౌరవములకు ఆధారము. మరియలో అన్ని అనుగ్రహాలు సంపూర్ణముగా ఉన్ననూ, ఆమె దేవుని తల్లి కాకపోయి ఉంటే, ఇంతటి గౌరవము భక్తికార్యమునకు పాత్రురాలు అయ్యి ఉండేది కాదు. అందుకే ముందు దివ్యమాతృత్వం. దాని ప్రతిఫలం ఉన్నతమైన గౌరవం.

ఐదవది – మరియ దివ్య మాతృత్వం: పరిపూర్ణ అనుగ్రహము కంటే అధికమైనది. అసలు దేవుని తల్లిగా ఉండాలని ఆయనే మరియను ముందుగానే నిర్ణయించక పోయి ఉంటే, అనగా, దివ్య మాతృత్వ వరముతో నింపకపోయి ఉంటే, మిగిలిన అన్ని వరాలు, అనుగ్రహాలు ఆమెకు అంది ఉండేవి కాదు. అనగా, ఆమె దివ్య మాతృత్వంతో ఆమె అన్ని వివేకముల సామర్థ్యం కంటే ఆమె ఆధ్యాత్మిక ఆత్మ ఉన్నతముగా మలచబడింది.

శ్రీసభ ప్రబోధనలలో భాగంగా 'మరియ దివ్య మాతృత్వం' అను ఈ విశ్వాస సత్యం ప్రభువు నుండి అపోస్తలుల ద్వారా వారి వారసుల ద్వారా విశ్వాసులకు అందించబడిన వారసత్వ సంపద. ఈ విశ్వాస సత్యము క్రమము తప్పకుండా బోధించబడింది. అయితే శ్రీసభ కంటే తమకే ఎక్కువ జ్ఞానము ఉందని, తమకే ఎక్కువగా తెలుసునని అనుకొని గందరగోళమునకు గురియై కొన్ని తప్పుడు సిద్ధాంతాలకు, అసత్య ప్రబోధనలకు పాల్పడుతున్నారు. అసలు ఆదిలోని మత విరుద్ధ సిద్ధాంతాలలో ప్రధమమైనవి: యేసుక్రీస్తు దైవత్వం గురించిన అపోహ, మరియతల్లి దివ్య మాతృత్వం గురించిన అసత్య ప్రబోధము. మరియతల్లి దివ్య మాతృత్వం గురించి అనుమానం లేదా అసత్యం ప్రకటించినా అది పరోక్షంగా యేసుక్రీస్తు గురించి ఒక విరుద్ధ వాస్తవమును ప్రకటించినట్లే అని గ్రహించాలి. దివ్య మాతృత్వ సిద్ధాంతమునకు విరుద్ధముగా మాట్లాడింది 428వ సంవత్సరంలో నేస్తోరియస్ అను ఒక మత గురువు.

## 4. నేస్తోరియనిజం - ఎఫేసు సమావేశ తీర్మానం:

మరియ దివ్య మాతృత్వం శ్రీసభలో బోధింపబడిన సత్యము. అయితే ఇంకా దానిని ఒక విశ్వాస ప్రకటనగా నిర్వచింపబడలేదు. మరియ 'దేవుని తల్లి' అని నేస్తోరియనిజం అను విశ్వాస ఘాతుకమును తొలగించి విశ్వాస సత్యమును ప్రకటించడంలో ఈ సిద్ధాంతం వెలువడింది. నేస్తోరియస్ కాంస్తంటినోపుల్ కి మతాధిపతి. అతడు మోప్సుయేస్తియా మేత్రానులు తియోదోర్ శిష్యుడు. ఈ తియోదోర్ తార్సుస్ మేత్రానులు దియోదోరుస్ శిష్యుడు. వీరందరూ అంటియోకియా వేదాంత పాఠశాలకు చెందినవారు. క్రీస్తు దైవత్వ లక్షణం, మానవత్వ లక్షణం గురించిన చర్చలో అంటియోకియా, అలేక్సాంద్రియా వేదాంత పాఠశాలలు పరిస్పర విరుద్ధ సిద్ధాంతాలతో గొడవపడుతూ ఉండేవారు.

అంటియోకియా వేదాంత పాఠశాల క్రీస్తులోని మానవ దైవ స్వభావాలను అతిగా విభజించడానికి పూనుకున్నారు. మానవత్వంతో దైవత్వ కలయికను మానవుడైన క్రీస్తులో రెండవ దైవీక వ్యక్తి వసియించాడు అని వారు ప్రకటించారు. అనగా క్రీస్తులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వారు తలంచారు. ఇద్దరు వ్యక్తులు ఉన్నారు కాబట్టి క్రీస్తులో రెండు స్వభావాలు ఉన్నాయి అని వారు భావించారు: "దేవుని కుమారుడు వేరు, దావీదు కుమారుడు వేరు". నేస్తోరియుస్ మతవిరుద్ధ అసత్య ప్రచారానికి ఇదియే ఆధారము.

మరోవైపు అలేక్సాంద్రియా వేదాంత పాఠశాల, దైవత్వంతో మానవత్వ కలయికను విపరీత ధోరణిలో చూశారు. చివరకు ఒకే స్వభావంలో రెండు స్వభావాలు కలిసాయి అని వివరించడానికి ప్రయత్నించారు. క్రీస్తు ఒకే వ్యక్తి కాబట్టి, క్రీస్తులో వారు ఒకే ఒక స్వభావమును కనుగొన్నారు. క్రీస్తు ఒక్క వ్యక్తి కాబట్టి, ఒక్క స్వభావమే అని ప్రకటించారు. దీనిని ఏక స్వభావ సిద్ధాంతము (మోనోఫిజిటిజం) అంటారు. ఈవిధముగా, ఈ రెండూ వేదాంత పాఠశాలలు కడకు క్రీస్తు గురించి తప్పుడు సిద్ధాంతాల ప్రకటనలో పడిపోయాయి. క్రీస్తు గురించి తలెత్తిన ఈ అసత్య సిద్ధాంతాలు మరియ 'దివ్య మాతృత్వము' ను కూడా సందేహించాయి, నిరాకరించాయి. అయితే మరియ 'దేవుని తల్లి' (తియోటోకోస్) అను విశ్వాస సిద్ధాంతమును నిరాకరించింది మాత్రం

అంటియోకియ వేదాంత పాఠశాల నుండియే. దియోదోరుస్ మరియు తియోదోర్ ప్రకారం దేవుని వాక్కు మానవ క్రీస్తులో 'ఒక దేవాలయంలో నివసించినట్లు' వసియించాడు. కాబట్టి, వారి ప్రకారం మరియ దేవుని తల్లి కాదు. మరియ గర్భం ధరించి జన్మను ఇచ్చింది వాక్కు ఐయినటువంటి దివ్య వ్యక్తికి కాదు, కాని కేవలం దేవుడు తన స్వభావములో నివసించిన మానవుడైన క్రీస్తుకు ఆమె జన్మనిచ్చింది అని వారు ప్రబోధించారు.

నేస్తోరియుస్ తప్పుడు సిద్ధాంతం కొత్తదేమీ కాదు. అప్పటికే మరియ దేవుని తల్లి కాదు అని ప్రబోధించిన దియోదోరుస్ మరియు తియోదోర్ సిద్ధాంతమును నేస్తోరియుస్ మరోసారి బయటకు తీసుకొని వచ్చి ఒక విశ్వాస సత్యముగా లేవనెత్తాడు. నేస్తోరియుస్ తప్పుడు ప్రచారమును పదకొండవ పయస్ పాపుగారి మాటలలో ఈ విధముగా గ్రహించగలము. నేస్తోరియస్ అను ఒక గర్విష్టి క్రీస్తు గురించి తప్పుడు సిద్ధాంతమును బోధించాడు. క్రీస్తులో మానవుడైన యేసు, దివ్యమైన వాక్కు అను రెండు పరిపూర్ణ వ్యక్తిత్వాలు (హైపోస్తాసెస్) ఒకే వ్యక్తిలో (హైపోస్తాతిస్) ఐక్యమై ఉన్నాయి అని భావించాడు. తద్వారా, రెండు తత్వాల మధ్య ఉన్న దైవత్వ కలయికను నిరాకరించాడు. దానికి ప్రతిఫలంగా, జనితైక సుతుడు, దేవుని వాక్కు, నిజముగా మానవుడు కాలేదు, మానవ శరీరములో ఆయన సన్నిధి కేవలము ఒక దేవాలయములో నివసించినట్లు ఉంటుంది అంతే. ఇది దైవీక సంకల్పం ప్రకారం, ఆయన క్రియాశక్తి ప్రభావమున ఈ సన్నిధి చోటుచేసుకుంది అని అన్నాడు. దీని మూలముగా, ఆయనను దేవుడు అని పిలువకూడదు, దేవుని మోయువాడు (తియోఫోరోన్ – గాడ్ బేరర్) అని పిలవాలి, ప్రవక్తలు పరిశుద్ధులు మానవాళికి దైవానుగ్రహమును అందిస్తూ ఏవిధంగా దేవుని మోయువారు అని పిలువబడతారో అదే విధంగా క్రీస్తు కూడా దేవుని మోయువాడు అని పిలవబడతాడు అని నేస్తోరియుస్ వివరించాడు.

నేస్తోరియుస్ తన కార్యదర్శి అనస్తాసియుస్, దోరోతేయుస్ మార్సియానోపోలిస్ మేత్రానులు ఇద్దరు కూడా మరియను దేవుని తల్లి అని ఎవరూ సంబోధించకూడదు అని ప్రజలకు ఆజ్ఞాపిస్తూ వారి ప్రసంగాలలో ప్రస్తావిస్తూ

ఉండగా, వారిని సంరక్షిస్తూ వారికి అనుకూలముగా మాట్లాడుతూ తన ప్రబోధనను ప్రకటించాడు. ఇలా అందరూ ఒక్కుమ్మడిగా మరియ దివ్య మాతృత్వమును నిరాకరించడం మాత్రమే గాక, ఆ తప్పుడు సిద్ధాంతమును ప్రజలకు బోధించడం మొదలుపెట్టారు. ముఖ్యముగా నేస్తోరియుస్ తన ప్రసంగాలలో దీనినే ప్రధాన అంశముగా ప్రకటించడం చేస్తున్నాడు. నేస్తోరియుస్ తన వాక్చాతుర్యంతో కాంస్తంటినోపుల్ అధిపతిగా తన అధికార శక్తితో మరియ దేవుని తల్లి కాదని నిరూపించడానికి శాయశక్తుల కృషి చేసాడు. అతని ప్రబోధనతో ఊహించిందే జరిగింది. అనేకమందిలో అవిశ్రాంతి, ఆందోళన చోటుచేసుకున్నాయి. దాదాపు యాభై ఏళ్ళుగా మరియ దేవుని తల్లి అని విశ్వసిస్తూ వస్తున్న ప్రజలలో విశ్వాస అలజడి ప్రారంభమైంది. అసలు మరియ 'దేవుని తల్లి' నా, కాదా అను సంగ్దిగ్ధంలో ప్రజలు పడిపోయారు. ఈ సందర్భంలో ఈ మత విరుద్ధ సిద్ధాంత ప్రబోధనను అరికట్టడానికి సమావేశం అవసరమై ఉంది.

దేవుని కృపావరం శ్రీసభకు ప్రజలకు అందుబాటులో ఉంది. ఒకప్పుడు జ్ఞానసిద్ధాంతులను (గ్నోస్టిసిజం) ఎదిరించి వారి తప్పుడు సిద్ధాంతాలను నిర్మూలించడానికి పునీత యిరేనియుస్ ను దేవుడు పంపించాడు. ఒకప్పుడు ఏరియనిజంను విష ప్రచారమును త్రోసిపుచ్చి వాస్తవాన్ని ప్రబోధించడానికి దేవుడు పునీత అతనాసియుస్ ను పంపించాడు. అదేవిధంగా ఇప్పుడు కూడా దేవుని కృప శ్రీసభలో ప్రవేశించింది. నేస్తోరియుస్ తప్పుడు ప్రచారమును విభేదించి సత్యమును స్థాపించడానికి దేవుడు అలేక్సాంద్రియ సిరిల్ ని పంపించాడు. నేస్తోరియుస్ ప్రమాదకర సిద్ధాంతమును సిరిల్ గమనించాడు, ఇది మంచిది కాదు అని గ్రహించాడు. వెంటనే నెస్తోరియుస్ కు వ్యతిరేఖముగా, సిరిల్ తన పత్రాలను, ప్రసంగాలను, సిద్ధాంతాలను తయారుచేసి 'మనుష్యవతార సిద్ధాంతము' ను, మరియ 'దివ్య మాతృత్వ సిద్ధాంతము' ను పునరుద్ధరించాలని సంకల్పించాడు. శ్రీసభ పితరులు పరిశుద్ధ కన్య మరియను దేవుని తల్లిగా సంబోధించడంలో వెనకాడలేదు. మరియ దేవుని తల్లి అంటే, వాక్కు తత్వము, అతని దివ్యత్వం పరిశుద్ధ కన్య నుండి ఉద్భవించింది అని కాదు. అయితే

క్రీస్తు మరియ నుండి తన దివ్యత్వముతో ఏకమైన పవిత్ర శరీరమును మహోన్నత తీరులో (హైపోస్టాటిక్) తీసుకొని తన జ్ఞానాత్మతో నడిపించాడు, అనగా వాక్కు మానవ శరీరములో జన్మించింది అని అర్ధము. ఈ శ్రీసభ పితరుల విశ్వాస సిద్ధాంతమును అంగీకరించమని సిరిల్ నేస్తోరియుస్ ను అర్ధించాడు.

అయితే నెస్తోరియుస్ ఈ వాస్తవమును గ్రహింపలేని అజ్ఞానంలో ఉండిపోయాడు. దేవుని వాక్కుగా క్రీస్తు ఎలా మనిషిగా జన్మించాడో, మనిషిలా ఎలా బాధలను అనుభవించాడో, ఎలా మరణించాడో అను సత్యాలను తెలుసుకోలేక పోయాడు. అందుకే దేవుని తల్లిగా కాకుండా 'క్రీస్తు తల్లి' అని మరియను సంబోధించడం కొనసాగించాడు. ఈ సందర్భంలో 'మరియను దేవుని తల్లి' గా ఎందుకు పిలవాలో అను సిరిల్ సిద్ధాంతం మరియ శాస్త్రములో ఒక వేదాంతముగా నిలిచిపోతుంది. సిరిల్ ప్రబోధం ఇది: "వాక్కు నిజముగా దేవుడు, అయితే ఆ వాక్కు మానవుడయ్యాడు. అతడు శరీరము ప్రకారము జన్మించాడు కాబట్టి, ఈ మానవత్వం అవసరమై ఉంది కాబట్టి, అందుకే ఆ దివ్య వాక్కుకు ఆమె జన్మనిచ్చింది కాబట్టి, ఆమెను 'దేవుని తల్లి' అని పిలవడం సమంజసం. మరియ అసలు దేవునికి జన్మనివ్వక పోయి ఉంటే, ఆమె నుండి జన్మించిన వానిని కూడా దేవుడు అని పిలవలేము. అయితే, పరిశుద్ధ గ్రంథము అతనిని దేవుడు అని పిలుస్తుంది కాబట్టి, ఒక స్త్రీ ద్వారా తప్ప ఒక మానవుడు లోకములోనికి రాలేడు కాబట్టి, ఆమె మానవునిగా మారిన దేవునికి జన్మనిచ్చింది కాబట్టి మరియ దేవునికే జన్మనిచ్చింది. మరి అటువంటి మరియ దేవుని తల్లి కాకుండా ఎలా ఉంటుంది. ఇది సిరిల్ వివరణ.

నేస్తోరియుస్ ముందుగా కొన్ని ఉత్తరాల ద్వారా, తర్వాత సిరిల్ కూడా కొన్ని పత్రాల ద్వారా ఇద్దరూ పాపుగారిని ఆశ్రయించారు. 430 సంవత్సరంలో రోమ్ నగర సినడ్ సమావేశం నేస్తోరియుస్ ప్రబోధనను తిరస్కరించింది. నెస్తోరియుస్ పది రోజులలో తన తప్పు తెలుసుకొని, తన తప్పుడు సిద్ధాంతాన్ని మార్చుకొని, నిజమైన విశ్వాసమును అంగీకరించకుంటే, అతనిని బంధించి, బహిష్కరించమని సెలేస్టిన్ పాపుగారు సిరిల్ కి అధికారమును ఇచ్చాడు. సిరిల్ 'బహిష్కరణ'ల పత్రాన్ని సిద్ధం చేసి, నెస్తోరియుస్ కి పంపించాడు. అయితే

అప్పటికే రెండవ థియోదోతియుస్ చక్రవర్తి మరుసటి సంవత్సరమే, అనగా 431 సంవత్సరంలో సిరిల్ కి వ్యతిరేఖముగా పెంతెకోస్తు సమావేశమును ఏర్పాటు చేసాడని సిరిల్ రాయభారులు తెలుసుకున్నారు. అయితే అప్పటికే నెస్తోరియుస్ కొద్దిగా మారి మరియ 'దేవుని తల్లి' అని దాదాపుగా అంగీకరించాడు. ఎప్పుడైతే సిరిల్ బహిష్కరణల పత్రము కాంస్తంటినోపుల్ మరియు అంటియోకుకు చేరిందో అప్పటికే సిరిల్ పై వ్యతిరేఖత పెరిగి అతనిని తిరస్కరించారు.

## 5. ఎఫేసు సమావేశం సారాంశం:

సిరిల్ ఎంతో నిరాదరణను ఎదుర్కొన్నాడు. ఇంత తిరస్కరణ మధ్యలో కూడా చివరకు జూన్ 22న సమావేశమును ఏర్పాటు చేసాడు. అప్పటికీ ఇంకా ఎంతో దీర్ఘంగా వేచియున్న పాపుగారి రాయబారులు ఇంకా రాలేదు, అంటియోకియా అధిపతి అతని బృందము కూడా ఇంకా రాలేదు, అయినా సిరిల్ ఆగలేదు. సమావేశం మొదలు పెట్టాడు. సమావేశ మొదటి సెషన్ లోనే సిరిల్ నెస్తోరియుస్ ను ఉద్దేశించి పొందుపరచిన ఉత్తరాలను చదివి వినిపించారు, సమావేశ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా దానిని ఆమోదించారు. దానితో నెస్తోరియుస్ ను బహిష్కరించి చెరసాలకు పంపించారు. చరిత్రకారుల ప్రకారం, ఈ పత్రము ఆమోదింపబడిన ఆరోజు రాత్రి, ఎఫేసు వీధులన్నీ కూడా ఉత్సాహవంతమైన జనులు గుమికూడి ఒకే మాటతో బిగ్గరగా కేకలు పెట్టారు: హాగియా, మరియ తెయోటోకోస్  ఆవే మరియ, దేవుని తల్లి. ఈ విశ్వాస మహా కేక ఇప్పటికీ చెక్కు చెదరకుండా కతోలికుల పెదాలపై తొణికిసలాడుతుంది.

నాలుగు దినముల తర్వాత, అంటియోకియ మతాధిపతి జాన్ వచ్చాడు. సిరిల్ ఏర్పాటు చేసిన సమావేశం చట్టవ్యతిరేకమైనది అని ప్రకటించాడు. నేస్తోరియుస్ కు అనుకూలంగా, సిరిల్ కి వ్యతిరేకముగా మరో సమావేశమును ఏర్పాటు చేసాడు. ఈలోపు పాపుగారి రాయబారులు అరుదెంచారు. సిరిల్ సమావేశపు నిర్ణయాలను తిరిగి సమీక్షించి వాటిని అధికారపూర్వకంగా ఆమోదించారు. సిరిల్ సిద్ధాంతం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. అయితే బహిష్కరణ ఉత్తరాలు మాత్రము ఆ సమావేశంలో బయట పెట్టకుండా, వాటి

గురించి రెండవ కాంస్తంటినోపుల్ సమావేశంలో మాట్లాడాలి చర్చించాలని భావించారు. ఇది అందరి ప్రశంసను పొందింది.

సిరిల్ సిద్ధాంతంలోని ప్రముఖమైన భాగమును ఇక్కడ పొందుపరచడం సమంజసనీయం: “వాక్కు తత్వం మానవునిగా మారిందని మేము భావించడం లేదు. అలాగని, ఆ వాక్కు సంపూర్ణంగా ఆత్మ శరీరములు కలిగిన మానవునిగా మారిపోయిందని కూడా మేము అనుకోవడం లేదు. మేము ఏమి విశ్వసిస్తున్నాము అంటే: దైవవాక్కు తన వ్యక్తిత్వానికి సహేతుకమైన ఆత్మతో నడిపింపబడు ఒక శరీరమును జతపరచుకొని, వివరణకు సాధ్యముకాని, మానవ అవగాహనుకు అతీతమైన తీరులో మానవునిగా జన్మించాడు. ఇది కేవలము సంకల్పం లేదా అవసరం వలన కాదు. ఇది మానవ వ్యక్తిగా జన్మించాలని కూడా కాదు. నిజముగా ఒకటిగా ఏకమైన రెండు తత్వాలు కూడా వేరువేరుగా ఉన్న స్వభావాలు. అయితే ఈ రెండు స్వభావాల నుండి ఒకే క్రీస్తు, ఒకే కుమారుడు ఉన్నాడు. అంటే, రెండు స్వభావాల మధ్య వ్యత్యాసాన్ని ఈ కలయిక తొలగించి ‘ఏకం’ చేసిందని కాదు. పైగా, దైవత్వం, మానవత్వం రెండూ స్వభావాలు ‘క్రీస్తు – కుమారుడు’ ఒక పరిపూర్ణ ప్రభువును అందించాయి అని మా విశ్వాసం. ఇది ఒక అనిర్వచనీయమైన, పరమరహస్యమైన కలయిక. అంటే, ఒక సాధారణ మానవుడు పరిశుద్ధ కన్య మరియ నుండి మొదటగా జన్మించాడని, తర్వాత వాక్కు దిగివచ్చి ఈ మానవునిలో ప్రవేశించిందని కాదు. ఈ పరిశుద్ధ కలయిక వలన ఆ వాక్కు మార్పునకు నోచుకొని, శరీరముగా మారి, తల్లి గర్భమునుండి ఉదయించింది. ఈ వాక్కు తన జననమును తానే నిర్ణయించుకుంది, తన శరీరమును తానే ఎంచుకుంది. ఈ వేదాంతమును గ్రహించారు కాబట్టి శ్రీసభ పితరులు పరిశుద్ధ కన్య మరియను ‘దేవుని తల్లి’ అని సంబోధించదానికి వెనకాడలేదు.

ప్రముఖమైన సమాధానాలు ప్రముఖమైన సవాళ్ళనుండి వస్తాయి. అర్థం అయినా కాకున్నా అనేకమంది ఈ సమాధానాలను ప్రకటిస్తూ ఉంటారు. వేదాంతవేత్తల మధ్య, సాధారణ ప్రజల మధ్య వ్యత్యాసము అర్థం తెలియకపోయినా నమ్మిన సిద్ధాంతమును బాహాటముగా చాటుతూ ఉంటారు.

నాలుగవ శతాబ్దంలో చదవడం రాయడం తెలియని అనేకమంది విశ్వాస ప్రజలు 'హెూమూయిసియోస్' అని బిగ్గరగా కేకలు వేయడం మొదలు పెట్టారు. హెూమూసియోస్ అనగా, క్రీస్తు తండ్రి దేవుని తత్వంలో సమానంగా ఉన్నవాడు అని అర్ధం. ఐదవ శతాబ్దానికి వచ్చేసరికి ఈ సిద్ధాంతం గురించి ఒక బలమైన వేదాంతము సంతరించుకొని, శ్రీసభ విశ్వాస క్రియలలో ఒకటిగా మారిపోయింది. అనగా, మరియను 'దివ్య మాతృత్వము' తో గౌరవిస్తూ కొనియాడడం మొదలు పెట్టారు.

ఎఫేసు సమావేశం తర్వాత 'తియోటోకోస్' అనునది క్రైస్తవుల గుండె పాటగా మారిపోయింది. ప్రసంగాలలో అది గొప్పగా ప్రకటింప బడింది. పండగలలో ఆ విశ్వాస సత్యము మహోన్నతంగా కొనియాడబడింది. మరియ 'దేవుని తల్లి' అను నామముపై అనేక దేవాలయాలు నిర్మింపబడినాయి. దివ్యబలి పూజలో కూడా "మహిమోపేతమైన నిత్య కన్యక, దేవుని తల్లి" అని జ్ఞాపకం చేసుకోడం కూడా జరిగింది.

ఎఫేసు సమావేశం (431) నుండి నేటి వరకు కూడా నాలుగవ శతాబ్దపు శ్రీసభ పితరులు ప్రకటించిన 'హగియా మరియ తెయోటోకోస్' అను సత్యము క్రైస్తవ విశ్వాస సత్యాలలో ప్రధానమైనది అని నిరూపింపబడుతూనే ఉంది. క్రీస్తులోని పరిపూర్ణ మానవ స్వభావమునందు విశ్వాసం అవసరం. ఆ విశ్వాసం లోపిస్తే మరియ నిజముగా 'తల్లి' కాలేదు. మరియ కుమారుడు క్రీస్తు దైవత్వమునందు విశ్వాసప్రమాణము కావాలి. ఆ ప్రమాణము లోపిస్తే సాధారణ మనిషి 'దేవుని తల్లి' గా అర్థం కాదు. ఒకే దివ్య వ్యక్తియైన దైవ వాక్కులో రెండు వేరు వేరు స్వభావాలు మహోన్నత ఐఖ్యత (hypostatic union) లో ఇమిడి ఉన్నాయి అని విశ్వాస ప్రకటన చేయాలి. ఆ ప్రకటన లోపిస్తే, క్రీస్తు దేవుని కుమారునిగా, మరియ కుమారునిగా రెండింటిగా ఉండలేదు. స్వభావముల మధ్య ఈ మహోన్నత ఐఖ్యత మరియ తన కుమారుని తన గర్భములోనికి స్వీకరించిన మొదటి క్షణముననే చోటుచేసుకుంది అని ప్రబోధించాలి. ఈ ప్రబోధన లోపిస్తే, మానవుడైన క్రీస్తుని తల్లి దేవుని తల్లిగా ఉండదు.

## 6. ప్రొటెస్టెంట్ ప్రబోధము:

ఎఫేసు సమావేశము తర్వాత దాదాపుగా వెయ్యి సంవత్సరములు క్రైస్తవ విశ్వాస జనావళి మరియను 'దేవుని తల్లి' గా కొనియాడుతూ వచ్చారు. ఏదో అరకొరగా అక్కడక్కడ కనుమరుగైపోతున్న జ్ఞానతత్వ సిద్ధాంతులు (గ్నోస్టిసిజం) మాత్రం కొద్దిగా వ్యతిరేఖించారు. అయితే వారి ప్రభావము ఏ మాత్రము మరియ ఘనతను తగ్గించలేక పోయింది. మామూలుగా కతోలిక క్రైస్తవులు మరియను కొనియాడుతూ ఇచ్చే బిరుదులను, పండుగలను చూసి ఓర్వలేని ప్రొటెస్టెంట్ క్రైస్తవులు కూడా 'మరియ – దేవుని తల్లి' అని మార్టిన్ లూథర్ మరియ గురించి రాసిన ప్రబోధమును చూసి ఆశ్చర్యపోయారు. మార్టిన్ లూథర్ కతోలిక విశ్వాసమును విడిచిపెట్టి బయటకు వెళ్ళిన తర్వాత కూడా ఈ విధముగా మరియతల్లిని కొనియాడుతున్నాడు: "మరియ దేవుని తల్లిగా మారడం కంటే గొప్ప సంగతి అసలు లేదు. దేవునితల్లిగా మారు క్రమములో ఆమెపై అనేక ఉన్నతమైన అనుగ్రహాలు కురిపించబడినాయి. వాటిని ఎవరూ పరిపూర్ణంగా అర్ధం చేసుకోలేరు. ఈ అనుగ్రహ పరిపూర్ణత ఫలితంగా ఆమె మానవాళి అంతటిలో అందరికంటే మిన్నగా ఆశీర్వదించబడింది, పరిశుద్ధతను సంతరించుకుంది. ఆమెకు ఎవరు సాటిలేరు, ఆమెతో ఎవరు సమానం కాలేరు. అందుకే, ఆమె ఔనత్యమును ఒక్క మాటలో కొనియాడగలము. ఆ వాక్యం: మరియ – దేవుని తల్లి. అంతకు మించిన ఒక మాటను ఎవరూ చెప్పలేరు. చెట్టుకున్న ఆకులవలె, గడ్డి పోచల వలె, ఆకాశ నక్షత్రముల వలె, సముద్ర ఇసుక రేణువుల వలె అసంఖ్యాక భాషలు వచ్చినా సరే, ఎవరూ కూడా ఆమెకు 'దేవుని తల్లి' అను దానికంటే మించిన మాటను పలకలేరు. మన హృదయములలో నిత్యమూ ధ్యానించవలసిన విషయం ఇదే: దేవుని తల్లిగా ఉండడం అంటే ఏమిటి?

మార్టిన్ లూథర్ మరియ పట్ల తన ప్రవర్తనను మార్చుకొని మిగిలిన అన్ని సంగతులను నిరాకరించినా కూడా, మరియను దేవుని తల్లిగా భావించడంలో తాను వెనుదిరిగి చూడలేదు. మరియకు అందించు ప్రత్యేకమైన ఒక విశ్వాస భక్తి గురించి మాత్రమే అతడు నిరాకరిస్తూ మాట్లాడాడు. ఎందుకంటే, మరియ

పట్ల అధిక భక్తి, రక్షకుడైన క్రీస్తు పట్ల మనము చూపవలసిన గౌరవానికి, ఆరాధనకు ఆటంకముగా మారి, క్రీస్తు విలువకు భంగం కలిగిస్తుందేమో అని తలంచాడు. అదొక్కటే. అంతే తప్ప 'మరియ – దేవుని తల్లి' అను సత్యమును మాత్రం నిత్యము విశ్వసించాడు, బోధించాడు. మరియ గురించి, ఎఫేసు సమావేశములోని ప్రబోధన గురించి లూథర్ మొదటిసారి తన 'అంగీకార బోధనలో' (confessional writings) ముఖ్యముగా 1530వ సంవత్సరములో తన ఆగ్సబుర్గ్ అంగీకార బోధనలో ఈవిధముగా పేర్కొంటున్నాడు: "వాక్కు, దేవుని కుమారుడు, కన్యమరియ గర్భములో మానవ స్వభావమును తీసుకున్నాడు. దాని మూలముగా ఆయనలో దైవత్వం, మానవత్వం అను రెండు స్వభావాలు ఉన్నాయి. ఈ రెండు స్వభావాలు నిజముగా దేవుడు, నిజముగా మరియ నుండి జన్మించిన మానవుడు, ఒకే క్రీస్తు అను వ్యక్తిలో అవిభజనీయంగా ఐక్యమై ఉన్నాయి."

1579వ సంవత్సరంలో కాంకర్డ్ ఫార్ములా అను చివరి అంగీకార పత్రములో కూడా మార్టిన్ లూథర్ మరియ దివ్య మాతృత్వ వేదాంత సిద్ధాంతం గురించి సుస్పష్టముగా ప్రకటించాడు: "మహోన్నతమైన ఐఖ్యత (హైపోస్టాటిక్ యూనియన్) ద్వారా, స్వభావముల కలయిక (కమ్యూనియన్ అఫ్ నేచర్స్) ద్వారా, మహా గౌరవమునకు పాత్రమైన కన్య మరియ, మానవుని మాత్రమే కాదు, నిజముగా మహోన్నత దైవ కుమారుడైన మానవుని కూడా జన్మనిచ్చింది... కాబట్టి, ఆమె నిజముగా తియోటోకోస్, దేవుని తల్లి, మరియు నిత్యకన్యక.

అయితే లూథర్ కతోలిక ప్రార్ధన "అవే, పరిశుద్ధ రాజ్ఞి" (Hail, Holy Queen) ను ఒక దైవదిక్కారణగా పరిగణించి, ప్రొటెస్టెంట్ క్రైస్తవులందరూ మరియ భక్తి గౌరవములను తగ్గించి మాట్లాడు విధంగా ఒక విధమైన అంశమును లేవనెత్తాడు. అంతేకాదు, నెమ్మదిగా లూథర్ పునీతుల బాంధవ్యమును కూడా నిరాకరించాడు. ఎందుకంటే, పరలోక పునీతుల మధ్యవర్తిత్వ ప్రార్ధనా శక్తిని తిరస్కరించాడు. ఇక అప్పటి నుండి ప్రొటెస్టెంట్ చరిత్ర 'నేస్తోరియనిజం' అను మత విరుద్ధ సిద్ధాంతమును పెంచి పోషిస్తూనే ఉంది. తల్లిని కించపరుస్తూ మాట్లాడే ప్రతీ మాటలో కుమారుని గురించిన సత్యమును కూడా తగ్గించి

మాట్లాడినట్లే. ప్రొటెస్టెంట్ విధానం గురించి కార్డినల్ న్యూమాన్ ఈవిధంగా అంటాడు: "తల్లి కుమారుడు ఒకటిగా నడిచారు. మూడు శతాబ్దాల అనుభవము ఈ సత్యమునకు సాక్ష్యమిస్తుంది. అందుకే కతోలికులు కుమారుని ఆరాధిస్తారు, తల్లిని గౌరవిస్తారు. కాని ప్రొటెస్టెంట్ వారు కుమారుని యందు విశ్వాసమును తగ్గించారు, అందుకే తల్లిని కూడా త్రునీకరించారు."

కార్డినల్ న్యూమాన్ కతోలికునిగా మారి నిజమైన విశ్వాస సత్యములను ప్రకటిస్తున్న సమయమునుండి ప్రొటెస్టెంటిజం కేవలం భావోద్వేగమైన, కేవలం హేతుబద్ధమైన, కేవలం స్వతంత్రమైన వారి ప్రబోధనలను ప్రకటించడంలో చాల కష్టపడింది. కొన్నిచోట్ల అందరూ తిరిగి నాలుగవ శతాబ్దపు శ్రీసభకు చేరుకోవాలని భావించారు కూడా.

నియో ఆర్థోడాక్స్ విశ్వాసంలో కూడా మరియ దివ్య మాతృత్వ అంగీకారము కనిపించడం లేదు. ఉదాహరణకు, పౌలు తిల్లక్ క్రీస్తును ఒకరకమైన నేస్తోరియనిజం పద్దతిలోనే భావించి, మరియ దేవుని తల్లి అను సత్యమును నిరాకరించాడు. ఇంకా ముందుకు వెళ్లి, మరియ క్రీస్తు తల్లి అని కూడా అంగీకరించడానికి ఇష్టపడలేదు. మరియ కేవలం నజరేతు యేసుకు మాత్రమే తల్లి అని, ఆ యేసువే క్రీస్తులా సిలువ త్యాగం చేసాడని పలికిన పౌలు తిల్లక్ మాటలను గ్రహించాలంటే అతని వేదాంతమును అధ్యయనం చేయడం అవసరం. అతని ఆలోచన ప్రకారం, ప్రొటెస్టెంటిజంలో మరియకు ఎటువంటి ప్రాముఖ్యత లేదు.

ఎమిల్ బ్రూన్నర్ అను నియో ఆర్థోడాక్స్ వేదాంత వేత్త ప్రకారం విశ్వాసం అంటే దేవుని అధికారము నుండి వెలువడిన ఒక సత్యమును అంగీకరించడం కాదు, సజీవ క్రీస్తుని కలుసుకోవడం. అంతకు మించిన ఎటువంటి విశ్వాసమైన అనవసరం అని అంటాడు. దేవుని కుమారుడు మానవునిగా మారాడు అను విషయము కూడా అసందర్భం అని భావించాడు. అతని వేదాంతం ప్రకారం, మరియ దేవుని తల్లి అయ్యి ఉండొచ్చు, కాని యేసు ఆమెకు ఆ బిరుదును ఇవ్వలేదు.

కార్ల్ బార్త్, కొంతమంది ప్రొటెస్టెంట్ వారు అర్ధ కతోలికునిగా భావింపబడు వ్యక్తి, ఎటువంటి సందేహం లేకుండా 'మరియ నిత్య కన్యత్వం' అను విశ్వాస సిద్ధాంతమును అంగీకరించాడు. దేవుని కుమారుని మనుష్యవతారము గురించి అంగీకరించాడు కాని, మరియ దేవుని తల్లి అని ఎప్పుడు మాట్లాడలేదు. అసలు బార్త్ ఎప్పుడైనా ఒక అడుగు ముందుకు వేసి దివ్య మాతృత్వమును ధ్రువీకరించడా? అనేది ఇంకా సందేహంగానే మిగిలిపోయింది.

"దేవుని తల్లి" అను బిరుదు ఇంకా అనేకమంది ప్రొటెస్టెంట్ క్రైస్తవులను భయపెడుతూనే ఉంది. కొద్దికాలం క్రితం అమెరికా ప్రొటెస్టెంట్ క్రైస్తవుల మధ్య "మరియ – దేవుని తల్లి" – అవునా కాదా, మీరు ఏమనుకుంటున్నారు అని ఒక సర్వే జరిగింది. దాదాపుగా వందమంది ప్రొటెస్టెంట్ పాస్టరులు, వేదాంత శాస్త్ర ఆధ్యాపకులు ప్రశ్నావళికి సమాధానం ఇచ్చారు. దాదాపు వందమందిలో కేవలం ఇరువది రెండు మంది మాత్రమే మరియ దివ్య మాతృత్వమును అంగీకరించారు. అందులో సగం మంది మేత్రానులు. పదిహేను మంది ఇచ్చిన జవాబు స్పష్టంగా లేదు. అరవై మూడు మంది మరియకు ఈ దివ్య మాతృత్వ గౌరవమును నిరాకరిందారు. ఈ బిరుదును నిరాకరించడానికి అసలు కారణం క్రీస్తు దైవత్వమునందు నమ్మకం లేకపోవడమే. క్రీస్తు కూడా తండ్రివలె, తండ్రితో సమానంగా దేవుడే అని మీరు అంగీకరిస్తున్నారా అని మళ్ళీ ప్రశ్న అడిగితే, దాదాపు ప్రొటెస్టెంట్ అందరూ అవునా కాదా అను సంగ్దిగ్ధ లో పడి సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారు. ఇది వారి పరిస్థితి. నేస్తోరియనిజంగా ఇంకా మిగిలి పోయారు.

ఈ విధముగా శ్రీసభలో సాంప్రదాయ తత్వమును, వేదాంత సిద్ధాంత పురోగతిని అపార్ధము చేసుకున్న ప్రొటెస్టెంట్ వారు అలాగే క్రైస్తవ సిద్ధాంతాలను నిరాకరిస్తూనే ఉన్నారు. అసలైన ప్రొటెస్టెంట్ క్రైస్తవులకు పరిశుద్ధ గ్రంథమే ప్రధానమైన విశ్వాస ప్రమాణము. ఒక సత్యమును గురించి పరిశుద్ధ గ్రంథములో స్పష్టముగా చెప్పకపోయి ఉంటే, వారి ప్రకారం అసలు అది సత్యమే కాదు. ఒక ప్రొటెస్టెంట్ రచయిత ఇలా అంటాడు: పరిశుద్ధ గ్రంథ రచయితల స్వభావానికి, కన్య మరియకు అందించబడుచున్న విశ్వాస గౌరవానికి మధ్య

గొప్ప వ్యత్యాసం ఉంది, దీనిని నేను జీర్ణించలేక పోతున్నాము. ప్రొటెస్టెంట్ వారి మధ్యలో కతోలిక భక్తి గురించి ఒకే ఒక అపార్ధము ఇంకా పరిభ్రమిస్తూనే ఉంది. ఆ అపార్ధము: కతోలిక మరియ శాస్త్రము మరియను దేవతగా లేవనెత్తుతుంది. ఇంకా కొంతమంది ప్రొటెస్టెంట్ వారు అయితే మరియ శాస్త్రము (Mariology) అని కాక, మరియ ఆరాధన (Mariolatry) అని అంటారు. ఇంకా అనేకమంది అలాగే అనుకుంటున్నారు: రోము శ్రీసభలో మరియను ఒక స్త్రీ దేవతగ చిత్రీకరించారు, మరియను క్రీస్తుతో సమానంగా, కొన్నిసార్లు క్రీస్తు కంటే అధికంగా పూజించడం చేస్తున్నారు.

ఒకవైపు మరియను దేవుని తల్లిగా కొలుచు భక్తిని నిరాకరించడాన్ని అదేపనిగా పెట్టుకొని ముందుకు సాగుతున్న ప్రొటెస్టెంట్ సాంప్రదాయం కొనసాగుతుంటే, మరోవైపు ఫ్రాన్స్ లోని నూత్నీకరింపబడిన చర్చి కి చెందిన మాక్స్ తూరియన్ అను ఒక ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రజ్ఞుడు ఒక నూతన విధానమును ప్రవేశ పెట్టాడు. శ్రీసభ సంప్రాదాయ విశ్వాసములోని 'ప్రభుని తల్లి' అను సత్యములోని కొన్ని అంశాలను విమర్శించినా, మాక్స్ తూరియన్ ప్రొటెస్టెంట్ భక్తిలోనికి, ఆరాధనలోనికి మరియ విశ్వాసమును ప్రవేశపెట్టాలని గట్టిగా పూనుకున్నాడు. పరిశుద్ధ కన్య మరియ గురించి ఉన్న భయాలను పక్కన పెట్టి , "ఇకనుండి తరతరముల వరకు నన్ను ధన్యురాలని పిలిచెదరు" అను మాటలను తమలో వాస్తవరూపం దాల్చేలా కృషి చేయమని మాక్స్ తూరియన్ తన అనుచరులకు పిలుపునిచ్చాడు. ఈ మాక్స్ తూరియన్ వేదాంతమును అనుసరిస్తే, క్రైస్తవ సమైఖ్యతను సాధించడంలో కతోలిక మరియ శాస్త్రము పెద్ద ప్రమాదముగా కనిపించదు.

ఈ క్రైస్తవ సమైఖ్యత సాధనలో ప్రొటెస్టెంట్ వర్గాల వారిని తిరిగి ఎఫేసు సమావేశ సిద్ధాంతము వైపు పవిత్రాత్మ నడిపిస్తుందని ఆశిద్దాం. ఈ ఎఫేసు సమావేశపు పదిహేనువందల ఏళ్ళ సందర్భంగా, ఆ సమావేశ విశ్వాస సత్యమును పదకొండవ భక్తినాధ పాపుగారు ఈ విధంగా సంగ్రహిస్తున్నాడు: "పవిత్రాత్మ ప్రభావము ద్వారా కన్య గర్భములో ఉద్భవించిన అతడు, పుట్టి పశువుల శాకలో పెట్టబడిన అతడు, తనను తాను మనుష్యకుమారునిగా పిలుచుకొనిన

అతడు, శ్రమలను అనుభవించి సిలువలో కొట్టబడిన అతడు, "నా ప్రియమైన కుమారుడు" అని గొప్పగా మహోన్నతంగా పిలువబడిన వ్యక్తి, దివ్య శక్తి ద్వారా పాపములను పరిహరించిన వ్యక్తి, తన స్వీయ శక్తి ద్వారా రోగులకు స్వస్థతను, మరణించిన వారికి జీవమును అనుగ్రహించిన వ్యక్తి  ఇద్దరూ ఒకటే. దీనిని బట్టి మనకు స్పష్టముగా ఒక సత్యము బోధపడుతుంది: "క్రీస్తులో రెండు స్వభావాలు ఉన్నాయి. ఆ రెండు దైవ మానవ కార్యము నుండి ఉదయిస్తున్నాయి. అనగా, క్రీస్తు ఒక దేవుడు, ఒక మానవుడు, ఆ దివ్య వ్యక్తి మానవ స్వభావముతో కలవడం ద్వారా అతనిని దేవుడు మానవుడు (తేయాంత్రోపోస్) అని పిలువబడుతున్నాడు.

ఈ కతోలిక విశ్వాస సత్య ప్రమాణము ద్వారా మనము పరిశుద్ధ కన్య మరియ దివ్య మాతృత్వమును గ్రహించగలము, ప్రబోధించగలము.... పరిశుద్ధ కన్య మరియ కుమారుడు దేవుడైతే, అతనిని కని మోసిన ఆమె కూడా యోగ్యమైన విధముగా 'దేవుని తల్లి' అని పిలువబడుతుంది. యేసుక్రీస్తులో ఒకే ఒక దివ్య వ్యక్తి ఉంటే, మరియ కూడా కేవలం క్రీస్తు తల్లిగా మాత్రమే కాదు, దేవుని తల్లి (తెయోటోకోస్) అని పిలువబడుతుంది. "నా ప్రభువు తల్లి" అని తన బంధువు ఎలిజబెతమ్మ ద్వారా కీర్తింపబడిన ఆ స్త్రీ, 'దేవుని మోసిన తల్లి' అని వేదసాక్షి యిగ్నేసియస్ ద్వారా కొనియాడబడిన ఆ స్త్రీ, 'ఆమె నుండి దేవుడు జన్మించాడు కాబట్టి ఆమెను దేవుని తల్లిగా గౌరవించాలి" అని తెర్తూలియన్ మాటలలో తొనికిసలాడిన ఆ స్త్రీ, నిజముగా శాశ్వత దేవుని ద్వారా పరిపూర్ణ అనుగ్రహములతో, అమోఘమైన ఔనత్యముతో ఆశీర్వదించబడింది.

## 7. దేవుడు ఎందుకు తల్లిని కోరుకున్నాడు?

ఒక వేదాంత సత్యమును అన్వేషించినపుడు, ప్రకటించిన సూత్రము సరియైనది, దానిని దృవీకరించదానికి దైవీక సాక్షాత్కారములో వాస్తవ వనరులు ఉన్నాయి అని కనిపెట్టడం మాత్రమేకాదు వేదాంతశాస్త్ర వేత్త బాధ్యత. అంతకు మించి ఉండాలి. ఆ వేదాంత సత్యమునకు దైవీక కారణాలు ఏంటో అని కూడా తెలుసుకోవాలి. ఆ దైవీక కారణాలు మానవ విశ్వాస తెలివిలో

ఇమిడిపోతాయా లేదా అని కూడా గ్రహించాలి. దానినే ఫిదేస్ క్వేరిత్ ఇంతెల్లెక్టుం (fides quaerit intellectum) అనగా, జ్ఞానమును విశ్వాసము అన్వేషించాలి. ఈ విధముగా ఆలోచించినపుడు మనకు తలెత్తు మొదటి ప్రశ్న: అసలు మానవ తల్లిని కోరుకోడానికి దేవుని కారణాలు ఏంటి? అసలు దేవుడు ఒక తల్లిని ఎందుకు సంకల్పించాడు. ఈ ప్రశ్నకు సమాధానం వెదకాలంటే మానవాళి రక్షణార్ధమై దేవుడు ఏర్పాటు చేసిన ప్రణాళికలోనికి తొంగి చూడాలి.

మానవుని పాపము ద్వారా సృష్టి వినాశనం చెందింది. నాశనమైన తన సృష్టిని పునరుద్ధరించాలని దేవుడు చిత్తగించాడు. దేవుడు తన సంకల్పానికి అనంతమైన ప్రేమను, మహోన్నతమైన తన దైవత్వ కళను జోడించాడు. మానవ కళాకారుడు ఎంతగా ప్రయత్నించినా తన కళను పరిపూర్ణంగా పోషించలేడు. అయితే పరలోక కళాకారుడు అలా కాదు. పరలోక భూలోక తండ్రి తన సజీవ ఆలోచనను, అనగా తన శాశ్వత వాక్కును, సృష్టిలోనికి పంపించాడు. తద్వాత తన దివ్యకుమారుడు, పరలోక వాక్కు, తన మానవ శరీరము ద్వారా పతనమైన మానవుని రూపమును నూత్నీకరించాలని భావించాడు. అంతే మానవునిగా మారిన దైవవాక్కు, లోక క్రమమును – భౌతికము ఆధాత్మికము, శరీరము ఆత్మ, మానవత్వం దైవత్వం, సృష్టి కర్త సృష్టి జాలము – అంతటిని తనలో విలీనం చేసుకొని, సమస్తమును దైవరూపములోనికి తీసుకొని రావాలి. మానవ శరీరము దాల్చిన వాక్కు అను పరమ రహస్యము దేవుని జ్ఞానమును ప్రేమను విభజింపబడిన ఈ ప్రపంచమునకు అందించి, మానవుడు సమస్త సృష్టిలో దేవుని మంచితనమును, సౌందర్యమును కనుగొనులాగున, దాని ఫలితముగా, శాశ్వత దైవ రూపమును పునర్నిర్మించాలని చిత్తగించాడు.

మానవ రక్షనార్ధమైవాక్కు స్వీకరించిన శరీరము ఎమిలేమినుండి కొత్తగా సృష్టించబడినదేమీ కాదు. పాపములో మరణములో ప్రవేశించిన ఆదాము శరీరములోని భాగమునే ఆ వాక్కు తీసుకుంది. దైవ ప్రేమ చిత్తగించింది: ఏ శరీరము ద్వారా పాపము ఈ లోకములో ప్రవేశించి, నాశనానికి, మరణానికి కారణమైందో, అదే శరీరము రక్షణకు, పునరుత్థానానికి సాధనం కావాలి. తను తయారు చేసిన ప్రాణుల యెడల దేవునికి అమితమైన గౌరవం ఉంది.

అందుకే, పడిపోయిన ఆ మానవ శరీరమును లేవనెత్తి, తన రూపములోని మార్చుకుంటున్నాడు, తద్వారా ప్రపంచముపై, శరీరముపై ఆ మానవ స్వభావము ఒక విజయమును సాధించ గలదు. అనంతమైన న్యాయము తలంచినది: వేరే ఏ శరీరము పాపము చేయలేదు, కాబట్టి మానవ శరీరమును రక్షించడానికి దైవవాక్కు ఆ పాపపు శరీరమునే తీసుకోవాలి, వేరే మార్గము సంపూర్ణం కాదు. వేరే ఏ శరీరమును ఒకే త్యాగబలిగా సమర్పింపబడలేదు. ఎందుకంటే, మరి ఏ ఇతర శరీరానికి రక్షణ అవసరం లేదు. దైవీక ప్రేమ సంకల్పించింది: దేవుని ద్వారా సృజించబడినది ఆదాము శరీరము, ఆదాము శరీరమే పాపములో పడి వినాశనమును, మరణమును కొనితెచ్చుకుంది. రక్షంపబడి తండ్రి రూపానికి మార్చబడవలసింది ఆ ఆదాము పాపము శరీరమే కదా. అందుకే శాశ్వత వాక్కు ఆ మానవ శరీరమును తీసుకొని రక్షింపవలసిన అవసరం ఉంది. పడిపోయిన ఆదాము లేవనెత్తబడాలంటే, అతని శరీరము రక్షింపబడాలి. అందుకే, దేవుని కుమారుడు ఆదాము కుమారుడుగా మారాలి. దేవుని స్వంత కుమారుడు మానవ తల్లి నుండి జన్మించాలి.

మానవ రక్షణ ప్రక్రియలో, మానవ శరీరము ఏ విధంగా పాపములో పడిపోయిందో, దానిని లేవనెత్తడములో కూడా అదే క్రమమును అనుసరించాలి. అనగా, ఒక ముడిని విప్పడంలా ఉండాలి. ముడిని ఏవిధంగా వేస్తామో, అదే రీతిలో విప్పాలి. ఒక కన్యక – ఏవ – దేవుని యెడల అవిధేయతను ప్రదర్శించి మానవాళి పాపములో పడడానికి కారణం అయ్యింది. అదేవిధంగా, దేవుని సంకల్పమునకు విధేయత చూపించి, పతనమైన మానవాళి పునరుద్ధరణకు ఒక కన్యక అవసరమై ఉంది. ఆదాము పాపము ఏవ యొక్క మాతృత్వం ద్వారా మాత్రమే సకల మానవాళికి సంక్రమించింది. అదేవిధంగా, నూతన ఆదాము క్రీస్తుని రక్షణ కూడా, మరియ మాతృత్వం ద్వారా మాత్రమే సమస్త మానవజాతికి అందించ బడింది. ఇదే దేవుని సంకల్పం.

దేవుడు ఒక మానవ తల్లిని కోరుకొని ఉన్నాడు, ఎన్నుకొని ఉన్నాడు అని చెప్పడానికి ఇవి కొన్ని కారణాలు. ఈ కారణాలు దైవీక మహోన్నత శక్తికి, జ్ఞానమునకు, న్యాయమునకు, కారుణ్య ప్రేమకు నిదర్శనములు. ఇవన్నీ మానవ

రక్షణలో భాగం కావాలంటే, దేవునికి ఒక తల్లి అవసరమై ఉంది. ఈ ప్రణాళికలో దేవుడు ఒక్క పాపము మినహా అన్నిటిలోనూ మనవలె ఉన్నాడు. తనకంటూ ప్రేమించడానికి, అనుభూతిని పొందడానికి ఒక తల్లిని ఎంచుకోడంలో కూడా ఆయన వెనకాడలేదు. దేవుడై ఉండి కూడా, ఒక అమ్మ చేతిలో బిడ్డగా ఒదిగిపోయాడు కాబట్టి, మనము కూడా చాలా సులభంగా ఆయనను ఆశ్రయించగలము. ఆయన ఒక తల్లి కడుపున జన్మించాడు కాబట్టి, మనలను తన సహోదరులవలె సహజసిద్ధమైన ప్రేమతో ఆదరించగలడు. తాను తన తల్లికి విధేయించి జీవించాడు కాబట్టి, ఒక తల్లిని విదేయించు తీరులో, తల్లితండ్రులకు లోబడి జీవించడంలో, మానవ కుటుంబంలో దైవ కుటుంబమును దర్శించు క్రమములో యేసు మనకు ఆదర్శంగా ఉండగలడు. మనవలె ఆయన మానవ శరీరమును ధరించి ఉన్నాడు అని చెప్పడానికి ఇంతకన్నా గొప్ప రుజువులు కనుగొనగలమా?ఒక మానవ స్త్రీని గౌరవించి, తన తల్లిగా స్వీకరించి, అత్యున్నత స్థానములో దేవుడు నిలబెట్టి ఉన్నాడు. మానవాళికి ఇంతకన్నా గొప్ప అనుగ్రహము, అభయము దొరుకుతుందా? దైవీక ప్రేమకు, విజ్ఞానమునకు, కారుణ్యమునకు ఇంతకు మించిన గొప్ప సాక్ష్యాలు అన్వేషించగలమా? కాబట్టి, మరియ దివ్య మాతృత్వము మనకు దేవుని వరము. దానిని అంగీకరించుదాం, విశ్వసించుదాం, విశ్వాస సత్యముగా లోకానికి ప్రకటిద్దాం.

❋ ❋ ❋ ❋

# ౨. రెండవ మరియ విశ్వాస సిద్ధాంతం : మరియ నిత్య కన్యత్వం (శ్రీసభ విశ్వాస ప్రబోధనం)

బ్రదర్ కరసాల జోసెఫ్ తంబి



మరియమాత నిజంగానే కన్యక అని మనం విశ్వాస సంగ్రహంలో చెబుతున్నాం. క్రీస్తు పుట్టుకకుముందు, పుట్టినపుడు, పుట్టిన తర్వాత కూడా ఆమె కన్యగానే ఉండింది. అని క్రీ.శ.649 వ సంవత్సరంలో 1వ మార్టిన్ పాపుగారి నాయకత్వంలో జరిగిన లాటెరన్ మహాసభలో ప్రకటింపబడింది. దీనినే ట్రెంటు మహాసభ కూడా ధృవీకరించింది. అదేవిధంగా ద్వితీయ వాటికన్ మహాసభ అధికారపత్రంలో కూడ మరియమాత ' కన్య ' అని దాదాపు ముప్పయి సార్లు పేర్కొనటం జరిగింది.

'మరియ నిత్యమూ కన్యగానే ఉండిపోయింది' అనేది కతోలిక విశ్వాససత్యం. ప్రాచీన శ్రీసభ ఈ సత్యాన్ని అంగీకరించింది. వారు మరియమాత కన్యత్వాన్ని సూచించే విధంగా మూడు నక్షత్రాలను ఆమె తలపై ధరించే ముసుగుపై అలంకరించేవారు. ఈ మూడు నక్షత్రాలు క్రీస్తు జన్మించేందుకు ముందు, ఆయన జన్మములోను, ఆయన జన్మించిన తర్వాత కూడా మరియమాత కన్యగానే ఉన్నదని సూచిస్తాయని వారు వివరణ నిచ్చారు. అంతియోకుపుర ఇన్యాసి, జస్టిన్ మొదలైన వారు, 'యేసు జన్మానికి ముందు' కన్యత్వము ముఖ్యమని అన్నారు. ఐరేనియుస్, అలెగ్జాండ్రియ క్లెమెంట్, నిసాపురి గ్రెగొరి మొదలైనవారు మరియతల్లి నిత్యకన్య అనే బోధించారు. 'యేసుజననం, ఆతర్వాత కూడా మరియమాత కన్యగానే ఉన్నదని' క్రిసోస్తమ్ యోహాను, ఎఫ్రేమ్, ఆంబ్రోస్,

ఆగుస్తీను మొదలైనవారు బోధించారు. ఎన్నోరంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన నేటి అధునాతన యుగంలో కన్యత్వం గురించి ప్రస్తావించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. మరియమాత కన్యత్వం గురించి చర్చించేటపుడు, సాధారణమైన మనుష్యులుగా, లౌకికమైనదృష్టితో పరికిస్తే. ఆమె కన్యత్వరహస్యాన్ని సరిగా అర్థంచేసుకోవటం సాధ్యమా అని కొందరు వెనుకాడతారు. నిజానికి 'ఏది అసలుసిసలైన కన్యత్వం' అని నిర్ధారించి చెప్పటం కష్టమే. అసలు కన్యత్వం అంటే ఏమిటి? చరిత్రలోగానీ బైబుల్లోగానీ దీనికి ఏవైనా కొలమానాలు కానీ, ప్రమాణాలు కానీ, ఉదాహరణలు కానీ ఉన్నాయా? లేక మరియమాత కన్యత్వం అనేది కేవలం ఒక క్రైస్తవ పారంపర్య విశ్వాసమేనా? ఒకింత పరిశీలించ సాహసిద్దాం.

## 1. పురాణాల్లో కన్యత్వం గురించిన భావాలు

మధ్యధరా సముద్రతీరంలో జీవించిన వారి మత పురాణ ఇతిహాసాల్లో, నిత్యయవ్వనంతో సద్గుణసంపన్నులైన దేవతామూర్తులు సామాన్య మానవులకంటే విలక్షణంగా కన్పిస్తారు. అలాంటివారిని వారు 'కన్యలు' అని పిలిచేవారు. ఆనాత్, ఆర్థమిస్, అథెనా మొదలైన దేవతలను వారు కన్యలు అనే పిలిచారు. ఈ దేవతలు తమలోవున్న కన్యత్వమహిమవల్ల లైంగింక సంపర్కము లేకుండానే సంతానాన్ని పొందే శక్తిని కలిగి ఉండేవారని ప్రజలు విశ్వసించేవారు. కాబట్టి వారి పురాణఇతిహాసాల్లో కన్యత్వం అంటే అది వ్యక్తిత్వం, లక్షణం. ప్రవర్తనలకు చెందినదిగా భావింపబడేదని అర్థమౌతోంది.

## 2. పాతనిబంధనలోని భావాలు

పాతనిబంధనలో కన్యత్వం రెండు విభిన్నమైన భావాలతో దర్శనమిస్తుంది.

**మొదటిది:** పూర్వవేదకాలంలో సంతానప్రాప్తిని దేవుడిచ్చేవరంగా భావించేవారు. సంతానంలేని స్త్రీలనూ, సంతానాన్ని పొందేందుకు అవకాశంలేని వాళ్ళను కూడా శాపగ్రస్తులుగానే భావించేవాళ్ళు (ఆది 30:23: 1 సమా 1 :11). కాబట్టి సంతాన ప్రాప్తికి వీలుపడని కన్యత్వాన్ని కూడా వారు గొడ్రాలితనంతో సమానంగా భావించేవారు.

**రెండవది:** కన్యత్వమంటే దేవునికి మానవునికి మధ్య ఏర్పడే ఒప్పందానికి కట్టుబడి, ప్రామాణికంగా వుండటమేనని కూడా వారు భావించేవారు.. దేవునికి ప్రామాణికంగా కట్టుబడి ఉన్నప్పుడు ఇశ్రాయేలు, 'కన్యగా' పిలువబడింది. కాబట్టి దేవునికి లోబడి, పరిపూర్ణ సమర్పణతో ఆయనతో చేసుకున్న ఒప్పందానికి ప్రామాణికంగా జీవించటమే కన్యత్వమనేది.

పాత నిబంధనలోని ఈ రెండు భావనల ద్వారా మనకు తెలుస్తోన్నదేమిటి? శారీరక సంబంధమైన కన్యత్వం వారి దృష్టిలో అంతవిలువైంది కాదనీ, సంపూర్ణ ఆత్మసమర్పణతో దేవునికి లోబడి ప్రామాణింకంగా జీవించే ఆధ్యాత్మిక కన్యత్వమే శ్రేష్టమైనది, విలువైనదనే భావనే ప్రధానంగా దర్శనమిస్తుంది. కాబట్టి, దేవునితో ఏర్పరచుకున్న సంబంధమే అసలు సిసలైన కన్యత్వమని పాతనిబంధన తెల్పుతోందనవచ్చు.

## 3. నూతననిబంధనలోని భావాలు

కన్యత్వపు అంతస్తును యేసుప్రభువు ఒక ప్రత్యేకవరంగా, దైవానుగ్రహంగా అభివర్ణించారు (మత్తయి 19:11 నుండి). దైవకార్యంలో శ్రద్ధచూపాలంటే కన్యత్వాన్ని ఎన్నుకోవటం మేలు, ఎందుకనగా కుటంబ వ్యవహారాల్లో నిమగ్నమై ఉండేవారు, దేవుని సేవపై సంపూర్ణదృష్టిని నిలుపలేరనీ, తమ పూర్తిసమయాన్ని దేవునిసేవకై వెచ్చించలేరని అపోస్తలుడైన పౌలు తెల్పుతున్నాడు (1కొరింతీ 7:26-29). శ్రీసభలో క్రీస్తు ఒడంబడిక చేసుకున్నాడు. క్రీస్తు అనే వరునికి, శ్రీసభ అనే వధువు ప్రధానం చేయబడింది. కాబట్టి ఆయనకోసం శ్రీనభ పావన కన్యయై ఉండాలి. నూతన ఇశ్రాయేలైన శ్రీసభ యేసుతో కలిగివుండవలసిన అవినాభావ స్నేహసంబంధాన్నే కన్యత్వమని నూతననిబంధన తెలుపుతోంది. అయితే ఫలానావ్యక్తి కన్యత్వంలో జీవించారని ఎవరినీ ఉదహరించలేదు. మరియమాత మాత్రమే వ్యక్తిగతంగా "కన్య" గా పిలువబడింది. పూర్వ నిబంధనలోని భావాలు మరియమాతలో పరిపూర్ణమై, అర్థవంతమయ్యాయి. కన్యత్వం యొక్క పరిపూర్ణస్థితి మరియమాత్రలో దర్శనమిస్తుంది.

## 4. మరియమాత కన్యత్వంపై వేదాంత భావాలు:

మరియమాత కన్యత్వం గురించి వేదాంతరీతిలో ఎందరో వ్యాఖ్యానించి బోధించారు. అయితే అవి కొందరికి నచ్చే విధంగాను, కొందరికి నచ్చని విధంగానూ ఉన్నాయి. వాటిని గురించి ఒక క్రమపద్ధతిలో పరిశీలిద్దాం.

1. యేసు జననంలో మరియ కన్యత్వం మరియమాత, దైవస్వభావం మనుష్యస్వభావమూ కలిగివున్న యేసును కన్నందువల్ల, ఆమె శరీరంలో ఎలాంటి మార్పు జరగకుండానే యేసు జన్మించాడు అని శ్రీసభ పితృపాదులు బోధించారు. దీనికి బైబులు నుండి కొన్ని ఆధారాలను కూడా ఉదహరించారు (యెషయా 44:2 పరమగీతాలు 4:12 చదవండి). "మూసిన సమాధినుండి యేసు పునరుత్థానమైనట్టు, తలుపులు మూసి ఉండగానే శిష్యులున్న గదిలోనికి పునరుత్థానయేసు ప్రవేశించినట్టు, అద్దాల గుండా కాంతికిరణం ప్రవేశించేవిధంగా, మనసునుండి తలంపులు పుట్టేవిధంగా, యేసుకూడా మరియమాత నుండి ఉద్భవించాడు. ఆమెం కన్యత్వాన్ని చెక్కు చెదరనీయకుండా ఆయన జన్మించాడు" అని వ్యాఖ్యానించారు. గర్భం, ప్రసవాల వల్ల శరీరంలో మార్పులు జరిగాయని అంటే ఆమె 'కన్య' అని చెప్పటం కష్టతరం అనే భావనతో వాళ్ళు ఈ విధంగా బోధించారు.

## 5. దైవావిష్కరణలో మరియ కన్యత్వం

పాతనిబంధనలో కొందరు ప్రముఖులు గొడ్రాల్ల నుండే జన్మించారు. ఇసాకు, సమూవేలు, శాంసన్, బప్తిస్థ యోహాను మొదలైన వారు ఈ కోవకు చెందినవారు. వీరి జన్మము ద్వారా రక్షణ తననుండే వస్తుంది అని దేవుడు తననుతాను ఎరుకపరచుకున్నాడు. ఈ సంఘటనల ముగింపుగా యేసు కన్యమరియ ద్వారా జన్మించాడు. దీని ద్వారా దేవుడు తనను తాను సంపూర్ణంగా తెలియబరచుకున్నాడు అని కొందరు బోధించారు.

## 6. నూత్నీకరణ ప్రారంభం

పాత నిబంధనలో యెహెజ్కెయేలు ప్రవక్తద్వారా, "దేవుడు, ఈ లోకమును ఆత్మలో నూత్నీకరింపబోతున్నాడని" వాగ్దానం చేయబడింది (యెహెజ్కియేలు 36:37). ఈ క్రియను దేవుడు మరియమాతతో ఆరంభించాడు. క్రీస్తు జననం

సాధారణంగా జరిగేరీతిలో గాక, దేవుని ప్రభావం వల్ల జరిగింది. లోకమును సూత్రీకరించి, రక్షణను ప్రసాదించేందుకు యేసుప్రభుని జననం అసామాన్యమైన విధంగా సంభవించింది. అదే మరియమాత కన్యత్వాన్ని కాపాడింది.

## 7. సర్వోన్నతుని సామర్థ్యం

సాధారణంగా ఒక స్త్రీ ఒక పురుషుని కలయికతోనే గర్భం ధరించటం జరుగుతుంది. అయితే మరియమాత పవిత్రాత్ముని శక్తివల్ల గర్భం ధరించింది. దేవుడు సర్వాధిపతి, సర్వశక్తి సంపన్నుడు, అన్నింటినీ అధిగమించే శక్తిప్రభావాలు కలవాడు, ఏకకాలంలో అన్నిచోట్ల ఉండగల్గిన సర్వాంతర్యామి, ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు. కాబట్టి తన శక్తివల్ల కన్యకను గర్భం ధరించేలా చేశాడు.

## 8. దైవశక్తికి నిదర్శనం

దేవుడు కన్య నుండి నరావతారుడుయ్యేందుకు కారణం మానవుడు కాదు. దేవుడే ఆవిధంగా చిత్తగించాడు. ఇది మానవుని తలంపు ప్రకారం జరుగలేదు. కాబట్టి ఎవరి సహకారం లేకుండానే, అలాగే ఎలాంటి శారీరక సంబంధం అవసరం లేకుండానే దేవుడు మనుష్యావతారం ఎత్తాడు. మానవశక్తి కన్నా దైవశక్తే మిన్ననయినది, గొప్పది. అని మరియమాత కన్యత్వం చాటిచూపుతోంది. దైవశక్తికి సాక్షిగా జీవించేందుకు పిలువబడిందే మరియమాత కన్యజీవితం.

అనాదినుండే శరీరము, లైంగిక పరమైన విషయాలు (Sexuality) చెడ్డవనే భావాలను ప్లేటోనిజం, మానికేయిజం బోధించాయి. శరీరానికి సంబంధించిన విషయాలన్నీ, (దేహసంబంధమైనవన్నీ) చెడ్డవనే భావనలు క్రైస్తవుల మధ్యలో కూడా విస్తృత ప్రచారంలోనే ఉన్నాయి. దీనికి ఆధారంగా యోహాను 6:63: "జీవము నిచ్చునది ఆత్మయే, శరీరము నిష్ప్రయోజనము" అనే బైబులు వాక్యాన్ని ఉదహరించేవారు. కాబట్టి కన్యత్వము సాధించలేనట్టిది, అసాధారణమైనది, అసహజమైనదీ అయినప్పటికీ ఎంతో పవిత్రమైనది, పుణ్యప్రదమైనది. ఇది కేవలం దేవుని ప్రత్యేక అనుగ్రహం వల్లనే సాధ్యము అనే తలంపుల కారణంగా, మరియమాత కన్యత్వం గురించి ఆరంభకాలంనుండే ఇన్ని వ్యాఖ్యానాలు, చర్చలు, వాదోపవాదాలు బయలుదేరాయి. క్రైస్తవుల్లో కతోలికులు తప్ప వేరెవ్వరూ

మరియమాత 'నిత్యకన్యత్వాన్ని' అంగీకరింపరు.

ఇది ఇలా ఉంటే మరి మరియమాత కన్యత్వాన్ని ఏవిధంగా అర్థంచేసుకోవాలి? ఏదేమైనా కన్యత్వం అనేది కేవలం శారీరకంగాను, 'కన్యపొర' ఆధారంగాను నిర్ధారించే విషయం కాదు. పునీత అగుస్తీను అన్నట్టు మరియమాత మొదట యేసును తన హృదయంలోనూ మనసులోనూ గర్భందాల్చింది. ఆ తర్వాతే తన ఉదరములో గర్భం ధరించేందుకు సమ్మతి తెల్పింది. ఆ విధంగా ఆమె తన సంపూర్ణ సమ్మతి తెల్పటంద్వారా యేసును తన గర్భంలోనికి ఆహ్వానించింది. మరో విధంగా చెప్పాలంటే ఆమె తన దేవునికే అంకితం చేసుకొని సంపూర్ణంగా సమర్పించుకుంది. సంపూర్ణ సమర్పణమే కన్యత్వం. కాబట్టి 'మరియకన్యత్వం' అంటే ప్రధానంగా ఆమె దేవునితో కలిగివున్న అన్యోన్యబాంధవ్యం గానే అర్థం చేసుకోవాలి గానీ శరీరసంబంధమైన కన్యత్వభావనలతో ఆలోచిస్తూ తర్కించకూడదు.

## 9. భౌతికమైన కన్యత్వం (Physical virginity)

Chaste until married అంటారు. అనగా పెళ్లి అయ్యేంత వరకు ఎవరితో శారీరకసంబంధం లేకుండా జీవించడం. గాబ్రియేలు దేవదూత గలిలయ సీమయందలి నజరేతు నగరంలో దావీదు వంశస్థుడగు యోసేపునకు ప్రదానం చేయబడిన ఒక కన్యక యొద్దకు పంపబడ్డాడు. ఈ మంగళవార్త సందేశంలో ముఖ్యాంశాలు:

1. దైవ కుమారుడు ఒక స్త్రీ ద్వారా జన్మిస్తాడు.

2. ఆ స్త్రీ ఒక కన్యక అయి ఉంటుంది.

3. అతడు దావీదు వంశంలో జన్మించి, అతని సింహాసనాన్ని కలకాలం నిలుపుతాడు.

దైవకుమారుని మనుష్యావతారంలో కన్యజననం (కన్యకు జన్మించడం) అత్యంత ప్రాధాన్యత పొందడానికి కారణం, యెషయ ప్రవక్త ప్రవచనం అని చెప్పవచ్చు. "ఒక కన్య గర్భము ధరించి ఒక కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలు అని పేరు పెట్టుదురు. ఇమ్మానుయేలు అనగ దేవుడు మనతో

(తన ప్రజలతో) ఉన్నాడు అని అర్థం (యెషయ 7:14). ఇది ప్రవక్త ద్వారా దేవుడు ఆహాజు మహారాజుకిచ్చిన ఒక గురుతు. ఆ ప్రవచనం ప్రవక్త బ్రతికి ఉన్న కాలంలోనే నెరవేరవచ్చు లేదా సుదూరభవిష్యత్తులో జరగవచ్చు. కాని ప్రవక్తద్వారా దేవుడు పలికిన పలుకులు నెరవేరకుండ ఉండవు. యెషయ 7:14లో చెప్పబడిన మాటలు కన్యయైన మరియమ్మను గూర్చి చెప్పబడిన ప్రవచనమేనని మత్తయి సువార్త బలంగా చెబుతున్నది (మత్తయి 1:22–23), మత్తయి సువార్త ఈ విషయాన్ని 1:23లో ఈ విధంగా తెలియచేస్తుంది. 'ప్రవక్తతో దేవుడు పలికినది నెరవేరునట్లు ఇదంతయు సంభవించెను' (మత్తయి 1:23). మత్తయి సువార్త యేసుక్రీస్తు వంశావళితో ప్రారంభమౌతుంది. ఇది చదివేటపుడు కొద్దిగ అయోమయంలో పడినట్లుగా అనిపిస్తుంది. పేర్లు చదవటం ఆసక్తిగా అనిపించదు. చాలమంది ఈ భాగం వదిలేసి 18వ వచనంనుండి మొదలుపెడతారు. కతోలిక దైవార్చన క్రమములో ఆగమనకాలంలో ఈభాగం పూజలో చదవబడినప్పుడు, ప్రజలు అసహనంగానే ఉంటారు. చిన్నప్పుడు నేను కూడా కొంచెం అనాసక్తిగానే ఉండేవాణ్ణి. మంగళవార్త సందేశం పదేపదే చదివిన తరువాత, ఈ వంశావళి మరియు యోసేపుకు కలలో కనిపించిన వృత్తాంతం ఈమంగళవార్తకు అనుబంధంగా ఉన్నాయని తెలుసుకున్నాను. ఆ తరువాత వంశావళిని ఎన్నిసార్లు చదివానో నాకే తెలీదు.

మత్తయి 1:1–17 వరకు వంశావళి, 18–25 వరకు యోసేపుకు దేవదూత కలలో కనిపించి తనకు వివాహం చేయబడిన మరియ ఏ పాపం ఎరుగనిదని, పుట్టబోయే బిడ్డ పవిత్రాత్మ ద్వారా జన్మించనున్నాడని తెలియపరచడం, ఈ రెండు కలిపి చదివితేనే ప్రభువుయొక్క జన్మరహస్యం మనకు అర్థమౌతుంది. ఈ మొదటి అధ్యాయం అంతా మరియమ్మ కన్యత్వం గురించి ఎటువంటి సందేహాలకు తావు లేదని తెలియచేస్తుంది. ఈ అధ్యాయం కూడా కంఠస్థం చేయాలని నిర్ణయించుకున్నాను. మొదట్లో వంశావళిలో కనిపించిన గజిబిజి ఇపుడు కనిపించడం లేదు. ప్రతి పేరు వెనుక ఉన్న చరిత్ర తెలుసుకున్నాను. పూర్వనిబంధన అంతా కళ్ళ ముందు కనిపిస్తుంది. మత్తయి వ్రాసిన 42 తరాల వ్యక్తుల చరిత్ర దేవుని ప్రణాళికను, విశ్వసనీయతను మనముందు కనబరుస్తుంది. ఈ వంశావళిలో ఉన్న వ్యక్తులలో కొందరు దేవునికి విధేయించి

చరిత్రపురుషులుగా నిలిచారు. కొందరు అవిధేయించి, అన్యదేవతలను కొలిచి చరిత్రహీనులుగా నిలిచారు. కాని దేవుడు ఎవరిని నాశనం చెయ్యలేదు. తాను దావీదుకిచ్చిన వాగ్దానాన్ని మరచిపోలేదు. అతని వంశాన్ని నిర్మూలించలేదు. మెస్సయ్య ఈ వంశంలో జన్మించాలని దేవుడు సంకల్పించాడు.

మొదటి 14 తరాలు అబ్రహామునుండి దావీదు వరకు, రెండవ 14 తరాలు దావీదు నుండి బాబిలోను ప్రవాసం వరకు, మూడవ 14 తరాలు బాబిలోను ప్రవాసం నుండి యేసుక్రీస్తు జననం వరకు మూడు భాగాలుగా విభజించి వంశావళిని ఇంకా సులభతరం చేసాడు మత్తయి. వంశం అనేది పురుషుని పేరు మీద పిలువబడుతుంది. పురుషాధిక్య సమాజంలో వంశాలు పురుషుని ద్వారానే ఏర్పడతాయి. మత్తయి కూడా ఇదే క్రమాన్ని అనుసరించాడు. అబ్రహాము ఇస్సాకుకు తండ్రి, ఇస్సాకు యాకోబుకు తండ్రి, యాకోబు జెర, పెరేసులకు తండ్రి, పెరేసు యూదాకు అతని సోదరులకు తండ్రి. కొన్ని వాక్యాలు అయిన తరువాత అనూహ్యంగా స్త్రీలపేర్లు ప్రస్తావించ బడ్డాయి. రాహాబువలన సల్మోనుకు బోవాజు జన్మించెను. రూతువలన బోవాజుకు ఓబేదు జన్మించెను. ఓబేదుకు ఈషాయి జన్మించెను. ఈషాయికి దావీదు మహారాజు జన్మించెను. రాహాబు, రూతుల చరిత్ర గురించి ఇక్కడ చర్చించబోవడం లేదు. కాని వారి ప్రస్తావన ముఖ్యం అని మత్తయి భావించాడు. వంశావళిలో అన్యులైన స్త్రీలను చేర్చడం ద్వారా రక్షకుడు అన్ని జాతులకు చెందినవాడని చెప్పడం మత్తయి ఉద్దేశ్యం కావచ్చు. చివరి వంశంలో యోసేపు గురించి వ్రాసేటపుడు మత్తయి వ్రాసిన మాటలను జాగ్రత్తగా గమనించాలి. ఎలియాజరుకు ఎలియూదు, ఎలియూదుకు మత్తాను, మత్తానుకు యాకోబు, యాకోబుకు మరియమ్మ భర్తయగు యోసేపు జన్మించెను. మరియమ్మ పేరును ఇతర స్త్రీలవలె ప్రస్తావించలేదు. చదివేవారిలో ఉత్సుకత పెరిగేటట్లు చేసాడు. రచయిత చెప్పాలనుకున్న అంశంవైపు పాఠకుల ఆలోచనను త్రిప్పాడు. సాధారణంగా, మరియమ్మ వలన యోసేపుకు యేసు జన్మించెను అని వ్రాయాలి, కాని మత్తయి సరియైన పదాలను ఎన్నుకుని విషయాన్ని స్పష్టంగా సూటిగా చెప్పాలనుకున్నాడు. యాకోబుకు మరియమ్మ భర్తయగు యోసేపు జన్మించెను, మరియమ్మకు యేసు అనబడు క్రీస్తు జన్మించెను. ఎటువంటి చర్చకు ఆస్కారం

ఇవ్వకుండా, క్రీస్తు జననంలో పురుష ప్రమేయం లేదని తెలిపాడు. మరియమ్మ ఒక కన్యక అని నిర్ద్వందంగా ప్రకటించాడు.

ఇది ఎలా జరుగుతుంది? పురుష ప్రమేయం లేకుండా ఇది సంభవమా? అందుకే మరియమ్మ “ఇది ఎట్లు జరుగును? నేను పురుషుని ఎరుగను కదా! అని దూతను ప్రశ్నించెను” (లూకా 1:34) దీనికి సరియైన జవాబు: దేవునికి అసాధ్యమైనది ఏది లేదు. ఇప్పటివరకు గొడ్రాళ్లకు బిడ్డలనిచ్చిన దేవుడు, ఇప్పుడు ఒక అసాధారణ రీతిలో ఒక కన్య కుమారుని కనడం అనే అసంభవమైనకార్యాన్ని సంభవించేలా చేసి దైవకుమారుని జననానికి ఒక విశేషమైన ప్రాధాన్యతను చేకూర్చాడు.

కన్యత్వం మాతృత్వం అనేవి రెండూ పరస్పర విరుద్ధమైనవి. కన్యత్వం ఉన్నచోట మాతృత్వం ఉండలేదు. మాతృత్వం ఉన్న చోట కన్యత్వం ఉండలేదు. ఈ రెంటిని దేవుడే స్వయంగా సమన్వయం చేసి ఒకే స్త్రీ మూర్తిలో పొదిగిన గొప్ప రహస్యం ఇది. ఈ రెంటిని ఏకకాలంలో కలిగిఉన్న స్త్రీ మరియమ్మ ఒక్కతే.సంఘానికి ఇది ఒక అసాధారణమైన గురుతు. పురుషుని ప్రమేయం లేకుండా ఒక స్త్రీ జన్మనివ్వడం కేవలం ఆమె కన్యగా వుండి కుమారుని కనినది అనే సందేశం మాత్రమేకాదు. దేవునికి అసాధ్యమైనది ఏది లేదు అనే సందేశాన్ని అందించాడు. మరియమ్మ ఏ తప్పు చేయలేదు. ఆమె కన్యగానే వున్నది కనుక ఆమెను నీవు భార్యగా స్వీకరించాలి అని యోసేపుకు దూత తెలియచేసాడు. ఆమె పవిత్రాత్మ ప్రభావము వలన గర్భము ధరించినది అనే దేవరహస్యాన్ని తెలిపాడు. అయితే ఈ కార్యం ఆమె గొప్పతనం వలన కాదు. దేవుని శక్తి వలన. ఇది దైవ కార్యం. ఒక సామాన్యమైన స్త్రీని కన్యగా, దేవమాతగా దేవుడుచేసిన గొప్పకార్యమిది. అందుకే మరియమ్మను కన్యతల్లి అని అనాది నుండి పిలవడం జరిగింది.

## 10. ఆధ్యాత్మిక కన్యత్వం ఆత్మీయ కన్యత్వం

దావీదు మహారాజు తరువాత 10వ తరంలో ఆహాజు అనే రాజు యూదానేలే సమయంలో యెషయ ప్రవక్త ద్వారా దేవుడు పలికిన ప్రవచనం 714: “కన్య గర్భము ధరించి కుమారుని కనును”. ఈ ప్రవచనం యొక్క

పూర్వాపరాలు పరిశీలిస్తే ఈ ప్రవచనం ఎందుకు చెప్పబడిందో మనకు అర్ధమౌతుంది. దావీదు మహారాజు దేవుని హృదయానికి దగ్గరగా, ఆయనకిష్టుడిగా జీవించాడు. దేవుడు ఆయన సింహాసనానికి సంబంధించిన వాగ్దానంతో పాటు ఒక హెచ్చరిక చేసాడు. “నీ తరువాత వచ్చు తరాలను కూడా దీవిస్తాను. వారు నా ఆజ్ఞలకు బద్ధులై జీవించలేని పక్షంలో వారిని శిక్షిస్తాను.” 2 సమూ 7. కాని చిత్రంగా దావీదు తరువాత వచ్చిన రాజు సోలోమోను మహారాజే దేవుని అనుగ్రహం కోల్పోయాడు. దావీదు నుండి 14 తరాలరాజులలో ముగ్గురు మాత్రమే దావీదువలె దేవునికి ఇష్టులుగా జీవించారు. మిగిలినవారంతా యావేదేవునికి ఇష్టులుగా జీవించలేదు. ఇరుగుపొరుగు రాజ్యాల దేవతలనో, బాలు దేవతలనో దేవునిగా భావించి విగ్రహాలను చేయించి వాటికి మ్రొక్కి బలులు అర్పించారు. దేవుని ఆగ్రహానికి గురయ్యారు. ఆహాజు కూడా ఈ కోవలోకే వస్తాడు.

“ఈ రాజు తన పితరుడైన దావీదు వలె ధర్మబద్ధముగా జీవింపడయ్యెను” (2 రాజులు 16:2). ఇతడు (ఆహాజు క్రీ.పూ. 736–716) విగ్రహారాధనకు వశమయ్యాడు. ఎంతగా అంటే తన స్వంత కుమారుడినే విగ్రహాలకు దహన బలిగా అర్పించేటంతగా. అన్యజాతులవారి జుగుప్సాకరమైన ఆచారాల ననుసరించి బలులు అర్పించాడు. లోహముతో బాలు విగ్రహాలను చేయించి ఆరాధించాడు. 16సంవత్సరాలు ఈ విధంగానే పరిపాలించాడు. ఇతడు దేవాలయ ప్రాసాదములోని బంగారమును తీసుకుపోయి అస్సీరియరాజుకు అర్పించాడు. ప్రభుని ఆజ్ఞలను ఎక్కువగా ధిక్కరించాడు. అందుకే దేవుడు అతనిని శిక్షించాడు. అతడు సిరియా ఇశ్రాయేలు రాజుల చేతికిచిక్కేలా చేసాడు. “యూదీయులు తమ పితరుల దేవుడైన ప్రభువును విడనాడిరి కనుక ఇట్టి శిక్షకు పాత్రులైరి” (2 దినచర్య 28:6). ఒకవైపు బలహీనులైన రాజులు యూద, ఇశ్రాయేలు రాజ్యాలను పరిపాలిస్తుంటే, మరో వైపు వారి ఆగర్భశత్రువైన అస్సీరియ గొప్ప రాజకీయశక్తిగా ఎదిగింది. వ్యాపారరంగంలో, యుద్ధరంగంలో దానికి ఎదురునిలిచే శక్తి చుట్టుపక్కల లేదు. ఈ సమయంలో అస్సీరియకు (అష్శూరు రాజ్యం) ఆనుకుని వున్న సిరియాదేశపు రాజు రెజీను అస్సీరియను దెబ్బతీయాలని ఆలోచించాడు.

ఈ కార్యం తానొక్కడివల్ల కాదని గ్రహించి ప్రక్కనే వున్న ఇశ్రాయేలురాజు అయిన పెక మరియు యూదరాజైన ఆహాజును తనతో చేతులు కలపమని కోరాడు. పెక వెంటనే ఒప్పుకున్నాడు. తమ ఆగర్భశత్రువును ముగ్గురు కలిస్తే సులువుగా మట్టి కరిపించవచ్చని ఆనందపడ్డాడు. ముగ్గురుకలిస్తే తమ సంయుక్త సేనలతో అస్సీరియ సేనలను ఓడించడం పెద్ద విశేషమేమీ కాదని భావించాడు. కాని యూదరాజైన ఆహాజు వారితో చేతులుకలపడానికి నిరాకరించాడు. అతడు అస్సీరియ ప్రాపకంలో వున్నాడు. రెజీను, పెక ఇద్దరు ఈ సంగతి విని మండిపడ్డారు. అస్సీరియ కంటే ముందు యూదరాజును బంధించి తమ మనిషిని యెరుషలేములో రాజుగా నియమించాలని ఎత్తుగడ వేశారు. ఇది తెలిసి ఆహాజు భయపడిపోయాడు. వెంటనే అస్సీరియరాజుకు కబురుపంపి శరణువేడాడు.

ఈ సమయంలో ప్రభువైన దేవుడు యెషయ ప్రవక్త ద్వారా ఆహాజుకు సందేశం పంపాడు. ఆ సందేశం విని ఆహాజుమహారాజు ఇంకా భయపడ్డాడు. యెషయ ప్రవక్త ఆహాజుని హెచ్చరించాడు. ఇలాంటి సంకటస్థితి వచ్చినప్పుడు శరణువేడాల్సినది పక్కరాజును కాదు, యావే ప్రభువును. ఇది క్షమించరాని నేరం. ఆహాజును దేవునిపై ఆధారపడి ఒంటరిగానే తన సైన్యంతో యుద్ధానికి వెళ్లాలని హితవు చెప్పాడు. యుద్ధం దేవునిది. ఆయనే విజయాన్ని ఇస్తాడు ఆలోచించుకొమ్మని చెప్పాడు. నీవు ఎవరిని చూసి భయపడుతున్నావో వారి రాజ్యాలే భూమిమీద లేకుండా చేస్తానని ప్రభువు అభయమిస్తున్నాడని కూడ చెప్పాడు. రెండవసారి ప్రవక్త వచ్చి ఆహాజుకు నమ్మకం కలగాలంటే దేవుడు ఒక గురుతును ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడని, ఆహాజు ఎలాంటి గురుతునైన కోరుకోవచ్చని, అది భూలోకానికి చెందినదైన పరలోకానికి చెందినదైన సరే కోరుకొమ్మని చెప్పాడు. అయినా ఆహాజుకు గురి కుదరలేదు. చివరికి ప్రవక్త ఆహాజుతో అన్నాడు. నీవు గురుతు అడగడం లేదు కదా, దేవుడే నీకొక గురుతునిస్తాడు. "ఇదిగో కన్య గర్భము ధరించి కుమారుని కనును." (7:14).

ఆహాజు ఈ యుద్ధంలో సిరియా ఇస్రాయేలీయుల సంయుక్త సేనలను ఒంటరిగా గెలవడం అసాధ్యం అనుకుంటున్న సమయంలో దేవుడు ఒక

అసాధ్యమౌ గురుతునిస్తాడు. అసాధ్యమైన ఆ ప్రవచనమే అసాధ్యమని నీవు భావిస్తున్న విజయం ఎందుకు సాధ్యంచెయ్యడు దేవుడు అని ప్రవక్త రాజుకు ధైర్యం చెప్పాడు. ఏలయన దేవునికి అసాధ్యమైనది ఏది లేదు. ఈ యుద్ధం దేవునికి ఒక సమస్య కానే కాదు. దేవుణ్ణి నమ్ము. పూర్తిగా దేవుని మీద ఆధారపడు అని ప్రవక్త హిత బోధ చేసాడు. నెరవేరబోతున్నప్పుడు ఇలాంటి విపత్కర పరిస్థితి వచ్చినప్పుడు దావీదు ఐతే ఏంచేసేవాడు. దావీదు మహారాజు కాలంలో ఫిలిస్తీయులు ప్రధాన శత్రువులుగా వుండేవారు. దావీదు యెరుషలేమును జయించి దానిని తన కేంద్రంగా చేసుకుని పరిపాలించే సమయంలో అది సహించలేక ఫిలిస్తీయులు ఒక్క పెట్టున అతనిమీద దండయాత్ర చేసారు. అపుడు దావీదు స్వంతనిర్ణయాలు తీసుకోలేదు. స్వంతశక్తిని నమ్ముకోలేదు. యావే ప్రభువును సంప్రదించాడు. నేను వెళ్లి ఫిలిస్తీయులను ఎదుర్కొనవచ్చునా? నీవు వారిని నా వశము చేయుదువా' అని దావీదు ప్రభువును అడిగాడు. "నీవు వెడలిపొమ్ము, నేను ఫిలిస్తీయులను తప్పక నీకప్పగించెదను" అని ప్రభువు దావీదుతో అన్నాడు. (2 సమూ 5:19) అన్నట్లుగానే దావీదు ఫిలిస్తీయులను తునుమాడాడు. యుద్ధంలో విజయం సాధించిన దావీదు చేసిన మొదటి పని: 'ఏటిపొంగు నదిఒడ్డులను కోసి కూల్చివేసినట్లుగా ప్రభువు శత్రువులమీద పడి వారి సైన్యములను కూల్చి వేసెను' అని దావీదు భావించి ఆ స్థలమునకు బాల్పెరాసీము (దేవుడు కూల్చివేసెను) అని పేరు పెట్టాడు. మరోసారి ఫిలిస్తీయులు దండెత్తి వచ్చి రేఫాయీము లోయ దగ్గర మాటు వేసినప్పుడు, దావీదు యావే ప్రభువునే సంప్రదించాడు. "శత్రువులను సంహరించుటకై ప్రభువే నీకు ముందుగా నడచుచున్నాడని గ్రహింపుము" అని ప్రభువు దావీదుకు చెప్పెను. దావీదు యావే ఆజ్ఞాపించినట్లే చేసి శత్రువులను గేబ నుండి గేసేరు వరకు తరిమికొట్టాడు. (2 సమూ 5:24,25) సైన్యములకు అధిపతియైన యావే ప్రభువు దావీదుకు చేదోడువాదోడుగా ఉండుట వలన దావీదు నానాటికి వృద్ధిచెందాడని పరిశుద్ధ గ్రంథం తెలియచేస్తుంది. యుద్ధం యావేదే యుద్ధమేకాదు. ఏ సమస్య వచ్చినా ఆశ్రయించవలసినది దేవుడినే. ఈ విషయాన్నే యెషయ ద్వారా దేవుడు ఆహాజుకు గుర్తుచేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితే న్యాయాధిపతుల గ్రంథంలో గిద్యోనుకు ఎదురయ్యింది. వరహాలులో లక్ష పైగా

వున్న పాయేలు ప్రజలకు కంటిమీద కునుకులేకుంది. చేసేవారు. లక్షకు పైగా వున్న మిద్యానీయులను ఎదుర్కోవడానికి 32,000 మంది యుద్ధవీరులతో గిద్యోను సిద్ధమయ్యాడు. యావేప్రభువు గిద్యోనుతో "ఇంతమందితో యుద్ధానికి వెళ్ళవద్దు' అని చెప్పాడు. తనను నమ్మి 300 మందితో యుద్ధానికి వెళ్ళమన్నాడు. గిద్యోను దేవుని మాట నమ్మి 300 మందితోనే యుద్ధానికి వెళ్ళగా, దేవుడు మిద్యానీయులను గిద్యోను వశము చేసాడు. నీ వెనుకవున్న మందిమార్బలం మీద నీవు నమ్మకముంచడం కంటే దేవుని మీద ఆధారపడితే విజయం నీదేనని దేవుడు రుజువు చేసాడు.

ఇప్పుడు ఆహాజుకు ఇవేవి గుర్తుకు రావడం లేదు. భయంతో వణుకుతున్నాడు. దేవుడు ఇచ్చిన గురుతు ఆహాజుకు ధైర్యం ఇవ్వలేకపోతుంది. కారణం అతడు దేవునికి దూరంగా జీవిస్తున్నాడు. దేవుడిచ్చే గురుతు ఆకాలంలోనే జరుగుతుంది. ఒక్కొక్కసారి బహుసుదూర భవిష్యత్తులో కూడా జరగవచ్చు. కొంతమంది పండితులు ఇది యెషయ భార్య గర్భవతియై ఉన్నది కనుక ఆమెనుద్దేశించి చెప్పి ఉండవచ్చు లేదా ఆహాజుభార్య గర్భవతియై ఉన్నది కనుక ఆమె గురించి చెప్పి ఉండవచ్చు అని భావించారు. ఎక్కువమంది బైబిల్ పండితుల ఉద్దేశ్యం ఏమిటంటే ఏదైనా గురుతు దేవుడిస్తే దానిలో ఏదో ఒక అద్భుతం ఉంటుంది. అద్భుతవిషయం లేకుండా గురుతు వుండదు. ఇస్రాయేలీయులకు దేవుడిచ్చిన గురుతులు పరిశీలిస్తే ఇదే మనకు అర్ధమౌతుంది. ఇదే అలవాటుతో నూతన నిబంధనలో పరిసయ్యులు యేసును గురుతునడిగారు. "పరలోకము నుండి ఒక గురుతును చూపుము" (మార్కు 8:11,12). దేవుడు తన ప్రజలను రక్షించడానికి వెళ్ళమన్నప్పుడు దేవుణ్ణి గురుతు అడిగాడు మోషే (నిర్గమ 4:19), మిద్యానీయులపై యుద్ధానికి వెళ్తే తనకు విజయం వరిస్తుందనడానికి గురుతునడిగాడు గిద్యోను (న్యాయ 6:17). తన జబ్బు తగ్గుతుందని నమ్మడానికి గురుతు నడిగాడు హిజ్కియ రాజు (2 రాజులు 20:8). కాని ఆహాజు దేవుణ్ణి గురుతు అడగడానికి నిరాకరించాడు. అప్పుడు దేవుడే స్వయంగా ఈ గురుతునిచ్చాడు. కనుక బైబిల్ పండితుల్లో అత్యధికశాతం ఈ గురుతులో పరమోన్నతమైన అధ్భుతం ఉండి ఉండాలి కనుక ఇది ఒక యువతి లేదా స్త్రీ లేదా కన్య వివాహమాడి కుమారుని కనడం

అనే అర్థంలో చెప్పబడిన గురుతుగా గాక, భవిష్యత్తులో జరగబోయే గొప్ప అద్భుతమైన విషయం ఉండిఉంటుంది అని, ఒక కన్య కన్యగానే ఉండి తల్లిగా మారుతుంది అనే అర్థాన్ని ఈ గురుతు కలిగివుంది అని తమ వ్యాఖ్యానాలలో వ్రాసారు. భూలోక పాతాళ లోకాలలో ఏ గురుతువైన కోరుకొమ్మని చెప్పిన దేవుడే ఇప్పుడు ఆ రెండు లోకాల కంటే ఆధిక్యమైన పరలోకపు గురుతునిచ్చాడు. ఇది కేవలం యెషయ లేదా ఆహాజు భార్యలనుద్దేశించి చెప్పబడింది కాదని నమ్మారు. మత్తయి సువార్త కారుడు కూడా రాబోయే మెస్సయ్య ఇలాంటి అద్భుతజన్మను కలిగిఉంటాడు అని నమ్మాడు. అందుకే 1:22,23లో యెషయప్రవక్త చెప్పిన అద్భుత కన్య తల్లి మరియమ్మేనని మత్తయి ధ్రువీకరించాడు. ఆమె కన్యత్వాన్ని దృఢముగా విశ్వసించాడు.

ఈ గురుతులో మరో విషయాన్ని దేవుడు తెలియచేస్తున్నాడు. అది కూడా మరియమ్మకు వర్తింపచేస్తున్నాడు. ఆహాజులాంటి భ్రష్టులైనవారు వేశ్యలుగా పరిగణింపబడ్డారు. దేవుణ్ణి మాత్రమే నమ్మి, దేవుని తరువాతే ఎవరైనా అని జీవించినవారు ఆధ్యాత్మిక కన్యత్వం కలిగినవారుగా పరిగణింపబడ్డారు. మరియమ్మ తనకన్యత్వం ద్వారా తననుతాను దేవునికి సమర్పించుకున్నది. తన నిర్ణయం ద్వారా దేవుని చిత్తానికి సంపూర్ణంగా సమర్పించుకున్నది. ఒకనాడు యెరుషలేము (సీయోను) కూడా సమర్పిత. కాని కాలక్రమంలో ఈ సమర్పిత పరిత్యక్తగా మారింది. ఇంకోరకంగా చెప్పాలంటే అన్యదేవతలను కొలిచి వ్యభిచారిగా (వేశ్య) మారింది. ఇక్కడ యెరుషలేమును ఇశ్రాయేలుజాతికి ప్రతినిధిగా దేవుడు చూస్తున్నాడు. యెరుషలేమునగరం, ఇశ్రాయేలుజాతి రెండూ పునరుద్ధరించబడాలి. దేవుడే అది చేస్తాడు. దానితో నూతన ఒడంబడిక చేస్తాడు. పరిత్యక్తయైన యెరుషలేము సమర్పిత కావాలి. దానికి నిలువెత్తురూపం కన్యమరియమ్మ, కేవలం శారీరక కన్యత్వంతోనే ఆమె దేవునికి ఇష్టురాలు కాలేదు. సమర్పితగా ఆధ్యాత్మిక కన్యత్వాన్ని కూడా ప్రదర్శించింది. సీయోనుకన్య అయిన యెరుషలేము కూడా ప్రభువును ఈ విధంగా స్వీకరించాలి. కన్యగా ఉండి మరియమ్మ ప్రభువును గర్భాన మోసినట్లే సీయోనుకన్య దేవుణ్ణి మోయాలి, దేవునికి మరియమ్మవలె ప్రీతిపాత్రము కావాలి.

పరిశుద్ధ గ్రంథంలో ఆత్మీయకన్యత్వం గురించి ఏమి చెప్పబడిందో పరిశీలిద్దాం. అబ్రహాముయొక్క విశ్వాసం ఈకోవకే చెందింది. దేవునియందు అచంచలమైన విశ్వాసంతో దేవుని మాటకు ఎదురుచెప్పకుండా పాటించడం ద్వారా అబ్రహాము విశ్వాసానికి తండ్రి అయ్యాడు. మరో దేవుడు లేడు, మరో మాట లేదు అబ్రహాము వద్ద. ఇదే దేవుడు ఆత్మీయ కన్యత్వంగా పరిగణించాడు. దావీదు ఎంత రక్తపాతం సృష్టించినా, ఘోరమైన రహత్య, వ్యభిచారము చేసినా, తనతప్పు తెలిసికొని గోనె ధరించి, ఉపవాస ప్రార్ధనలతో దైవక్షమాపణ వేడుకొని పునీతం గావించబడ్డాడు. యావేప్రభువును తప్ప వేరొకని పూజింపనివాడే ఈ కోవకు వస్తాడు. యావేప్రభువును పరిత్యజించి అన్యదేవతలను కొలిచేవారు వ్యభిచారుల (దేవుని నిర్దేశిత నియమాలను వదలి ఇష్టానుసారముగా వ్యవహరించేవారు) కిందకి వస్తారు. దావీదు దేవుని హృదయానికి దగ్గరగా జీవించాడని గ్రంథం చెబుతున్నది. దావీదురాజు తరువాత తరాలలో హిజ్కియ, యోషియా మాత్రమే ధర్మబద్ధంగా జీవించి దేవునికి ఇష్టులయ్యారు. అతడు తన పితరుడు దావీదు వలె ధర్మబద్ధముగా జీవించి యావేకు ఇష్టుడయ్యెను. (2 రాజులు 18:3) హిజ్కియ ప్రభువుకు అనుచరుడయ్యెను. ప్రభువు మోషే ద్వారా ప్రసాదించిన ఆజ్ఞలన్నిటిని పూర్తిగా పాటించెను. (2 రాజులు 18:5,6) యోషియావలె మోషే ఆజ్ఞలన్నిటిని పాటించి పూర్ణహృదయముతో, పూర్ణ మనస్సుతో, పూర్ణ శక్తితో ప్రభువును కొలిచినవాడు పూర్వపు రాజులలో ఒక్కడు లేడు. తరువాత వచ్చిన వారిలో నెవడును లేడు. 2 రాజులు 23:25. మత్తయి సువార్తలో ప్రభువైన యేసు చెప్పిన మాటలివే: "నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణమనస్సుతోను, ప్రేమింపవలెను. ఇది ముఖ్యమైన మొదటి ఆజ్ఞ" అని తనను ప్రశ్నించిన ధర్మశాస్త్రబోధకుడికి బదులిచ్చాడు (మత్తయి 22:37).

ఒకరాజు విజయవంతమైనరాజు అని ఏది చూసి చెప్పొచ్చు? యుద్ధాలలో విజయమా? దేశంలో సమాధానమా? సంపదతో నిండిన ఖజానానా? రాజ్య విస్తరణనా? బైబిల్ గ్రంథం ఇవేవి కాదంటుంది. ప్రభువును పూర్ణహృదయముతోను, పూర్ణఆత్మతోను, పూర్ణమనస్సుతోను ఆరాధిస్తూ ఆయన మాటలను పాటిస్తే మిగతావన్నిటిని దేవుడు కలిగిస్తాడు అని చెబుతున్నది.

కాని ఇశ్రాయేలీయులు పదేపదే దేవుణ్ణి విడనాడారు. ఆధ్యాత్మిక వ్యభిచారానికి ఒడిగట్టారు. ఆ పాపజీవితాన్ని విడిచిపెట్టి తనవద్దకు రమ్మని ప్రవక్తలద్వారా దేవుడు ప్రజలకు తెలియపరిచాడు. ఇస్రాయేలూ! నేను నిన్నెట్లు విసర్జింతును? నిన్నెట్లు పరిత్యజింతును? (11:8). ఇటలీలోని మిలాను అగ్రపీఠంలో 2012కు ముందు కార్డినల్ గా వున్న కార్లో మరియమర్తీని (Carlo Maria Martini) బహుముఖ ప్రజ్ఞావంతుడు. ప్రజల చేత బహుగా ప్రేమించబడినవాడు. మంచి వక్త. ఆయన ప్రసంగాల THE WOMAN AMONG HER PEOPLE ప్రచురించారు. మార్తమ్మ అనేక విషయాలతో సతమతమవుతూ వుండేది. కాని ఆమె సోదరి మరియమ్మ మాత్రం ప్రభువు పాదాల చెంత కూర్చునేది. ఆయన చెప్పే దైవరాజ్యరహస్యాలను గురించి ఆసక్తిగా ఆలకించేది. తనహృదయాన్ని పూర్తిగా దేవునికి అంకితమిచ్చింది అంటూ ఆధ్యాత్మిక కన్యత్వం ఎలా ఉండాలో వివరించారు. పౌలు కొరింతీయులకు వ్రాస్తూ ఇదే విషయాన్ని వివరించాడు: శారీరకము గాను, ఆత్మయందును కూడా అర్పించుకొను తలంపుతో అవివాహితస్త్రీ లేదా కన్యక, ప్రభువుపనియందే నిమగ్నురాలగును. వివాహితయగు స్త్రీ భర్తను సంతోషపెట్టు తలంపుతో లౌకిక వ్యవహారములలో చిక్కుకొనును. అవివాహిత వ్యక్తులు ప్రభువుపని యందె నిమగ్నమైనప్పుడు వారు శారీరక, ఆధ్యాత్మిక కన్యత్వం కలిగివున్నారు అని చెప్పవచ్చు. ప్రభువును నమ్మినవారు పూర్తిగా లౌకిక వ్యవహారములలో చిక్కుకుని రెండు పడవల మీద ప్రయాణం చేయకూడదు. ధనమా? దైవమా? భోగమా? త్యాగమా? లౌకికమా? ఆధ్యాత్మికమా?పరిత్యజితమా? సమర్పితమా? కార్డినల్ మర్తీని మాటలలో క్రైస్తవ కన్యత్వం అంటే భౌతిక కన్యత్వం కంటేలోతైనది, ప్రగాఢమైనది. కన్యత్వం అంటే దేవునికే చెంది ఉండటం. దేవునికి మాత్రమే చెందివుండటం. నీ మాట చొప్పున నాకు జరుగునుగాక అని మాట ఇచ్చి దానిప్రకారం జీవించడం. కన్యమరియమ్మకన్యత్వం ఈ కోవలోకే వస్తుంది. ఆమె భౌతిక కన్యత్వంతో పాటు ఈ ఆత్మీయ కన్యత్వం కలిగి ఉన్నది. ఏ విధంగా కన్యమరియమ్మ తన భౌతిక, ఆధ్యాత్మిక కన్యత్వములద్వార దేవునికుమారుణ్ణి ఈ లోకంలో మానవులతోఉండే నిమిత్తం స్వీకరించిందో, దేవుణ్ణినమ్మే నరులందరూ లింగబేధాలకు అతీతంగా ఈ ఆధ్యాత్మిక కన్యత్వం కలిగి

ఉన్ననాడే దేవుడు వారిమధ్య ఉంటాడు. క్రీస్తుజననం యొక్క ముఖ్యమైన సందేశం ఇదే. దేవుడు మనతో ఉన్నాడు ఇమ్మానుయేలు. చివరిగా, స్వయంగా ప్రభువే పలికిన మాటలతో ఈ అధ్యాయాన్ని ముగిద్దాం."దైవానుగ్రహం కలవారికే కాని మరెవ్వరికి ఇది సాధ్యం కాదు. కొందరు పుట్టుకతోనే నపుంసకులుగా పుట్టుచున్నారు. మరికొందరు పరులచే నపుంసకులుగా చేయబడుచున్నారు. పరలోకరాజ్యము నిమిత్తమై తమకు తాము నపుంసకులు అయినవారు. కొందరున్నారు. గ్రహింపగలిగినవాడు గ్రహించునుగాక" అని యేసు పలికెను. (మత్తయి 19:11,12). పరలోక రాజ్యము నిమిత్తము తమనుతాము అర్పించుకుని కన్యలుగా, బ్రహ్మచారులుగా ఉన్నవారు దైవానుగ్రహంతోనే ఈ జీవితాన్ని జీవిస్తున్నారు. భౌతికమైన కన్యత్వం మాత్రమే ఉంటే సరిపోదు. అంతరంగిక కన్యత్వం, ఆత్మీయ కన్యత్వంతో మనసా, వాచా, కర్మణా జతకలిస్తేనే వారు ప్రభువుకు యోగ్యు లౌతారు. వారు మాత్రమే కాదు ఇతర అంతస్తులలో జీవించే సాధారణ క్రైస్తవులు. గృహస్థ క్రైస్తవులు కూడా ఆత్మీయ కన్యత్వం కలిగి వుండాలి. ఈ సమర్పిత జీవితంలో అందరకు ఆదర్శమూర్తి మరెవ్వరో కాదు. సీయోను కుమారియైన, ఇశ్రాయేలు ప్రజలకు సాదృశ్యంగా ఉన్న సీయోనుకన్య కన్య మరియమ్మ.

**16వ శతాబ్దపు జర్మన్ సన్యాసి మరియు సంస్కర్త అయిన మార్టిన్ లూథర్:**

కతోలికులతో పోలిస్తే మరియమ్మ శాశ్వతమైన కన్యత్వంపై భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉన్నాడు. యేసు జననానికి ముందు లూథర్ మరియమ్మ కన్యత్వాన్ని ధృవీకరించినప్పటికీ, యేసు పుట్టిన తర్వాత ఆమె శాశ్వతమైన కన్యత్వానికి అతను పట్టుబట్టలేదు. మరియమ్మ మరియు యోసేపులకు వివాహ సంబంధాలు ఉన్నాయని మరియు యేసు తర్వాత పిల్లలు ఉన్నారని అతను నమ్మాడు, తద్వారా మరియమ్మ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క ఆలోచనను తిరస్కరించాడు. అయినప్పటికీ, లూథర్ ఇప్పటికీ మరియమ్మని ఎంతో గౌరవించాడు మరియు యేసు తల్లిగా ఆమె పాత్రను నొక్కి చెప్పాడు. మరియమ్మయొక్క శాశ్వతమైన కన్యత్వం అనేది కొన్ని క్రైస్తవ తెగలచే ప్రత్యేకించి కతోలికులు మరియు తూర్పు ఆర్థోడాక్సీలో ఉన్న నమ్మకం. యేసు జననానికి

ముందు, సమయంలో మరియు తరువాత మరియ కన్యగా ఉండిపోయిందని ఇది నొక్కి చెబుతుంది. ఈ నమ్మకం పరిశుద్ధ గ్రంథ భాగాలు, ప్రారంభ క్రైస్తవ రచనలు మరియు సంప్రదాయం యొక్క వివిధ వివరణలపై ఆధారపడి ఉంటుంది. ఖచ్చితంగా, మరియమ్మపై మార్టిన్ లూథర్ యొక్క అభిప్రాయాలు సంక్లిష్టమైనవి మరియు కాలక్రమేణా అభివృద్ధి చెందాయి. అతను మరియమ్మ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క సిద్ధాంతాన్ని తిరస్కరించినప్పటికీ, అతను ఇప్పటికీ క్రైస్తవ విశ్వాసంలో ఆమె ప్రాముఖ్యతను నొక్కి చెప్పాడు.

లూథరన్లు సాధారణంగా మరియమ్మని యేసు యొక్క తల్లిగా గౌరవిస్తారు మరియు మోక్ష చరిత్రలో ఆమె పాత్రను గౌరవిస్తారు, అయినప్పటికీ వారు ఆమె శాశ్వతమైన కన్యత్వానికి కతోలికులు మరియు తూర్పు ఆర్థోడాక్స్ వలె అదే స్థాయి ప్రాముఖ్యతను ఆపాదించరు. మొత్తంమీద, మరియమ్మపై లూథర్ అభిప్రాయాలు కొన్ని మరియను గురించిన సిద్ధాంతాలపై ప్రొటెస్టంటిజం మరియు కతోలికుల మధ్య వేదాంతపరమైన తేడాలను ప్రతిబింబిస్తాయి. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించి మార్టిన్ లూథర్ మరియు కతోలికుల అభిప్రాయాలలో ఉన్న వ్యత్యాసాలను అనేక కీలక అంశాలలో నిర్వచించవచ్చు:

## 1. శాశ్వత కన్యత్వం:

లూథరనిజం, యేసు పుట్టక ముందు, సమయంలో మరియు తరువాత మరియమ్మ కన్యగా ఉండిపోయిందని కతోలికులు ధృవీకరిస్తున్నారు. మార్టిన్ లూథర్ యొక్క వివరణను అనుసరించి, మరియమ్మ మరియు యోసేపు, యేసు జననం తర్వాత వివాహ సంబంధాలను కలిగి ఉన్నారని, తద్వారా మరియమ్మయొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క సిద్ధాంతాన్ని తిరస్కరించారని నమ్ముతారు.

## 2. పరిశుద్ధ గ్రంథ వివరణ (స్క్రిప్చరల్ ఇంటర్ప్రెటేషన్):

మరియమ్మయొక్క శాశ్వతమైన కన్యత్వంపై విశ్వాసాన్ని సమర్థించేందుకు కతోలికులు వివిధ బైబిల్ భాగాలను మరియు ప్రారంభ క్రైస్తవ వ్రాతలను ఆకర్షిస్తారు, అయితే లూథరనిజం ఈ భాగాలను భిన్నంగా అర్థం చేసుకుంటుంది, ఇది సిద్ధాంతాన్ని తిరస్కరించడానికి దారి తీస్తుంది.

### 3. సంప్రదాయం:

మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని ధృవీకరించడంలో ఆదిమ శ్రీసభ పితరుల బోధనలతో సహా పవిత్ర సంప్రదాయానికి కతోలికులు బలమైన ప్రాధాన్యతనిస్తారు. లూథరనిజం, సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, విశ్వాసం మరియు సిద్ధాంత విషయాలలో ప్రాథమిక అధికారంగా 'పరిశుద్ధ గ్రంథం మాత్రమే ఆధారం' (sola scriptura) ప్రాధాన్యతనిస్తుంది.

### 4. వేదాంతపరమైన ఉద్ఘాటన:

కతోలిక శ్రీసభ మరియ ఉన్నత స్థితికి చేర్చుతుంది, ఆమె పవిత్రత మరియు స్వచ్ఛతలో భాగంగా ఆమె దేవుని తల్లిగా మరియు ఆమె శాశ్వతమైన కన్యత్వాన్ని నొక్కి చెబుతుంది. లూథరనిజం, మరియ యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ, యేసుక్రీస్తుపై విశ్వాసం ద్వారా దయ ద్వారా మోక్షానికి సంబంధించిన కేంద్ర సిద్ధాంతాలపై ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. ఈ నిర్వచించే లక్షణాలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించి కతోలికులు మరియు లూథరనిజం మధ్య వేదాంతపరమైన వ్యత్యాసాలను వివరిస్తాయి. ఖచ్చితంగా, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించి మార్టిన్ లూథర్ యొక్క అభిప్రాయం మరియు కతోలిక మధ్య భేదం యొక్క కొన్ని మరింత సంబంధిత అంశాలు ఇక్కడ ఉన్నాయి:

### 5. మతపరమైన వేదాంతశాస్త్రం:

రక్షణ చరిత్రలో ఆమె సంకేత పాత్ర మరియు ఆమెతో ఉన్న ప్రత్యేక సంబంధం కారణంగా కతోలిక విశ్వాసం మరియను శాశ్వత కన్యగా చూస్తుంది. మతకర్మలు, ముఖ్యంగా దివ్యసత్ప్రసాదం (యూకారిస్ట్) మరియను కన్యకగా అభివర్ణిస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, లూథరనిజం, మతకర్మలను అంగీకరిస్తున్నప్పుడు, మతకర్మ వేదాంతశాస్త్రం సందర్భంలో మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై ఎక్కువ వేదాంత ప్రాముఖ్యతను ఇవ్వకపోవచ్చు.

### 6. మారియాలజీ:

కతోలిక విశ్వాసం మారియాలజీ యొక్క గొప్ప సంప్రదాయాన్ని అభివృద్ధి చేసింది, ఇందులో మోక్షంలో మరియ పాత్ర, ఆమె నిష్కళంకమైన గర్భం

మరియు స్వర్గానికి ఆమె ఆరోపణం గురించిన సిద్ధాంతాలు మరియు భక్తిభావాలు ఉన్నాయి. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం తరచుగా ఈ సిద్ధాంతాలతో ముడిపడి ఉంటుంది. లూథరనిజం సాధారణంగా మరియ యొక్క సరళమైన దృక్కోణాన్ని నిర్వహిస్తుంది, ఈ అదనపు మరియ విశ్వాస సిద్ధాంతాలపై ఎక్కువ ప్రాధాన్యత లేకుండా ఆమె మానవత్వం మరియు యేసుతో ఆమె సంబంధంపై ఎక్కువ దృష్టి పెడుతుంది.

## 7. శ్రీసభ యొక్క అధికారం:

కతోలిక విశ్వాసం, దాని క్రమానుగత నిర్మాణం మరియు ప్రబోధనా అధికారంతో, దాని సిద్ధాంత బోధనలో భాగంగా మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని ధృవీకరిస్తుంది. లూథరనిజం, ప్రొటెస్టంట్ రిఫార్మేషన్ కేవలము బైబులు యొక్క వ్యక్తిగత వివరణపై ఉద్ఘాటిస్తుంది, దాని అనుచరులలో మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై విస్తృతమైన వేదాంతపరమైన అభిప్రాయాలను అనుమతించవచ్చు. ఈ అదనపు అంశాలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించి మార్టిన్ లూథర్ మరియు కతోలికుల యొక్క వేదాంత దృక్కోణాలలో మరిన్ని సూక్ష్మ నైపుణ్యాలను తెలియజేస్తాయి.

ఇతర క్రైస్తవ వర్గాలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై విభిన్న దృక్కోణాలను కలిగి ఉండవచ్చు, వారి ప్రత్యేకమైన వేదాంత సంప్రదాయాలు మరియు పరిశుద్ధ గ్రంథ వివరణలను ప్రతిబింబిస్తాయి:

**1. తూర్పు ఆర్థోడాక్సీ:** కతోలిక విశ్వాసం వలె, తూర్పు ఆర్థోడాక్సీ సాధారణంగా మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని దాని మరియ వేదాంతశాస్త్రం యొక్క కేంద్ర సిద్ధాంతంగా ధృవీకరిస్తుంది. ఆర్థడాక్స్ చర్చి మరియను “నిత్య కన్యక” (ఎవర్వర్జిన్) గా గౌరవిస్తుంది మరియు ఆమె శాశ్వతమైన కన్యత్వాన్ని ఆమె పవిత్రత మరియు పవిత్రతకు ప్రాథమిక అంశంగా పరిగణిస్తుంది.

**2. ఆంగ్లికనిజం:** ఆంగ్లికనిజంలో, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై అభిప్రాయాలు మారవచ్చు. కొంతమంది ఆంగ్లికన్లు కాథలిక్ మరియు ఆర్థడాక్స్ విశ్వాసాలతో మరింత సన్నిహితంగా ఉండవచ్చు, మరియ యొక్క శాశ్వతమైన

కన్యత్వాన్ని సాంప్రదాయ సిద్ధాంతంగా ధృవీకరిస్తారు. మరికొందరు కాథలిక్ మరియు ప్రొటెస్టంట్ దృక్కోణాల ప్రభావంతో మరింత సూక్ష్మమైన లేదా విభిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చు.

**3. ప్రొటెస్టంటిజం:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై వివిధ ప్రొటెస్టంట్ తెగలు భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చు. లూథరనిజం వంటి కొందరు సిద్ధాంతాన్ని తిరస్కరించవచ్చు, మరికొందరు దానిని వివిధ స్థాయిలలో ధృవీకరించవచ్చు. కొన్ని ఉన్నతచర్చి ప్రొటెస్టంట్ సంప్రదాయాలు మరియ భక్తి యొక్క అంశాలను నిలుపుకోవచ్చు మరియు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని సమర్థించవచ్చు, అయితే ఎక్కువ సువార్త లేదా తక్కువచర్చి సంప్రదాయాలు ఈ సిద్ధాంతానికి తక్కువ ప్రాధాన్యతనిస్తాయి.

**4. నాన్డినామినేషనల్ మరియు ఇండిపెండెంట్ చర్చిలు:** నాన్డినామినేషనల్ మరియు స్వతంత్ర క్రైస్తవ చర్చిలలో, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం గురించిన విశ్వాసాలు సమాజం యొక్క వేదాంత ధోరణి మరియు స్క్రిప్చర్ యొక్క వివరణలపై ఆధారపడి విస్తృతంగా మారవచ్చు. కొందరు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై సాంప్రదాయిక బోధనలకు దగ్గరగా కట్టుబడి ఉండవచ్చు, మరికొందరు భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చు లేదా పూర్తిగా మరియన్ సిద్ధాంతాలపై తక్కువ ప్రాధాన్యతనిస్తారు. మొత్తంమీద, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై వివిధ క్రైస్తవ తెగల దృక్కోణాలు విస్తృత క్రైస్తవ సంప్రదాయంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి మరియు ప్రతి వర్గాన్ని వర్గీకరించే వివిధ వేదాంతపరమైన ఉద్ఘాటనలు మరియు వివరణలు కనిపిస్తాయి.

**5. ఆర్థడాక్స్ క్రిస్టియానిటీ:** క్యాథలిక్‌ల మాదిరిగానే, ఆర్థడాక్స్ క్రైస్తవం కూడా మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని కేంద్ర విశ్వాసంగా సమర్థిస్తుంది. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం ఆమె స్వచ్ఛత మరియు పవిత్రతకు చిహ్నంగా పరిగణించబడుతుంది మరియు ఇది తరచుగా ఆర్థడాక్స్ ఆరాధనలో ప్రార్థనా శ్లోకాలు, ప్రార్థనలు మరియు ఐకానోగ్రఫీ ద్వారా ధృవీకరించబడుతుంది.

**6. తూర్పు కాథలిక్ చర్చిలు:** ఈ చర్చిలు, కాథలిక్ చర్చితో సంబంధమును

కలిగి ఉన్నాయి కానీ వాటి స్వంత ప్రత్యేక ప్రార్థనా మరియు వేదాంత సంప్రదాయాలను కలిగి ఉన్నాయి, ఇవి మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని కూడా ధృవీకరిస్తాయి. వారు ఎవర్‌వర్జిన్ (Ever Virgin) మరియ పట్ల గౌరవంతో సహా తూర్పు ఆర్థోడాక్సీతో అనేక నమ్మకాలు మరియు అభ్యాసాలను పంచుకుంటారు.

**7. ఎవాంజెలికల్ ప్రొటెస్టంటిజం:** ఎవాంజెలికల్ ప్రొటెస్టంట్ తెగలు మరియ యొక్క శాశ్వత కన్యత్వంపై వారి అభిప్రాయాలలో మారుతూ ఉంటాయి. కొందరు సాంప్రదాయ క్రైస్తవ బోధనలో భాగంగా సిద్ధాంతాన్ని అంగీకరించవచ్చు, మరికొందరు దానిని గట్టిగా నొక్కిచెప్పకపోవచ్చు లేదా బైబిల్ భాగాలను భిన్నంగా అర్థం చేసుకోవచ్చు, క్రీస్తు యొక్క దైవత్వం మరియు విశ్వాసం ద్వారా దయ ద్వారా మోక్షం వంటి ప్రధాన సిద్ధాంతాలపై ఎక్కువ దృష్టి పెడతారు.

**8. పెంటెకోస్టలిజం:** పెంటెకోస్టల్ చర్చిలు తరచుగా ఆధ్యాత్మిక బహుమతులు, వ్యక్తిగత విశ్వాస అనుభవాలు మరియు స్క్రిప్చర్ యొక్క అధికారానికి ప్రాధాన్యత ఇస్తాయి. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై అభిప్రాయాలు పెంటెకోస్టల్ తెగలు మరియు సమ్మేళనాలలో మారవచ్చు, కొందరు సాంప్రదాయ బోధనలకు దగ్గరగా ఉంటారు, మరికొందరు ఈ సిద్ధాంతాన్ని ప్రముఖంగా నొక్కిచెప్పకపోవచ్చు.

**9. సాంప్రదాయేతర లేదా స్వతంత్ర క్రైస్తవ సమూహాలు:** సాంప్రదాయేతర లేదా స్వతంత్ర క్రైస్తవ సమూహాలలో, మరియ యొక్క శాశ్వత కన్యత్వం గురించిన విశ్వాసాలు సమూహం యొక్క వేదాంత దృక్పథాలు, గ్రంథాల వివరణలు మరియు సాంప్రదాయ క్రైస్తవ సిద్ధాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడంపై విస్తృతంగా విభిన్నంగా ఉండవచ్చు. ఈ అదనపు దృక్పథాలు వివిధ క్రైస్తవ తెగలు మరియు సమూహాలలో మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించిన నమ్మకాల వైవిధ్యాన్ని తెలుపుతున్నాయి. ప్రతి ఒక్కటి వారి స్వంత వేదాంత సంప్రదాయాలు మరియు గ్రంథాల వివరణల ద్వారా ప్రభావితమవుతాయి.

కాథలిక్ దృక్కోణంలో, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై నమ్మకం పవిత్ర గ్రంథం మరియు పవిత్ర సంప్రదాయం రెండింటిలోనూ ఆధారపడి ఉంటుంది, ఇవి దైవిక ద్యోతకం యొక్క పరిపూరకరమైన మూలాలుగా పరిగణించబడతాయి. ఒక కాథలిక్ ఈ నమ్మకాన్ని ఎలా వివరించవచ్చో ఇక్కడ ఉంది:

**1. బైబిల్ మద్దతు:** కతోలికులు మత్తయి 1:18–25 మరియు లూకా 1:26–38 వంటి బైబిల్ భాగాలను సూచిస్తారు, ఇవి పవిత్రాత్మ ద్వారా యేసు యొక్క అద్భుత భావనను వివరిస్తాయి మరియు మరియ యొక్క కన్యత్వాన్ని నొక్కి చెబుతాయి. యేసు జననానికి ముందు. యేసు యొక్క "సోదరులు" మరియు "సోదరీమణులు" గురించి బైబిల్ సూచనలు ఆ సమయంలోని సాంస్కృతిక మరియు భాషాపరమైన సందర్భంలో అర్థం చేసుకోవచ్చని కూడా వారు గమనించారు, ఈ పదాలు జీవసంబంధమైన తోబుట్టువుల కంటే విస్తరించిన బంధువులు లేదా సన్నిహిత సహచరులను సూచిస్తాయి.

**2. వేదాంత ప్రాముఖ్యత:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం రక్షణ చరిత్రలో ఆమె ప్రత్యేక పాత్రకు చిహ్నంగా పరిగణించబడుతుంది. యేసు పుట్టుకకు ముందు, సమయంలో మరియు తరువాత కన్యగా ఉండడం ద్వారా, మరియ దేవుని విమోచన ప్రణాళికకు తనను తాను పూర్తిగా అంకితం చేసుకున్నట్లు పరిగణించబడుతుంది. ఆమె శాశ్వతమైన కన్యత్వం కూడా యేసు గర్భం యొక్క అద్భుత స్వభావాన్ని నొక్కి చెబుతుంది మరియు అతని దైవిక మూలాన్ని నొక్కి చెబుతుంది.

**3. సంప్రదాయంతో కొనసాగింపు:** కతోలికులు యుగయుగాల విశ్వాసం యొక్క కొనసాగింపును విశ్వసిస్తారు మరియు క్రీస్తు మరియు అపొస్తలుల ద్వారా శ్రీసభకు అప్పగించబడిన విశ్వాసంనిధి (డిపాజిటరీ)లో భాగంగా మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క సిద్ధాంతాన్ని చూస్తారు. ఈ నమ్మకం శతాబ్దాలుగా శ్రీసభ యొక్క మెజిస్టీరియం (బోధనా అధికారం) ద్వారా స్థిరంగా సమర్థించబడింది మరియు కాథలిక్ చర్చి యొక్క కాటేచిజం వంటి అధికారిక కాథలిక్ బోధనలలో ధృవీకరించబడింది. మొత్తంమీద, కాథలిక్కులు మరియ

యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని వారి విశ్వాసం యొక్క ప్రతిష్టాత్మకమైన మరియు అంతర్భాగంగా చూస్తారు, ఇది స్క్రిప్చర్, సంప్రదాయం మరియు శ్రీసభ యొక్క అధికారిక బోధనలలో పాతుకుపోయింది. వారు దానిని మరియ యొక్క పవిత్రతకు, దేవుని రక్షణ ప్రణాళికలో ఆమె ప్రత్యేక పాత్రకు మరియు యేసుక్రీస్తు యొక్క దైవిక స్వభావానికి నిదర్శనంగా చూస్తారు. ఖచ్చితంగా, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై నమ్మకాన్ని వివరించడానికి కాథలిక్ అందించే కొన్ని అదనపు అంశాలు ఇక్కడ ఉన్నాయి:

**4. పాత నిబంధన ప్రవచన నెరవేర్పు:** కతోలికులు మరియను యెషయా 7:14తో సహా వివిధ పాత నిబంధన ప్రవచనాల నెరవేర్పుగా చూస్తారు. మెస్సీయ యొక్క కన్య జననం. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని కొనసాగించడం ఈ ప్రవచన నెరవేర్పును నొక్కి చెబుతుంది మరియు యేసు గర్భం యొక్క అద్భుత స్వభావాన్ని నొక్కి చెబుతుంది.

**5. పవిత్రత యొక్క ఉదాహరణ:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం కూడా పరిపూర్ణ పవిత్రత మరియు స్వచ్ఛత యొక్క నమూనాగా పరిగణించబడుతుంది. శాశ్వతంగా కన్యగా ఉండడం ద్వారా, మరియ తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకోవడం మరియు పవిత్రమైన జీవితాన్ని గడపడం అనే ఆదర్శాన్ని ఉదాహరణగా చూపుతుంది. ఆమె జీవితంలోని ఈ అంశం క్రీస్తును మరింత సన్నిహితంగా అనుసరించడానికి ప్రయత్నిస్తున్న కాథలిక్కులకు ప్రేరణగా ఉపయోగపడుతుంది.

**6. మరియపై భక్తిప్రపత్తులు:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై నమ్మకం కతోలికులలో మరియను గౌరవించి భక్తితో కొనియాడడంతో ముడిపడి ఉంది. మరియను దేవుని యొక్క ఎప్పటికీ కన్యక తల్లిగా గౌరవించడం రక్షణ చరిత్రలో ఆమె ప్రత్యేక పాత్ర మరియు యేసుక్రీస్తుతో ఆమెకున్న సన్నిహిత సంబంధానికి కతోలికుల గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం దేవునికి ఆమె ఏకైక సాన్నిహిత్యం మరియు అతని దైవిక ప్రణాళికతో ఆమె పూర్తి సహకారానికి చిహ్నంగా పరిగణించబడుతుంది.

**7. సిద్ధాంతం యొక్క ఐక్యత:** కతోలికులు శ్రీసభ సిద్ధాంతంలో ఐక్యత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై విశ్వాసం ఎక్యుమెనికల్ కౌన్సిల్స్ ద్వారా ధృవీకరించబడింది మరియు వివిధ శ్రీసభ పత్రాలలో వ్యక్తీకరించబడింది, కాథలిక్ విశ్వాసం యొక్క ప్రధాన సిద్ధాంతంగా దాని ప్రాముఖ్యతను ప్రదర్శిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని సమర్థించడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాథలిక్కుల మధ్య సిద్ధాంతపరమైన ఐక్యతను కొనసాగించడంలో సహాయపడుతుంది.

**8. రహస్యం మరియు గౌరవం:** చివరగా, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంతో సహా విశ్వాసం యొక్క కొన్ని అంశాలు మానవ అవగాహనను మించిన రహస్యాలు అని కతోలికులు అంగీకరిస్తారు. మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం మానవ హేతువుకు పూర్తిగా అర్థం కానప్పటికీ, వారు ఈ సిద్ధాంతాన్ని భక్తితో మరియు వినయంతో సంప్రదించారు, శ్రీసభ యొక్క బోధనా అధికారం యొక్క జ్ఞానం మరియు మార్గదర్శకత్వాన్ని విశ్వసిస్తారు. ఈ అదనపు అంశాలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క కతోలిక అవగాహనను వారి విశ్వాసం యొక్క కేంద్ర మరియు లోతుగా ప్రతిష్టాత్మకమైన అంశంగా వివరిస్తాయి, ఇది స్క్రిప్చర్, సంప్రదాయం మరియు శ్రీసభ బోధనలపై ఆధారపడి ఉంటుంది.

ఖచ్చితంగా, ఇతర క్రైస్తవ తెగలచే నిర్వహించబడే మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వంపై కొన్ని విరుద్ధమైన అభిప్రాయాలు ఇక్కడ ఉన్నాయి:

**1. స్క్రిప్చరల్ ఇంటర్‌ప్రెటేషన్:** కొన్ని ప్రొటెస్టంట్ తెగలు మత్తయి 1:25 వంటి భాగాలను అన్వయించాయి, ఇది యోసేపు మరియకు జన్మనిచ్చే వరకు "తెలియని" గురించి మాట్లాడుతుంది. యేసు, మరియ మరియు యోసేపు, యేసు జననం తర్వాత సాధారణ వైవాహిక సంబంధాలు కలిగి ఉంటారని సూచిస్తున్నారు. మరియకు ఇతర పిల్లలు ఉన్నారని రుజువుగా వారు సువార్తలలోని యేసు "సహోదరులు" మరియు "సహోదరీల" సూచనలను కూడా సూచించవచ్చు.

**2. చారిత్రక సందర్భం:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క

సిద్ధాంతం యొక్క విమర్శకులు అది కతోలిక సంప్రదాయంలో కాలక్రమేణా అభివృద్ధి చెందిందని మరియు ఆరంభ క్రీసభలో విశ్వవ్యాప్తంగా ఆమోదించబడలేదని వాదించారు. బైబిల్ మరియు చారిత్రక ఆధారాలను జాగ్రత్తగా పరిశీలించడం కంటే మరియ యొక్క స్వచ్ఛత మరియు ప్రత్యేక హోదాను నొక్కి చెప్పాలనే కోరిక నుండి ఈ నమ్మకం ఉద్భవించిందని వారు సూచించవచ్చు.

**3. రక్షణపై దృష్టి కేంద్రీకరించండి:** కొన్ని ప్రొటెస్టంట్ తెగలు క్రీస్తు యొక్క దైవత్వం, ప్రాయశ్చిత్తం మరియు విశ్వాసం ద్వారా సమర్థించడం వంటి మోక్షానికి నేరుగా సంబంధించినవిగా భావించే బోధనలకు ప్రాధాన్యత ఇస్తాయి. వారు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం గురించి చర్చలు ఈ కేంద్ర సిద్ధాంతాలకు పరిధీయమైనవిగా చూడవచ్చు మరియు అందువల్ల ఈ నమ్మకంపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకపోవచ్చు.

**4. మరియ శాస్త్రమును తిరస్కరించడం:** కొన్ని ప్రొటెస్టంట్ తెగలు మరియను ఆరాధించడం మరియు శాశ్వతమైన కన్యత్వంతో సహా ఆమె చుట్టూ ఉన్న విస్తృతమైన సిద్ధాంతాల అభివృద్ధిని తిరస్కరించాయి. వారు అలాంటి బోధలను అనవసరంగా లేదా క్రీస్తు యొక్క ఏకైక మధ్యవర్తిత్వం మరియు లేఖనాల సమృద్ధిపై నొక్కిచెప్పడానికి విరుద్ధంగా చూడవచ్చు.

**5. హిస్టారికల్ క్రిటికల్ స్కాలర్‌షిప్‌పై ఉద్ఘాటన:** కొంతమంది పండితులు మరియు వేదాంతవేత్తలు, మతంతో సంబంధం లేకుండా, బైబిల్ గ్రంథాలను చారిత్రక విమర్శన దృక్కోణం నుండి సంప్రదించారు, ఇది బైబిల్ రచనల యొక్క సాంస్కృతిక మరియు సాహిత్య సందర్భాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ దృక్కోణం నుండి, వారు మొదటి శతాబ్దపు యూదుల ఆచారాలు మరియు భాషా వినియోగం యొక్క వెలుగులో మరియ యొక్క కన్యత్వానికి సంబంధించిన భాగాలను అన్వయించవచ్చు, ఇది ఆమె శాశ్వతమైన కన్యత్వం గురించి భిన్నమైన నిర్ధారణలకు దారి తీస్తుంది. ఈ విరుద్ధమైన అభిప్రాయాలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వానికి సంబంధించి క్రైస్తవ మతంలోని దృక్కోణాల వైవిధ్యాన్ని చూపుతాయి. వేర్వేరు తెగలు మరియు

వేదాంత సంప్రదాయాలు ఈ సిద్ధాంతాన్ని వివిధ కోణాల నుండి సంప్రదించవచ్చు, వారి గ్రంథం, చారిత్రక సందర్భం, వేదాంతపరమైన ఉద్ఘాటనలు మరియు మతపరమైన సంప్రదాయాల ద్వారా ప్రభావితమవుతాయి. ఖచ్చితంగా, మరియ యొక్క శాశ్వత కన్యత్వంపై భిన్నమైన అభిప్రాయాలను మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఇక్కడ కొన్ని అదనపు అంశాలు ఉన్నాయి.

**6. హిస్టారికక్రిటికల్ అప్రోచ్:** కొంతమంది పండితులు మరియు వేదాంతవేత్తలు, ముఖ్యంగా ప్రొటెస్టంట్ తెగల వారు, మరియ కన్యత్వం గురించి బైబిల్ వృత్తాంతాలను సంప్రదించారు. ఒక చారిత్రక క్లిష్టమైన దృక్పథం. ఈ విధానం బైబిల్ గ్రంథాలను వాటి చారిత్రక మరియు సాంస్కృతిక సందర్భంలో విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది, తరచుగా భాషా, పురావస్తు మరియు వచన ఆధారాలపై ఆధారపడి ఉంటుంది. కొంతమంది విద్వాంసులు బైబిల్ గ్రంథాల యొక్క వారి వివరణ ఆధారంగా మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క చారిత్రక ఆమోద యోగ్యత కోసం వాదించవచ్చు, మరికొందరు సాక్ష్యం ఈ సిద్ధాంతానికి ఖచ్చితంగా మద్దతు ఇవ్వలేదని నిర్ధారించవచ్చు.

**7. సంప్రదాయం యొక్క పాత్ర:** ప్రొటెస్టంట్ తెగలు సాధారణంగా కతోలికులు మరియు తూర్పు ఆర్థోడాక్సీతో పోలిస్తే పవిత్ర సంప్రదాయానికి తక్కువ ప్రాధాన్యతనిస్తాయి. కతోలికులు మరియ యొక్క శాశ్వత కన్యత్వాన్ని శ్రీసభ ద్వారా అందజేసే పవిత్ర సంప్రదాయంలో భాగంగా చూస్తారు, ప్రొటెస్టంట్ సంప్రదాయాలు సంప్రదాయం కంటే గ్రంథం యొక్క అధికారానికి ప్రాధాన్యత ఇస్తాయి. పర్యవసానంగా, కొన్ని ప్రొటెస్టంట్ తెగలు మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం వంటి సిద్ధాంతాలను ప్రశ్నించడానికి లేదా తిరస్కరించడానికి ఎక్కువ మొగ్గు చూపుతాయి, ఇవి ప్రాథమికంగా స్పష్టమైన బైబిల్ బోధనల కంటే సంప్రదాయంపై ఆధారపడి ఉంటాయి.

**8. ఎక్యుమెనికల్ డైలాగ్:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం గురించిన విశ్వాసాలలో ఉన్న వ్యత్యాసాలు క్రైస్తవ తెగల మధ్య చర్చ మరియు సంభాషణల అంశంగా ఉన్నాయి. ఎక్యుమెనికల్ ప్రయత్నాలు మరియ మరియు ఇతర

వేదాంత విషయాలపై కతోలికులు, ఆర్థోడాక్స్ మరియు ప్రొటెస్టంట్ల మధ్య అవగాహన మరియు సయోధ్యను పెంపొందించడానికి ప్రయత్నిస్తాయి. ముఖ్యమైన సైద్ధాంతిక వ్యత్యాసాలు మిగిలి ఉన్నప్పటికీ, క్రైస్తవుల మధ్య పరస్పర గౌరవం మరియు సహకారాన్ని ఉమ్మడి మైదానాన్ని కనుగొనడం మరియు వివిధ సంప్రదాయాలకు చెందిన క్రైస్తవుల మధ్య పరస్పర గౌరవం మరియు సహకారాన్ని ప్రోత్సహించడం ఎక్యుమెనికల్ సంభాషణ లక్ష్యం.

**9. సాంస్కృతిక మరియు భౌగోళిక ప్రభావాలు:** మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం గురించిన నమ్మకాలు సాంస్కృతిక మరియు భౌగోళిక కారకాలచే కూడా ప్రభావితమవుతాయి. ఉదాహరణకు, బలమైన కాథలిక్ లేదా ఆర్థోడాక్స్ ప్రభావాలు ఉన్న ప్రాంతాలలో ప్రొటెస్టంట్ తెగలు మరియ శాస్త్ర సిద్ధాంతాలతో బాగా సుపరిచితులు మరియు బహిరంగంగా ఉండవచ్చు, అయితే ప్రధానంగా ప్రొటెస్టంట్ ప్రాంతాలలో ఉన్నవారు వాటిని అంగీకరించడానికి తక్కువ మొగ్గు చూపుతారు. అదేవిధంగా, లైంగికత, లింగ పాత్రలు మరియు కుటుంబ గతిశీలత పట్ల సాంస్కృతిక వైఖరులు వివిధ క్రైస్తవ సమాజాలలో మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం యొక్క వివరణలను రూపొందించవచ్చు.

**10. వ్యక్తిగత వివరణ:** అంతిమంగా, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వం గురించిన నమ్మకాలు, మతపరమైన అనుబంధంతో సంబంధం లేకుండా, వ్యక్తిగత క్రైస్తవులలో విస్తృతంగా మారవచ్చు. మతపరమైన బోధనలు మరియు సంప్రదాయాలు వేదాంత దృక్కోణాలను రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుండగా, వ్యక్తిగత విశ్వాసులు ప్రార్థన, అధ్యయనం మరియు ఈ సిద్ధాంతం చుట్టూ ఉన్న బైబిల్ గ్రంథాలు మరియు వేదాంత వాదనలపై వ్యక్తిగత ప్రతిబింబం ద్వారా వారి స్వంత నిర్ధారణలకు రావచ్చు. అలాగే, మరియ యొక్క శాశ్వతమైన కన్యత్వాన్ని అంగీకరించడం లేదా తిరస్కరించడం గురించి తెగలలో కూడా వైవిధ్యం ఉంది.

❋ ❋ ❋ ❋

# 3. మూడవ మరియ విశ్వాస సిద్ధాంతం : మరియ - నిష్కళంక ఉద్భవం (శ్రీసభ విశ్వాస ప్రబోధనం)

బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్



**ఉపోద్ఘాతం:**

ఉద్భవం అనునది అసాధారణము. సాధారణంగా జరిగే సంఘటనలకు, కార్యాలకు భిన్నంగా జరుగు లేక ఆవిర్భవించు ప్రక్రియను ఉద్భవం అంటారు. మరో మాటలో చెప్పాలంటే ఉద్భవం అనగా నూతనత్వానికి నాంది పలకడం. అయితే శ్రీసభ మరియమాతను నిష్కళంకోద్భవిగా సంబోధిస్తుంది. అలా సంబోధించడానికి ఆమె యందు ఏమి కొత్తదనము లేక నూతనత్వం ఉంది అని మన మదిలో మెదిలే ప్రశ్నలు సహజం. దానికి సమాధానం తెలుసుకోవాలి. ఆదిమ తల్లిదండ్రులు ఆదాము ఏవలు దేవుని ఆజ్ఞను ధిక్కరించి వారి అవిధేయత వల్ల పాపమునకు పునాదులు వేశారు. వారి పాపం వల్ల దేవుని అనుగ్రహములను కోల్పోయారు. వారి పాపము, పాపానికి శిక్ష వారికి మాత్రమే పరిమితం కాలేదు. తద్వారా అప్పటినుండి జన్మించబోవుచున్న ప్రతి శిశువుకి సంక్రమించింది. ప్రతి శిశువు తల్లి గర్భంలోనే ఆది తల్లిదండ్రుల పాపంలో భాగస్వామి అవుతుంది. అనగా ఇహ లోకంలో పుట్టబోయే ప్రతి శిశువు దైవ కృప లేక సాతాను సంకెళ్ళతో పుడుతుంది. కాని, మరియమాత నీవలె నావలై ఆది తల్లిదండ్రుల పాపములో భాగస్వామ్యం కాకుండా కాపాడబడింది. జన్మ పాప దోషరహిత స్త్రీగా తన తల్లి అన్నా గర్భమున నిష్కళంకిగా ఉద్భవించింది. సాతాను సంకెళ్ళతో కాక సంపూర్ణ దైవానుగ్రహంతో జన్మించింది. ఒక ఉద్భవం ఒక సంఘటన

యొక్క నూతనత్వాన్ని సూచిస్తే మరియమాత నిష్కళంకోద్భవం కళంకం లేని ఒక నూతన సృష్టిని సూచిస్తుంది.

మరియమాత తండ్రి దేవుని తలంపులలో నూతన ఎవగా పరమందు ఉద్భవించింది.

అన్నా జాకీము దంపతులకు నిష్కళంకిగా ఇలా ఉద్భవించింది.

స్త్రీలందరిలోను సకల వరాల ప్రదాతగా ఉద్భవించింది.

దైవ చిత్తానికి విధేయించే ప్రభుదాసురాలిగా ఉద్భవించింది.

జన్మింపబోవు దైవ కుమారునికి ప్రియ జననిగా ఉద్భవించింది.

కుమారుని ఆజ్ఞానుసారము సకల మానవాళికి తల్లిగా ఉద్భవించింది.

సృష్టిలో కనివిని ఎరుగని రీతిలో మరియమాత ఉద్భవాన్ని తండ్రి అయిన దేవుడు సిద్ధపరిచాడు. మరియమాత ఎన్నిక తాను తన మాతృ గర్భాన రూపొందింపక మునిపే, ఆదాము ఏవలు పాపము చేసిన తక్షణమే జరిగింది. ఒక ప్రణాళిక బద్ధంగా లోక రక్షణార్తమై ఆమె జీవితం నిర్ణయించబడింది. ఆమె ఎన్నుకోబడటమే కాదు పవిత్రపరపబడింది. పవిత్రపరచబడినటువంటి ఆ పాపను, అనగా మరియమాతను దేవుడు ముదునలి అయిన జ్వాకీము భార్య అన్నా గర్భాన నిష్కళంకిగా ఉద్భవించింది. ఎందుకంటే దేవుడు ఆ తల్లి యొక్క నిష్కళంక గర్భము ద్వారా పరమ పవిత్రుడైన తన దివ్య కుమారుడు క్రీస్తును ఈ లోకంలోనికి మానవ మాతృనిగా పంపుటకు నిశ్చయించాడు. ఇది తండ్రి దేవుని అభీష్టం. అయినప్పటికీ మరియ తల్లి అంగీకారము ఎంతో అవసరము. ఎందుకంటే దేవుడు ప్రతి ఒక్కరిని స్వేచ్ఛాపరునిగా సృష్టించాడు. దేవుని చిత్తానికి అంగీకరించడం, దానికి అనుగుణంగా మన జీవితాలను మలచుకుని జీవించడం మన స్వేచ్ఛ. దాని ఫలితము దేవుని యొక్క వరము. దేవుని చిత్తాన్ని అంగీకరించకపోవడం కూడా మన స్వేచ్ఛనే, అదియే పాపము. దాని ఫలితం మరణము లేక నరలోక శిక్ష. మరియమాత తన స్వేచ్ఛను ఉపయోగించుకొని దేవుని చిత్తానికి, ఇదిగో ప్రభువు దాసురాలను, ఆయన చిత్తము నాయందు నెరవేరును గాక అని విధేయుంచి (లూకా 1:38), తద్వారా

తన నిష్కళంక గర్భంలో దైవ కుమారుని నవమాసాలు మోసి జన్మనిచ్చి లోక రక్షణార్థమై పునాదులు వేసింది ఆ నిష్కలంక మాత.

**చారిత్రాత్మక నేపథ్యం:**

ఆదిమ క్రైస్తవ కాలం నాటి నుండి కూడా ప్రజలు మరియమాతను పవిత్రమూర్తిగా, దేవుని సంపూర్ణ అనుగ్రహం పొందుకున్న స్త్రీగా గుర్తించారు అంతేకాక ఆమె జననంను నిష్కళంకంగా భావించారు. ఆమే నిష్కళంక ఉద్భవం గురించి పవిత్ర గ్రంథం నందు ప్రత్యక్ష ఆధారాలు లేనప్పటికీ శ్రీసభ అపోక్రిఫల్ గ్రంథాలలో పునీత యాకోబు గారు రాసిన సువార్త యందు మరియమాత అన్న జ్వాకీములకు మృదుప్రాయంలో జన్మించింది అని వ్రాయబడింది. మృదుప్రాయము అనగా సంతానోత్పత్తికి శరీరము సహకరించని ప్రాయము. అనగా మరియమాత అన్నా జ్వాకీము దంపతులకు శారీరక సంబంధం లేకుండా దైవ ప్రణాళిక బద్ధంగా నిష్కలంకంగా ఉద్భవించి, ఇల యందు జన్మించింది.

ఈ విషయం ఆదిమ క్రైస్తవ కాలం నాటి నుండి ప్రజలు విశ్వసిస్తున్న వేదమైనప్పటికీ అధికార పూర్వకంగా ఈ విషయమును విశ్వాస వేద సత్యంగా ప్రకటించడానికి మొదట శ్రీసభ సంకోచించింది. ఈ వేదాంతాన్ని విశ్వాస వేద సత్యంగా ప్రకటించుటకు ఎందుకు శ్రీసభ ఇంత ఆలస్యం చేసింది అనే ప్రశ్న అందరి మదిలో మెదలడం సహజం. ఈ ప్రశ్నకు సమాధానాన్ని సంగ్రహించే ముందుగా మనము శ్రీసభ ఔన్నత్యాన్ని అర్థం చేసుకోవాలి. ఒక విషయాన్ని విశ్వాస వేద సత్యంగా అధికార పూర్వకంగా ప్రకటించుటకు చారిత్రక, శాస్త్రీయ ఆధారాలు సేకరించుటకు శ్రీ సభ చేసే కృషిని అర్థం చేసుకోవాలి. ఆలస్యం అయినా సత్యాన్ని మాత్రమే ప్రకటించే శ్రీసభ తత్వాన్ని అర్థం చేసుకోవాలి. సత్య స్వరూపుడైన క్రీస్తును అనుసరిస్తూ సత్యాన్వేషిగా శ్రీసభ ఆత్మతో నడిపింపబడుతూ ఉంది. మనల్ని సత్యంలో నడిపిస్తూ ఉంది.

18 శతాబ్దాలుగా ఈ వేదాంతం యందు చర్చనీయాంశాలు జరిపి సరియైన ఆధారలతో 1854వ సంవత్సరంలో మరియమాత నిష్కళంక మాత అని శ్రీసభ అధికార ప్రకటన చేసింది. శ్రీసభ ప్రకటనను సత్యముగా నిర్ధారిస్తూ 1858వ

సంవత్సరంలో లూర్థు నగరంలో మరియమాత ప్రత్యక్షమై తనను తాను నిష్కళంక ఉద్భవిగా దర్శనము ద్వారా సకల మానవాళికి తనను తనుగా తన పవిత్రమైన మరియు నిష్కళంకమైన స్వభావాన్ని పరిచయము చేసుకుంది. 1858వ సంవత్సరము ఫిబ్రవరి 11 నుండి జూలై 16 మధ్యకాల పరిధిలో మరియమాత బెర్నేదేతుకు (St. Bernadette) 18సార్లు దర్శనమిచ్చారు. దర్శనమిచ్చినప్పుడు మరియమాత బెర్నేదేతుతొ అక్కడి లూర్థు నగర మాండడలిక భాషలో సంభాషించేది. అలా తన చివరి దర్శనమందు లూర్థు నగరం మండల యొక్క భాష ఇన occatian (similar to French) లొ Que soy immaculate concepciou అని తనను తాను బెర్నేదేత్ ద్వారా ప్రజలందరికీ ప్రత్యక్ష పరచుకుంది. దీన్ని ఆంగ్లంలో ఇమ్మాకులేట్ కన్సెప్షన్ (immaculate conception) అని, తెలుగులో నిష్కళంక ఉద్భవం అని అంటారు. ఈ విధంగా శ్రీసభ విశ్వాస వేద సత్యాన్ని మరియమాత నిష్కళంక ఉద్భవమును దృఢపరుస్తూ దర్శనమిచ్చారు. ప్రజలందరిలో విశ్వాసాన్ని పెంపొందించారు.

## పరిశుద్ధ గ్రంథ నిర్మాణము:

మరియమాత నిష్కళంకిగా ఉద్భవించింది అని అనుటకు పవిత్ర గ్రంథం నందు ప్రత్యక్ష ఆధారాలు లేనప్పటికీ, పవిత్ర గ్రంథంలోని కొన్ని సంఘటనలు పరిశీలించి చూస్తే ఆమె నిష్కళంకత్వం గురించి చెప్పబడ్డాయి అనే సత్యాన్ని మనం గ్రహించవచ్చు. అయితే మరియమాత నిష్కళంకముగా ఉద్భవించింది, అను వేద సత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా తాను ఆ విధంగా ఉద్భవింప చేయడానికి కారణాలు కూడా తెలుసుకోవాలి. అదియే, నిష్కళంకుడు పరమపవిత్రుడైన దైవ కుమారుడిని సర్వలోక రక్షణార్థమై ఇహమందుకు తన గర్భం ద్వారా తీసుకురావడం. అయితే అంతటి పవిత్రుడు నిష్కళంకుడు అయిన తన కుమారుడ్ని తండ్రియైన దేవుడు ఒక పాపపు శరీరము ద్వారా ఇహ మందుకు ప్రవేశింపనిస్తాడా? పాపం మాలిన్యపు గర్భం ముందు తన కుమారుడుని నవమాసాలు ఉండనిస్తాడా? ముమ్మాటికి కాదు. ఖచ్చితంగా ఆ స్త్రీని పవిత్ర పరుస్తాడు. నిష్కళంకిగా ఉద్భవింప చేస్తాడు. ఎందుకంటే పాపము పవిత్రత రెండు కూడా ఒకే స్థానంలో ఉండజాలవు. పవిత్ర గ్రంథంలో కొన్ని

సంఘటనను పరిశీలించి చూస్తే దేవుడు ఏ విధంగా పవిత్రమైన వాటిని పాపమాలిన్యం అంటకుండా కాపాడుతాడు అనే సత్యాన్ని మనం గ్రహించవచ్చును. అందులో కొన్నింటిని మనం ఇక్కడ పరిశీలిద్దాం.

### ఏదోను తోటలోని పవిత్రమైన జీవవృక్షం (ఆది 2:9):

ఆదిమ తల్లిదండ్రులు ఆదాము ఏవలు దేవునికి అవిధేయత చూపి పాపము చేశారు. కావుననే దేవుడు వారిని ఏదోను తోట నుండి వెలివేశారు అని మనందరికీ తెలుసు. అయితే ఈ సంఘటనను మరొక కోణంలో అర్ధం చేసుకుంటే పాపం చేసిన ఆదిమ తల్లిదండ్రులను ఏదోనువనం నుండి వెలివేయడానికి కారణము అక్కడ పవిత్రమైన జీవవృక్షం ఉంది అని మనకి అర్ధం అవుతుంది (ఆది 2:9). వారి పాపము జీవవృక్షమునకు సోకకుండునట్లుగాను, పాపం జీవవృక్షం దరిదాపులకు కూడా చేరకుండునట్లు, జీవవృక్ష పవిత్రతను స్థిరపరిచి దేవుడు ఆదిమ తల్లిదండ్రులను ఏదోను వనం నుండి బయటకు పంపి వేశారు. మరలా వారు అక్కడికి తిరిగి రాకుండా ఉండుటకు గాను, దేవుడు ఏదోను వనము చుట్టూ కేరుబులు దేవదూతలను కాపలాగా ఉంచి, వారి హస్తముల యందు నిప్పులు చిమ్ము కత్తిని ఉంచెను. జీవమిచ్చుదు చెట్టు దరిదాపులకు ఎవరిని రానీయకుండానే దేవుడు ఇట్లు చేసెను (ఆది 3:24).

నూతన నిబంధన యందు మనం చూసినట్లయితే ఆ పవిత్రమైన జీవ వృక్షము మరెవరో కాదు సాక్షాత్తు క్రీస్తు ప్రభువే. లోకరక్షణార్థమై కాలం సంపూర్ణమైనప్పుడు ఆ జీవ వృక్షమే జీవమొసగువానిగా, దైవ కుమారునిగా ఇహమందు మరియు గర్భాన జన్మించాడు. పాపపు శరీరము జీవ వృక్షం దరిదాపులు చేరుటకు కూడా అనుమతించని ప్రభువు తన నిష్కళంకం మరియు పవిత్రమైన కుమారుడిని పాపపు శరీరము ద్వారా ఇహ మందునకు తీసుకువస్తాడా? ముమ్మాటికి కాదు. తండ్రి అయిన దేవుడు తన దివ్య కుమారుడిని ఇహమందు తీసుకొని రావడానికి అనేక మార్గంలో ఉన్నవి. ఎందుకంటే ఆయనకు అంతయు సాధ్యమే (లుకా 1:37). అయినప్పటికీ ఒక స్త్రీ ద్వారానే తీసుకొని రావడంలో ఒక నిగూఢ అర్థం దాగి ఉంది అని మనము

గ్రహించాలి. ఏవ మార్గ తత్వానికి భిన్నంగా తండ్రికి విధేయించే ప్రియ పుత్రికగా, కుమారునికి పవిత్ర తల్లిగా, ఆత్మకు ప్రేయసిగా తన దివ్య కుమారుని యందు కలుగు నూతన సృష్టికి నూతన ఏవగా ఉండుటకు తండ్రి మదిలో మెదిలిన తలంపు ఆవిర్భావానికి అంకురార్పణయే ఈ మరియ మాత నిష్కళంక ఉద్భవం అని గ్రహించాలి. విశ్వసించి జీవించాలి.

**మందసం దేవుని పవిత్ర సింహాసనం:**

ఇశ్రాయేలు ప్రజలు దైవ మందసం యెడల మిక్కిలి భక్తి ప్రభావాలు కలిగి జీవించారు. అందులో అమర్చిన అహరోను కఱ్ఱ, మన్న మరియు పది ఆజ్ఞల పలకలు వారి జీవితాలలో ప్రముఖ పాత్రను పోషించాయి. అహరోను కఱ్ఱ ఎఱ్ఱ సముద్రములు చీల్చి ఐగుప్తు బానిసత్వం నుండి వారసత్వ భూమికి నడిచిన తీరును సూచిస్తుంది.

మన్న ఎడారిలో ఇశ్రాయేలును పోషించుట వెనుక దాగి ఉన్న తండ్రి యొక్క ప్రేమను సూచిస్తుంది.

పది ఆజ్ఞల పలకలు దేవుడు ఇశ్రాయేలీయులతో చేసుకున్న నిబంధనకు సూచికగా ఉంటుంది.

ఇవన్నీ ఇశ్రాయేలు జీవితంలో ప్రముఖ పాత్ర పోషించినవి అని సూచించుటయే కాదు, తండ్రి అయిన దేవుడు తన ప్రజల కోసము ఏమైనా చేస్తాడు అని సత్యాన్ని వెల్లడి చేస్తున్నాయి. అందుచేతనే దైవ మందసము దేవుని యొక్క పవిత్ర ఉనికిగాను శక్తివంతమైన దానిగాను మహిమోపేతమైన దానిగాను పరిగణించి ఆరాధించేవారు.

తమ చెంతనున్న మందసం మూలమున యావే ఒబెదేదోము కుటుంబంను అతని ఆస్తిపాస్తులను వృద్ధి చేసెను (2 సమూ: 6:12)

తమ చెంత నున్న మందసం మూలముననే ఇశ్రాయేలు ప్రజలు యొర్దాను నది రెండు పాయలు గా విడిపోయి ప్రజలను పొడి నేలపై నడిపించి ఆవలి తీరంకు చేర్చింది (యెహోషువ 3:14-17).

## యెరికో గోడలు బ్రద్దలు కావింపబడ్డాయి (యెహోషువ 6:1-27):

దేవుని పవిత్రమైన ఉనికి మందసం యందు ఉంది. కావుననే ఇటువంటి మహత్తర కార్యాలు చోటు చేసుకున్నాయి. గుడారమందు అతి పవిత్ర స్థలము యందు ఏర్పరచిన మందసము దగ్గరకు ప్రధాన యాజకుడు సంవత్సరానికి కేవలం ఒక్కసారి మాత్రమే వెళ్లి బలి అర్పించి ధూపారాధన చేసి వస్తాడు (హెబ్రి 9:7). అంత పవిత్రంగా ప్రజలు పరిగణించేవారు ఈ యొక్క మందసమును. అటువంటి పవిత్రమైన మందసమును శరీర శుద్ధి, ఆత్మశుద్ధి లేని ప్రజలు యాజకులు కానీవారు తాకుట ప్రభువునకు కోపం తెప్పించుట వంటిది. అలా చేసిన వారిని ప్రభువు వెంటనే శిక్షిస్తాడు. ఉదాహరణకి దావీదు మందసమును క్రొత్త బండిలో ఉంచి నాట్యంతో మృదంగంలతో బాలాకు నుండి యేరుషలేమునకు తీసుకొని వెళుతున్నప్పుడు ఆ రహదారి మధ్యలో ఉన్న గతుకుల తాకిడికి మందసము పడిపోయెను. అప్పుడు బండి తోలుచున్న ఉస్సా మందసమును చేయి చాచి పట్టుకొనేను. అప్పుడు వెంటనే దేవుడు ఉగ్రుడై అతన్ని అక్కడికి అక్కడే మరణింప చేసెను (2 సమూ 6:7). దీనిని బట్టి మనం దేవుని యొక్క ఉనికిని కలిగి ఉన్న మందసం అతి పవిత్రమైనదనియు, పాపం దాని యందు చేరుటకు ప్రభువునకు ఇష్టం లేదు అనియు మరియు అలా సమీపించిన వారిని దేవుడు శిక్షిస్తాడనియు ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతుంది.

నూతన నిబంధనపు దైవమందసం సాక్షాత్తు క్రీస్తు ప్రభువే. ఈయన పరమ పవిత్రుడైన దేవుని కుమారుడు మరియు పావన పవిత్రుడు. అంతటి పావన పవిత్రుడు అయినటువంటి తన కుమారుని దేవుడు పాపపు శరీరము ద్వారా ఇహమందు ప్రవేశింపనిస్తాడా? పాత నిబంధన యందు దైవ మందసమును పాపమాలిన్యము నుండి భద్రపరిచిన దేవుడు తన దివ్య కుమారుడిని పాపను మాలిన్యం నుండి భద్రపరచడా? దేవుని మందసమైన క్రీస్తు పాపము కలిగిన స్త్రీ గర్భాన నవమాసాలు ఉంటాడా? అను ప్రశ్నలకు సమాధానము దైవ కుమారుని తన గర్భమందు మోసిన మరియ తల్లి యందు ఎటువంటి పాపము లేదు. దైవ ప్రణాళిక ద్వారా దైవ కుమారుడు లోక రక్షకుడిగా

తన ఇహ లోక ఆగమనకై ఆ తల్లి నిష్కళంకిగా ఉద్భవించబడింది. తండ్రి దేవునిచే పవిత్రం చేయబడింది. అందుచేతనే తండ్రి అయిన దేవుడు తన కుమారుడిని ఆ పవిత్ర కన్యక ద్వారా ఇహమందుకు తీసుకొని వచ్చాడు.

**మరియమాతను నిష్కళంకగిగా నిర్ధారించు పవిత్ర గ్రంథ ఆధారాలు:**

ముందుగా చెప్పబడిన విధంగా పవిత్ర గ్రంథం నందు మరియు మాతను నిష్కళంకోద్భవిగా నిర్ధారించు ప్రత్యక్ష ఆధారాలు లేవు. అయినప్పటికీ కొన్ని సంఘటనలను చవిచూస్తే ఆమె గురించే చెప్పబడినట్లుగా ఉంటుంది. అందులో కొన్నిటిని మనం ఇక్కడ పరిశీలిద్దాం

**1. నీకును, స్త్రీకిని, నీ సంతతికిని, స్త్రీ సంతతికిని తీరని వైరము కలుగుతుంది (ఆది 3:15).**

ముందుగా ఒక్కొక్కటిగా ఈ పదాల అంతరార్థాలను తెలుసుకుందాము.

- నీకును సాతాను ప్రలోభానికి శోధనకు లోబడి అవిధేయత ద్వారా ఇహ మందు పాపమునకు పునాదులు వేసిన ఏవకి.
- స్త్రీకిని దేవుని ప్రణాళిక ద్వారా నిష్కళంకిగా ఇహమందు ఉద్భవించిన నూతన ఏవకి. అనగా, దేవుని చిత్తానికి విదేయించి రక్షణ కార్యానికి పునాదులు వేసిన స్త్రీకిని.
- నీ సంతతికి పాపం ప్రలోభాలకు లొంగీ పాపాత్ములుగా, దుష్టులుగా దేవుని చిత్తానికి అవిధేయతగా జీవిస్తున్న వారందరికిని.
- స్త్రీ సంతతికిని పవిత్రురాలుగా నూతన ఎవగా జన్మింపబవుచున్న స్త్రీ సంతతికి. ఆ తల్లి ద్వారా ఇహమందు ప్రవేశించిన ప్రథమ సంతతి సాక్షాత్తు క్రీస్తు ప్రభువే. ఆయన యందు విశ్వాసముంచి తన తల్లిని మన తల్లిగా అంగీకరించిన ప్రతి ఒక్కరు కూడా ఆ స్త్రీ సంతతివారము అవుతారు.

పై వాక్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే వారి ఇరువురికి మధ్య తీరని వైరము కలుగుతుంది అని చూస్తాం. సాధారణంగా వైరం అనేది ఒక విషయార్థమై విభిన్న స్వభావుల మధ్య ఏర్పడే ఘర్షణ వంటిది. ఒకరి స్వార్థపూరిత అనుకూల జీవనం కోసం ఇతరులు ప్రతికూల సంఘటనలను ఎదుర్కొనే కోణంలో ఇద్దరు

వ్యక్తుల మధ్య, ఇరు వర్గాల మధ్య, ఇరు దేశాల మధ్య వైరం ఏర్పడుతుంది. అంతేకాక చిన్నచిన్న భేదాభిప్రాయాల వల్ల ఇతరులను సరిగా అర్థం చేసుకోకపోవడం వల్ల లేదా ఇతరులను తక్కువగా చూడటం వల్ల కూడా వైరం ఏర్పడుతుంది. అయితే కొందరి మధ్య ఏర్పడే వైరాలు కొంతకాలానికి సమసి పోతాయి. కానీ కొందరి మధ్య ఏర్పడే వైరాలు వారు మరణించే వరకు కూడా అలాగే ఉంటాయి. కొన్ని సందర్భాలలో, మరి ముఖ్యంగా ఇరు వర్గాల యందు కలిగిన వైరం దానికి కారణమైన వ్యక్తులు మరణించినను వారి కుటుంబాల మధ్య ఇరు వర్గాల మధ్య ఆ వైరం కొనసాగుతూనే ఉంటుంది అదియే తీరని వైరం.

పై వాక్యంలో నీకును స్త్రీకిని నీ సంతతికిని స్త్రీ సంతతికిని మధ్య తీరని వైరం కలుగుతుంది అని చెప్పబడింది. ఈ వాక్యం యందు ఎంతో లోతైన భావము దాగి ఉంది. వారి ఇరువురి మధ్య ఏర్పడే వైరంకి కారణము వారి జీవన విధానం అనగా ఏవ తన అవిధేయత ద్వారా దేవునికి వ్యతిరేకంగా పాపం చేసిన విధమునకు మరియు నూతన ఏవగా జన్మించిన మరియమాత విధేయత ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చిన విధమునకు మధ్య వైరము. ఏవ పాప జీవితమునకు సూచికగా ఉంటే నూతన ఏవ పుణ్య జీవితంనకు, నిష్కళంక జీవితమునకు సూచికగా ఉంది. పవిత్ర స్వభావం మరియు పాప స్వభావం రెండు ఎప్పటికీ  కూడా ఒకే త్రాటిపై నడువవు. అలాగే ఏవ మరియు నూతన ఏవ (మరియ తల్లి) ని కూడా మనం ఎప్పుడూ కూడా ఒకే కోణంలో చూడకూడదు. వారు ఇరువురు ఒకే కోణంలో జీవించి ఉంటే వారి మధ్య వైరం ఏర్పడేదే కాదు. వారి స్వభావంలో జీవన విధానంలో విభిన్నత ఉంది. తనను ధిక్కరించి పాపములో పడిపోయిన ఏవ వలె నూతన ఏవ కూడా ఉండకూడదు అని దేవుడు ఆమె యందు ఒక ప్రణాళిక కలిగి, ఆమెను పవిత్రంగా మలిచాడు. నిష్కలంకిగా ఉద్భవింప చేశాడు. ఆమె పవిత్ర జీవన విధానము కొంతకాలానికి పరిమితమైంది కాదు జీవించినంత కాలం పాప మాలిన్యం సోకకుండా పవిత్రంగా జీవించింది.

తండ్రి అయిన దేవుడు మరియమాతను తన తల్లి గర్భమందు నిష్కళంకంగా ఉద్భవింప చేశాడు కావుననే ఇతర పాపాలు కూడా ఆమె యందు ఎటువంటి దుష్ట ప్రభావితం చూపలేకపోయాయి. ఎందుకంటే ప్రతి పాపమును అధిగమించి జీవించే అనేకమైన రెట్టింపు పవిత్రతతో నూతన ఏవను అనగా మరియమాతను దేవుడు ఉద్భవింప చేశాడు. ఆమె పవిత్రత శాశ్వతము. అందుచేతనే పాపమునకు పునాదులు వేసిన ఏవకు మరియమాతకు మధ్య ఏర్పడిన వైరము శాశ్వతమైనది. అంతేకాక ఆ పవిత్ర స్త్రీ ద్వారా ఏర్పడిన సంతానము అనగా క్రీస్తునకు మరియు ఎవవలె దేవుని ఆజ్ఞను ధిక్కరించిన ప్రతి ఒక్కరికి మధ్య ఘర్షణ ఒక తీరని వైరంగా కొనసాగుతుంది. క్రీస్తును విశ్వసిస్తున్న వారందరు కూడా ఆయన మరణ పునరుత్థానాల ద్వారా మనకోసగిన రక్షణ ఫలితాల ద్వారా పవిత్రం చేపడ్డారు. పాపమునకు పవిత్రతకు మధ్య జరుగుచున్న ఈ తీరని వైరంలో క్రైస్తవ విశ్వాసులంతా పవిత్రత యందు నిలబడి పాపం ఖండిస్తారు.

## 2. అనుగ్రహ పరిపూర్ణురాలా! (లూకా 1:28):

"అనుగ్రహ పరిపూర్ణులారా" అనగా దేవుని సకల అనుగ్రహములతో నింపబడింది అని అర్థం. ఉదాహరణకు నీటితో నిండుగా నింపబడిన ఒక కుండను తీసుకుందాం. అది పూర్తిగా నీటితో నింపబడుటచే అందు కొత్త నీరు పోయుటకు సాధ్యపడదు. ఆపై పోస్తున్న నీరంతా కూడా నిల్వ ఉండటానికి అందులో స్థానం లేనందున నీరు పొంగి పొర్లుతూ ఉంటుంది. అలాగే మరియమాత దేవుని సకల అనుగ్రహంతో నింపబడింది ఆమె యందు లేని అనుగ్రహమే లేదు. ఏ విధంగా ఐతే కుండ నిండుగా నీటితో నింపబడిందో మరియమాత కూడా పూర్తిగా అనుగ్రహంతో నింపబడింది. ఒక్క మాటలో చెప్పలంటే ఆమె అనుగ్రహముతో నింపబడిన నిండు కుండ. అందులో ప్రముఖమైనది మనము ధ్యానిస్తున్న ఆమెని నిష్కళంకత్వము. నిండు కుండ దరిచేరు గాలి తాకిడి, దుమ్ము ధూళి ఆ కుండను తన నిశ్చలత్వ స్థానం నుండి కదల్చలేవు. అలాగే, తన దరిచేరు ఇహ మాలిన్యం తనను తన నిష్కళంకతత్వం నుండి మార్చలేవు. ఎందుకంటే దేవుని అనుగ్రహముతో ఆమెకి తోడుగా

ఉన్నాయి. గాబ్రియేలు దూత మరియమాత దగ్గరకు వచ్చి శుభసందేశం తెలుపగనే మరియు మాత "నేను ప్రభుదాసురాలను ప్రభువు చిత్తం నా యందు నెరవేరును గాక" అని దైవ చిత్తానికి విదేయించిన తర్వాత ఆమె అనుగ్రహంతో నింపబడింది అని అనుకుంటే అది కచ్చితంగా పొరపాటే.

మరియమాత తన తల్లి గర్భంలో పడినప్పటి నుండి కూడా అనుగ్రహములతో నింపబడింది. అందుకు సాక్ష్యం దేవదూత మరియమాత దరికి చేరినప్పుడు దేవదూత పలికిన తొలి పలుకులు: అనుగ్రహ పరిపూర్ణురాలా! నీకు శుభం. అనగా ఆమె దేవుని చిత్తాన్ని అంగీకరించక ముందే అనుగ్రహముతో నింపబడింది. ఆమె జన్మింపకముందే పవిత్రం చేయబడింది. నిష్కళంకంగా ఉద్భవించబడింది. ఎందుకంటే ఆమె ద్వార పవిత్ర సంతానం అనగా క్రీస్తు మానవునిగా ఈ లోకమందుకు అవతరించునున్నాడు. లోకరక్షణార్థమై కాలము సంపూర్ణమైనప్పుడు దైవ కుమారుడు ఇహమందు రక్షకునిగా ఉద్భవింపసిద్ధమైనప్పుడు ఆ స్త్రీని ఇహమందు ఒక నిష్కళంకిగా దేవుడు ఉద్భవింప చేశాడు. ఆమెయే మరియ తల్లి. ఆ తల్లి పొందిన అనేక అనుగ్రహాంలలో ఆమెకు పొందిన నిష్కళంకత్వం అతి ప్రధానమైనది. దేవుని అనుగ్రముచే ఎటువంటి కళంకం సోకకుండా జీవితాంతం నిర్మలంగా, నిష్కళంకంగా జీవించింది.

### 3. ప్రేయసి నీవు సౌందర్యవతివి. నీ యందు కళంకమేమియు లేదు (పరమ 4:7)

మానవ దృష్టిలో, ఒక స్త్రీ ఆకర్షితమైన రంగు, రూపు, ముఖ తేజస్సు మరియు శరీర ఆకృతులను బట్టి ఆ స్త్రీ సౌందరవతి అని భావిస్తారు. అయితే ఒక స్త్రీ సౌందర్యవతి అయినంతమాత్రనా ఆమె సద్గుణ సంపన్నురాలు అని చెప్పగలమా? ఆమె యందు పాపం లేదు అని నిర్ధరించగలమా? ముమ్మాటికీ కాదు. పవిత్ర గ్రంథంలో అనేక స్త్రీలు మిక్కిలి సౌందర్యవతులుగా పరిగణించబడ్డారు, కానీ కళంకం లేని స్త్రీ గా పరిగణంపబడలేదు.

ఉధాహరణకి అబ్రహాముని భార్య సారా పవిత్ర గ్రంథమందు మిక్కిలి సౌందర్య వతిగా పరిగణించబడింది. ఆమె సౌందర్యం వల్ల అబ్రహాంకి ఏమైనా

ప్రాణహాని కలుగుతుంది అని తన భార్య సారాను పలుమార్లు తన చెల్లిగా ఇతరులకు పరిచయం చేశారు. అంత సౌందర్యవతి అయినప్పటికినీ కళంకం లేని స్త్రిగా పరిగణించబడలేదు. ఎందుకంటే దేవుని వద్ధనమందు అవిశ్వాసం చూపింది. తనకి సంతానం కలుగుతది అని విస్వసింపక , అబ్రహామును తన సేవకురాలు హాగార్ తో శయనించి తనకి సంతానం దయచేయమనింది. సౌందర్యవతి ఇన కళంకం కలిగి జీవించింది.

లోతు కుమార్తెలు: లోతు కుమార్తెలు మిక్కిలి అందం కలిగిన స్త్రీలుగా పవిత్ర గ్రంథమందు ప్రస్తావించబడింది. అయితే వారు తమ సంతాన ప్రాప్తి కొరకై తమ సొంత తండ్రిచే ద్రాక్షరసం తాగించారు. తండ్రి మత్తులో ఉన్నప్పుడు ఆయనతో ఒక్కొకరుగా శయనించి గర్భం దాల్చి సంతానం పొందారు. వారు సౌందర్వంతులైనప్పటికి కళంకం లేకుండా జీవించలేకపోయారు. ఇంకను అనేక మంది పవిత్ర గ్రంథమందు సౌందర్యవంతులుగ పరిగణించబడినను, కళంకం లేకుండా జీవించలేక పోయారు.

మానవతా ఆలోచనలకి భిన్నంగా, దేవుని ఆలోచనలు ఉంటాయి. మనం బాహ్య రూపురేఖలను సౌందర్యంగా పరిగణిస్తే దేవుడు అంతః హృదయ శుద్ధిని సౌందర్యంగా పరిగణిస్తాడు. దేవుని దృష్టిలో సౌందర్యమైన జీవితం అంటే దేవుని యందు భయభక్తులు కలిగి నిర్మల హృదితో నిష్కలళంకమగ జీవించడం. అయితే ఇలా జీవించడం అందరికీ సాధ్యపడదు. దేవుని యొక్క సంపూర్ణ అనుగ్రహం ఉంటేనే తప్ప ఇటువంటి జీవితాన్ని ఎవరు కూడా జీవించలేరు, ఎందుకంటే ప్రతి శిశువు కూడా పుడుతూనే పాపపు సంకెళ్లతో, జన్మ పాపంతో జన్మిస్తుంది. అటువంటి తరుణంలో సొలొమోను గ్రంథ కర్త పరమగీతం 2:7 లో, కళంకం లేని స్త్రీ సౌదర్యవతి అని చెప్పడం మనకి ఆశ్చర్యం కలిగించవచ్చును, ఎందుకంటే ప్రతి వ్యక్తి కూడా పాపపు సంకెల్లతో ఇహమందుకు ప్రవేశిస్తాడు. అంతేగాక ఇక్కడ మనం గుర్తు చేసు కోవలసిన ముఖ్య అంశం ఒకటి ఉంది. అదియే పవిత్ర గ్రంథం మొత్తం కూడా దేవుని ఆత్మ ప్రేరణచే రచించబడింది. అందులో లిఖించబడిన ప్రతి అక్షరం, పొల్లు

కూడా నేవవెరుతుంది అనే సత్యాన్ని మనం గ్రహించాలి. మరి ఆ కళంకం లేని ఆ స్త్రీ ఎవరు? ఆ స్త్రీయే లోకరక్షకుడిని ఇహ మందుకు తీసుకురావడం కోసం తండ్రి దేవునిచే ప్రత్యేకం చేయబడి, నిష్కళంకముగా తన తల్లి గర్భంలో ఉద్భవించబడింది. దైవ కుమారుని జన్మనిచ్చి, చిరకాలం తండ్రి రక్షణలో నిస్కళంకంగా పవిత్రం గా నిలచింది.

## 4. స్త్రీ ఔన్నత్యం సర్ప వంచన దేవుని రక్షణ (దర్శన గ్రంథం 12)

అపోస్తులుడైన పునీత యోహాను గారు ప్రభు కృపచే తనకి కలిగిన దర్శనములన్నింటిని స్పష్టంగా దర్శన గ్రంథమందు వివరించారు. అందు 12వ అధ్యాయంలో స్త్రీ ఔన్నత్యాన్ని మరియు సర్పం యొక్క వంచన గురించి తెలియచేశారు. మరి ముఖ్యంగా ఆ సర్పపు వంచన ప్రలోభాలకు స్త్రీ గురికాకుండా ఆ స్త్రీని ప్రభు రక్షించిన విధానమును కళ్ళకి కట్టినట్లు వివరించారు. అందు కొన్ని వాక్యాలను పరిశీలించుదం.

దర్శన గ్రంథ 12:1 సూర్యుడే ఆమెకి వస్త్ర మాయెను, చంద్రుడే ఆమె పాదముల కింద నిలిచెను, ఆమె శిరస్సుపై 12 నక్షత్రంల కిరీటం ఉండెను.

సూర్యుడే ఆమె వస్త్రం: సాధారణంగా వస్త్రం శరీరంకి మాలిన్యం అంటకుండా, శరీరంకు బాహ్యముగా ధరించే ఒక వస్తువు. కానీ ప్రస్తుత సమాజం వస్త్రం ను శరీరాలంకరణ కోసం ఉపయోగించే ఒక ప్రధానిగా దీని అర్థం మారింది. ఐతే పరిశుద్ధ గ్రంథం పరిశీలించినట్లైతే వస్త్రంనకు ఒక ప్రత్యేక అర్థం వుంది. అదియే, వస్త్రం అనగా పాపంనకు సూచిక అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఆదాము ఏవలు దేవునికి వ్యతిరేకంగా పాపం చేసిన తరుణంలో, వారు దిస మొలలతో ఉన్నారు అని తమకి తాము గుర్తించిన సమయంలో, వారి పాపమునకు సూచికగా శరీరాన్ని కప్పుకొనుటకు దేవుడే వారికి ఒక వస్త్రం ను ఇచ్చారు (ఆది 3:21). అప్పటి నుండి ఇహ మందు జన్మించబోవు ప్రతి ఒక్కరూ ఈ ఆదిమ తల్లిదండ్రుల పాపంలో బాగస్తులవుతున్నారు. వారి పాప సూచకంగా వస్త్రంను ధరిస్తున్నారు. కావుననే ప్రతి వ్యక్తి కూడా తాను జన్నించినప్పటి నుండి మరణించే వరకు వస్త్రంను దరిస్తునే ఉంటారు. మరణించిన తరువాత కూడా అతని వస్త్రములతో సమాధి

చేస్తారు. ఆ వస్త్రములు తన మానవ బలహీనతలకి, పాపపు జీవితానకు సూచికగా ఉండి ప్రభు శరణు వేడుతూ సమాధి చేస్తారు.

మార్కు 14:15-47 క్రీస్తు ప్రభువు రాజుగా యెరూషలేమునకు గాడిద పిల్లపై విజయ ప్రవేశం చేయుచున్నప్పుడు ప్రజలు"జయము, ప్రభు నామమున వచ్చువాడు స్తుతింపడునుగాక! ఇశ్రాయేలు రాజు స్తుతింప బడునుగాక!" అని ఎలుగెత్తి చాటుచు, తమ వస్త్రములను మార్గమందు పరచిరి. ఆ వస్త్రములు వారి పాపములకు సూచికగా ఉన్నాయి. పశ్చాత్తాప హృదితో వినయాత్మక మనసుతో వస్త్ర రూపంలో వారు తమ పాపములను ప్రభువునకు అర్పించగ, వారి పాపములను మరియు సకల మానవాళి పాపములను తన భుజాలపై శిలువ రూపంలో మోసి, కల్వరి గిరి చేరి సిలువలో మరణించారు. మరణించిన క్రీస్తును, నార వస్త్రంలో చుట్టి సమాధి చేశారు (యోహాను 19:41). ఆ వస్త్రం తాను మోసిన మానవాళి పాపములకు సూచికగా మాత్రమే ఉంది. ఎందుకంటే తన యందు ఎటువంటిపాపం లేదు. ఆయన పరమ పవిత్రుడైన దేవుని కుమారుడు, పవిత్రుడు.

క్రీస్తు మూడవ దినమున పునరుత్థానం అయినప్పుడు, తనకి కప్పబడిన ఆ నారవస్త్రమును సమాధి యందే విడిచి పెట్టారు (యోహాను 20:5). అలా వస్త్రంను సమాధి యందే వదిలి వెల్లుటలో ఒక దైవిక రహస్యం ఉంది అని మనం గ్రహించాలి. ఆ వస్త్రం సకల మానవాళికి ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది. అదియే, ఇక నుండి మనం ఎప్పటికీ పాపమునకు బానిసలం కాము, క్రీస్తు తన శ్రమల మరణ పునరుత్థానం ద్వారా మనకి పాప విమోచన కలిగించారు. తనను విశ్వసించి, తాను చూపించిన మార్గంన పయనించు ప్రతి ఒక్కరుకూడా తన వలె వస్త్రం వదిలి, అనగా పాపం వదిలి పునరుత్థానం అవుతాం అని సూచిస్తుంది.

అపొస్తులుడైన పునీత యోహాను గారు తనకి కలిగిన దర్శనమందు స్త్రీ ఔన్నత్యాన్ని వివరిస్తూ, సూర్యుడే ఆమెకి వస్త్రము అని చెప్పుటలో ఎంతో దైవిక అర్థం దాగి ఉంది. ఇక్కడ ఆ సూర్యుడు ఎవరు అనే ప్రశ్న తలెత్తడం సహజం. పరిశుద్ధ గ్రంథ పరిశీలన చేసినట్లైతే, నేనే లోకానికి వెలుగు అని ప్రభువు

తనను తాను వ్యక్తపర చుకున్న సన్నివేశం ఆ ప్రశ్నకి సమధానంగా నిలుస్తుంది (యోహాను 8:12). అనగా, ఆ సూర్యుడు ఎవరో కాదు, సాక్షాత్తు దేవుడే, దేవుని కుమారుడే. సూర్యుడే ఆమె వస్త్రం ఆమెను, అనగా, సాక్షాత్తు దేవుడే ఆమే చుట్టూ ఒక రక్షణ కవచం గా చుట్టూ నిలిచి, ఎటువంటి పాప మాలిన్యం ఆ స్త్రీకి సోకకుండా కాపాడాడు అని పునీత యోహాను గారు తనకి కలిగిన దర్శనం ద్వారా వివరించారు. దేవుడు ఒసగిన వస్త్రం మన పాప మాలిన్యంకి సూచికగా ఉంటే , దేవుడే ఆ స్త్రీకి వస్త్రం అవ్వడం అనునది దేవుని యందు ఆ స్త్రీ ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది అని సూచిస్తుంది. అదియే, తాను వస్త్రమై ఆ స్త్రీని పాప మాలిన్యం అంటకుండా కాపాడటం. అనగా, నిష్కళంకిగ ఆ స్త్రీ నీ రూపొందింప చేయడం కోసం, తద్వారా తన నిష్కళంక గర్భం ద్వారా దేవుడు తన కుమారుణ్ణి ఇహ మందుకు తీసుకురావడం కోసం. ఇది దైవ ప్రణాళిక. ఆ స్త్రీ యే మారియమాత.

చంద్రుడే నీ పాదముల కింద నిలిచెను: సాధారణంగా చంద్రుణ్ణి లేదా చందమామను స్త్రీ తో పోలుస్తారు. విశ్వ సుందరి ఐన చంద్రున్ని, ఒక స్త్రీ యొక్క అందం గురించి పోగడుటకు విశేషణంగా ఉపయోగిస్తారు. ఉదా: ఈమె చంద్రునివలే సౌందర్యంగా ఉంది. ఆపోస్తులుడైన పునీత యోహాను గారు తనకి కలిగిన దర్శనమందు ఒక స్త్రీ పాదములకింద, విశ్వ సుందరి ఇన చంద్రుడు ఉంటడం మనకి అశ్చర్యాన్ని కలిగించవచ్చు. ఈ మాటలను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ముందుగా చంద్రుని యొక్క స్వభావాన్ని మనం తెలుసుకోవాలి. చంద్రుడు నిశ్చలుడైనప్పటికి తన బింబం మనకి అనిశ్చలంగా కనిపిస్తుంది. పున్నవి నాడు నిండుగా సంపూర్ణ గోళాకారంలో అందంగా, ప్రకృతినే మైమరపించే విధంగా కనిపిస్తుంది. అమావాస్యనాడు అసలే కనిపించదు. మిగిలిన రోజుల్లో అర్థ గోళాకృతిలో మరియు స్వల్ప గోళాకృతిలో కనిపిస్తుంది. పున్నవి నాడు వచ్చే వెన్నెల యందు(చంద్రుడు) ప్రకృతి పులకరిస్తుంది. తన కాంతి కిరణాలచే ప్రకృతిని వెలిగిస్తుంది. ఎందరో కవులు, రచయితలు ఈ చంద్రుని అందం గూర్చి కథలు, కథలుగా తమదైన శైలిలో వివరించారు. అటువంటి అందమైన, గొప్పదైన చంద్రుని ఒక స్త్రీ పాదములకింద ఉండటం అనేది ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. విశ్వ సుందరి మరియు ప్రకృతినే

వెలిగించే చంద్రుని కన్నా తాను దర్పణమందు చూసిన స్త్రీ సౌందర్యం మరియు ఆమె స్వభావం మిన్నగా ఉండటం ఇందు విశేషం. పున్నమి నాడు వచ్చే చంద్రుణ్ణి క్షుణ్ణంగా పరిశీలించి చూసినట్లయితే అందులో ఒక మచ్చ కనిపిస్తుంది. అంత అందం మరియ గుణ స్వాబావం ఉన్నప్పటికినీ తన యందు ఉండిన మచ్చ తన మాలిన్యన్ని సూచిస్తుంది. మాలిన్యాన్ని సూచించే ఆ మచ్చే కాబోలు, చంద్రునికి ఆ స్త్రీకి మధ్య వ్యత్యాసాన్ని సూచిస్తుంది. ఆ స్త్రీ యందు ఎటువంటి మచ్చ లేదు కాబోలు, దేవుడు విశ్వ సుందరి ఇన చంద్రుని సహితం ఆ స్త్రీ పాదముల కింద ఉంచుటకు గల ప్రధాన కారణం. చంద్రుడే అమె పాదములకింద నిలిచెను అను వాక్యం, చంద్రుని కళంకము (మాలిన్యం) మరియు స్త్రీ యెక్క నిష్కళంకం ను సూచిస్తుంది. ఆ నిష్కలంకమైన స్త్రీ మరెవరో కాదు దేవుని కుమారుని తమ గర్భమందు మోసిన మరియ తల్లే.

12 నక్షత్రముల కిరీటం ఆమె శిరసు పై ఉండెను:12 అను సంఖ్యకు పవిత్ర గ్రంథమందు ఒక ప్రత్యేక అర్థం ఉంది. పాత నిబంధన యందు ఈ సంఖ్య , దేవుని ఎన్నిక ప్రజలైన ఇశ్రాయేలు 12 గోత్రముల కు సూచికగా ఉంటే, అదే సంఖ్య నూతన నిబంధన యందు, క్రీస్తు తాను స్థాపించిన ప్రేషిత కార్యము, రక్షణను నలువైపులా ప్రకటించుటకు తాను ఎన్నుకొనిన అపోస్తులలను సూచిస్తుంది. యోహాను దర్శనమందు ప్రస్తావించ బడిన స్త్రీ శిరస్సు పై కిరీటం మరియు దానిపై నక్షత్రంలు ఉన్నాయి. కిరీటము ను కేవలం కొంతమందికి మాత్రమే, అనగా ప్రత్యేకించబడిన వారికి మాత్రమే అమరుస్తారు (రాజు మరియు రాణి). అది కూడా స్వచ్ఛమైన బంగారంతో చేస్తారు. మన వాడుక బాషలో చెప్పలంటే 24 carat gold అని అంటారు. అంటే అది స్వచ్ఛమైన బంగారం అనుయు మరియ అందు ఏటువంటి కళంకము, కల్తీ లేదు అని సూచిస్తుంది. ఈ విషయంను యోహాను దర్శనమందు ప్రస్తావించబడిన స్త్రీ కి అనుసంధానిస్తే ఆ స్త్రీ శిరస్సు యందు అమర్చిన ఆ కిరీటం ఆమె నిష్కళంకత్వమునకు సూచిక ఉంది. ఇశ్రాయేలు 12 గోత్రముల ఎన్నిక యందు గానీ, 12 మంది అపోస్తులుల ఎన్నిక యందు గానీ, వారి శిరస్సుపై కిరీటం అమర్చినట్లు ఎక్కడ ప్రస్తావించ బడలేదు. ఐతే కేవలం ఈ యొక్క స్త్రీ ఎన్నిక యందు మాత్రమే ప్రస్తావించబడింది అంటే ఆమె ఎన్నిక

వారివురి (ఇశ్రాయేలు తెగలు, అపోస్తులు) కంటే భిన్నంగా జరిగింది అని మనం గ్రహించాలి. 12 వ అధ్యాయం పూర్తిగా చదివితే, అది ఆమె గొప్పతనం కాదు కానీ, ఆమె గర్భం నందు జన్మించబోయే శిశువు కొరకై ఆమె ప్రత్యేకమైన అనుగ్రహం తో నింపబడింది అని మనకి అర్థం అవుతుంది. ఇనుప దండం తో సకల జాతులను పరిపాలించు శిశువు ఆమె గర్భమందు జన్మిపజేయుటకు దేవునిచే ప్రత్యేకం చేయబడింది. ఆ శిశువు కి జన్మనిచ్చిన స్త్రీ యే మరియతల్లి. ఆమె ప్రత్యేక అనుగ్రహమే ఆమె నిష్కళంకత్వం.

స్త్రీ శిశువునకు జన్మనివ్వగనే, సర్పం మింగచూచెను, కానీ సాధ్యపడలేదు: ఇనుప దండం చే పరిపాలించు నాయకుడు ఆ స్త్రీ గర్భాన జన్మిస్తాడు అని గ్రహించిన ఆ సర్పం (సాతాను), జన్మింపగనే ఆ శిశువు ను మింగ చూచెను. ఆ శిశువునకు, ఈ సర్పంనకు మధ్య వైరం ఎంటి, అసలు ఎందుకు ఈ సర్పం ఆ శిశువు ను మింగ చూచుచున్నది ? అనే ప్రశ్నలు మన మదిలో మెదలడం సహజం. అందుకు సమాధానంగా, ఇహ మందు ఆ శిశువు జన్మిలపక మునుపే వారి ఇద్దరి మధ్య శత్రుత్వం ఏర్పడింది. స్త్రీ సంతతి నీ తలని చితక గొట్టును (ఆది 3:15). అప్పటి నుండే, అనగా, ఆ శిశువు జన్మింపక మునుపటి నుండే ఆ సర్పంనకు భయం ఏర్పడింది, తనను ఎక్కడ నాశనం చేస్తాడు అని. అందుకే ఆ శిశువు ను మింగచూచెను. ఆ సర్పం అనేక ప్రయోగాలు చేసింది ఆ శిశు వు ను మింగుటకు, కానీ సాధ్యపడక విఫలమైంది. ఉదా: ఆ శిశువు ను మోయుచున్న స్త్రీని విడనాడుటకు, తన భర్తకి కలిగిన శోధన (మత్తయి: 1: 19), శిశువు జన్మిపిగనే హేరోదు ద్వారా ఆ శిశువును చంపచూచుటకు శోధన (మత్తయి: 2: 16), ఆ శిశువు బహిరంగగా దేవుని రాజ్యం గురించి ప్రకటించుటకి ముందు అయెను శోధించెను (మత్తయి 4:1–11), గేత్సేమనే తోటలో ఆ శిశువు పొందిన శోధన (మత్తయి 26:39), శిలువలో ఆ శిశువు మరణిపకుండుటకి, లోక రక్షణార్ధం జరగకుండుటకి సైనికులను శోధించి చేదు తనకిచ్చిన శోధన (మత్తయి 27:34). ఇలా పలు విధాలుగా ఆ సర్పం వంచనతో శోధించినప్పటికిని తనను (ఆ శిశువును) స్వాధీనం చేసుకోలేక పోయింది. అనగా మింగ లేకపోయింది. అలా విఫలమైన ఆ సర్పం కనీసం

ఆ శిశువును మోసిన స్త్రీను మింగుటకి, అనగా తన వశం చేసుకోవడం కోసం శోధింప మొదలిడింది.

అటుపిమ్మట, సర్పం ఆ స్త్రీ నే మింగ చూచెను. వినాశనం నకు సూచిక ఐన జలప్రవాహంను తన నోటి ద్వారా ఊదెను, ఆ స్త్రీ ఆ ప్రవాహం లో కొట్టుకొని పోతది అని, కానీ దేవుడే ఆమె కు రక్షణగా ఉండి అనునిత్యం ఆ స్త్రీనీ తన రక్షణ హస్తాలతో కాపాడుతూ వచ్చాడు. ఆ వినాశనం జల ప్రవాహం ఆ స్త్రీని తాకనియక, భూగర్భం నోరు తెరచి మింగేల చేశాడు. అనగా, ఆ సర్ప పాప ప్రలోభాలు ఆ స్త్రీకి తాక కుండా ప్రభువే ఆమెను రక్షించెను (దర్శన 12:15). నిష్కళంకి గా కడవరకు ఆ స్త్రీని నిలిపాడు. ఆ స్త్రీ యే మరియ తల్లి.

## 5. పవిత్ర గ్రంథమందు ఇతర పోలికలు

### a. నోవా ఓడ (ఆది 6:13-22):

ఇహ మందు విజృంభిస్తున్న పాప మాలిన్యం ను నిర్మూలించి, ఒక నూతన సృష్టి నీ కలుగ చేయుటకు దేవుని మదిలో మెదలిన తలంపునకు ఆవిర్భావమే నోవాతో ఒడంబడిక. నూతన సృష్టికి ప్రతీకయే ఓడ నిర్మాణం. దేవుడు నోవా తో చేసుకున్న ఒడంబడిక క్షుణ్ణంగా పరిశీలిస్తే అందు మనకి రెండు విషయములు అర్థం అవుతాయి.

1. దేవుని యందు భయభక్తులు కలిగి, దేవుని చిత్తాన్ని నెరవేరుస్తూ జీవించిన వాళ్ళు దేవుని అనుగ్రంనకు పాత్రులు అవుతారు మరియు దేవుని రక్షణను పొందుకుంటారు.
2. దేవుని చిత్తానికి వ్యతిరేకంగా, పాపంలో దుష్టత్వం లో జీవిస్తున్న వారిపై దేవుడు తన ఆగ్రహన్ని ప్రదర్శిస్తారు అని అర్థం అవుతుంది.

40 రోజుల కుంభ వర్షం కురిపించి జల ప్రవాహంలో దుష్ట మానవాళి పాప వినాశనము ను కావించిన దేవుడు, తన ప్రజను (నోవా కుటుంబం) ఉన్నత స్థానానికి లేవనేత్తాడు. పర్వతముల కంటే అధిక స్థానానికి వారిని లేవనెత్తి, పాపములను వారి పాదముల కింద ఉంచాడు (ఆది 7:17-24). ఈ సంఘటన మరితమాత నిష్కళంకిగా ఉద్భవించింది అనుటకి అనుసంధానంగా ఉపయోగపడుతుంది. లోక రక్షణార్థమై, నూతన సృష్టికి పునాదిగా, తన

కుమారునికి తల్లిగా దేవుని ప్రణాళికలో నిష్కళంకిగా ఉద్భవించిన స్త్రీగా మరియమాత ఇహమందు జన్మించింది. ఆమె దేవుని యందు భయభక్తులు కలిగి లోక రక్షణార్థమై దేవుని చిత్తాన్ని నెరవేరుస్తూ జీవించింది. దేవుడు నోవాను తన కుటుంబాన్ని పాప మాలిన్యం నుండి కాపాడాడో , మరియ తల్లికి కూడా తానే రక్షణగా ఉంటూ ఇహ మందు ఏ పాప మాలిన్యం అంటకుండా కాపాడాడు.

**b. మండుచున్న పొద (నిర్గమ 3:16):**

హెబ్రియుడైన మోషే తన మామ యిత్రో మందలను మెపుచుండగా, ఆ సమీపాన ఒక మండుచున్న పొద కనిపించింది. పొద తన స్వభావాన్ని బట్టి ఆ అగ్ని తాకిడికి నాశనం కావాలి, కానీ అలా జరగలేదు. అగ్ని తాకిడికి గురైనప్పటికిని ఆ పొద కాలిపోకుండుట చూచి మోషేకి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ విచిత్ర సంఘటన ఎంటి అని తెలుసుకోగోరి ఆ పొద దరికి చేరాడు. అగ్ని రూపంలో దేవుని ఆత్మ ఆ పొద యందు ఉంది అని గ్రహించాడు. దేవునికి అసాధ్యమైనది ఏమి లేదు, అందు ఉండిన దేవుని ఆత్మయే ఆ పొద కాలిపోకుండునట్లు చేశాడు అని విశ్వసించాడు. మరియమాత జీవితం ఈ మండుచున్న పొదకి అనుసంధానంగా ఉంది అని అనుటలో ఏటువంటి సంకోచం లేదు అని శ్రీసభ మనకి బోధిస్తుంది. అనగా దేవుని ఆత్మచే ఆ తల్లి నింప బడింది. దేవుని ప్రసన్నత ఆ తల్లి యందు ఉంది, అనగా సాక్షాత్తు దేవుడే తన గర్భమందు ఉన్నాడు. దేవుని ప్రసన్నత కలిగి వున్న పొద ఏ విధంగా ఐతే కాలిపోలేదో ( నాశనం కావింప బడలేదో), అలాగే నిరంతరం దేవుని ప్రసన్నతతో మరియు దేవుని ఆత్మతో నింపబడిన మరియ తల్లి మానవ స్వభావపు పాప మాలిన్యం అంటకుండా నిరంతరం కాపాడబడింది. దైవ కుమారుని కొరకై నిష్కళంకంగా ఉద్భవించబడిన ఆ తల్లి, నిరంతరం దేవుని ప్రసన్నతతో, ఆత్మతో నింపబడి నిరంతరం నిష్కళంకి గా జీవించింది.

**c. దేవుని పవిత్రాలయం:**

ఇశ్రాయేలు ప్రజలు దేవుని ప్రసన్నతో, దేవుని ఆత్మతో నింపబడిన ప్రదేశాన్ని పవిత్రంగా కొనియాడేవారు. ఎడారిలో వారు నిర్మించిన గుడారంను మరియు

యెరుసలేము దేవాలయమను దేవుని పవిత్రతకి సూచికగా భావించి అందు దేవున్ని పవిత్రంగా కొనియాడేవారు. ఇవన్నీ బాహ్య పరంగా దేవుని పవిత్రతను సూచిస్తున్నాయి. కానీ నూతన నిబంధనయందు దేవుడు తన పవిత్ర నివాసంగా ఒక స్త్రీ ని ఎన్నుకోవడం విశేషం. దేవుడు తల్లి మరియను తన ఆత్మ తో నింపాడు, తన పవిత్ర నివాసం గా ఏర్పాటు చేసుకున్నాడు. అంతేగాక, సాక్షాత్తు దేవుడే మరియ గర్భాన నవ మాసాలు నివాసం ఉన్నాడు. కావున దేవుని కుమారుని నవమాసాలు తన గర్భాన మోసి, తన రక్తాన్ని, తన శరీర మాంసాన్ని ఇచ్చి జన్మ నిచ్చినటటువంటి ఆ పవిత్ర స్త్రీ కన్య మరియను దేవుని పవిత్రాలయం అనుటలో ఎటువంటి సంకోచం లేదు. దేవుడు నిరంతరం తన ఆత్మతో, తన ప్రసన్నతతో నింపబడిన తన ఆలయానికి పాప మాలిన్యము సోకుటకి అనుమతిస్తాడా? ముమ్మాటికి కాదు. తన ఆత్మతో నింపబడిన ఆ దేహాన్ని నిరంతరం పవిత్రంగా నిష్కళంకంగా ఉంచుతాడు అని గ్రహించాలి. విశ్వసించాలి. పవిత్రంగా కొనియాడాలి.

## 6. శ్రీసభ పితురుల బోధనలు:

క్రీశ.45 శతాబ్దాలలో జీవించిన పునీతులు ఎఫ్రాయిము, ఆంబ్రోస్ అగస్తీనులు మొదలగు వారు తమ రచనల్లోనూ బోధనలోను మరియమాత పాప రహితంగా జీవించింది అని బోధించారు. అంతేగాని ఆమె నిష్కలంకోద్భవి అని వారు ఎక్కడ కూడా వారి యొక్క రచనలలో ప్రస్తావించలేదు. క్రీ.శ.67 శతాబ్దలలో మరియు మాత జన్మదినాన్ని కొనియాడడం మొదలైంది. 8వ శతాబ్దంలో పునీత దమాస్కు యోహాను, పునీత ఆంద్రేయ తదితరులు మరియమాత నిష్కళంక ఉద్భవాన్ని గురించి బాహాటంగా ప్రకటింప మొదలుపెట్టారు. క్రీస్తు శతకం 1112 శతాబ్దాలలో ఐరోపా దేశాలలో కూడా ఈ పండుగను కొనియడటం ప్రారంభమైంది. 13వ శతాబ్దమునకు చెందిన థామస్ అక్వినాస్, బోనవెంతుర్, బెర్నాడు మొదలగు వారు మరియమాతను నిష్కళంకోద్భవిగా అంగీకరించలేదు. ఎందుకంటే మరియ నిష్కళంకోద్భవి అంటే పాపం లేకుండా జన్మించింది అని అర్థం. పాపం లేకుండా జన్మిస్తే ఆమెకు రక్షణ అవసరం లేదు. మరి అలాంటప్పుడు యేసు మనందరికీ రక్షకుడు

అని చెప్పడం కుదరదు. కాబట్టి మరియమాత మన అందరిలాగే ఆదిమ తల్లిదండ్రుల పాపంలో భాగస్వామి అయి, మన అందరి లాగానే ఏసు శ్రమలు మరణ పునరుత్థానాల వల్లే మరియమాత కూడా రక్షణ పొందింది అని వారు వాదించారు. కానీ ఈ అంశాన్ని విపులంగా వివరించలేకపోయారు.

అదే 13వ శతాబ్దంలో జీవించిన మరొక వేద పండితుడు స్కోతూస్ మరియమాత నిష్కళంకోద్భవాన్ని అంగీకరించి విశ్వాస సత్యంగా స్పష్టం చేసి బోధించాడు. దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వలోక సృష్టికర్త మరియు సర్వాధిపతి. అన్ని కాలాలకు, భూత, వార్త భవిష్యత్తులకు అన్ని ఋతువులు, సర్వ సృష్టి ఆయన అధీనం లోనే ఉన్నాయి (ఉప 11:5). అటువంటి సర్వాధిపతి, సర్వ జ్ఞానుడు మరియమాతను ఆమె తల్లి గర్భంలో నుండే జన్మ పాపం లేకుండా కాపాడ లేదు అని అనుకోవడం మన పొరపాటే అవుతుంది. మరియమాత దైవ కుమారునికి తల్లి అవ్వడం దేవుని చిత్తం. కాబట్టి నిష్కళంకోద్భవిగా ప్రత్యేక అనుగ్రహం పొందేందుకు ఆమె తగిన వ్యక్తి కాబట్టి పాప కళంకము లేకుండా తల్లి మరియను తల్లి గర్భంలోనే పదిల పరచడం అనేది దేవుని సంకల్పించి నెరవేర్చిన కార్యమే కానీ మరేమీ కాదని స్కోతుస్ బోధించాడు.

యేసు శ్రమలు మరణ పునరుత్థానాల ద్వారా మానవులు అందరూ రక్షణ పొందారు. అదేవిధంగా మరియమాత కూడా తాను తన తల్లి గర్భంలో పడకముందే క్రీస్తు యొక్క రక్షణ ఫలాలను క్రీస్తు జననంకు ముందే, మరియ తన తల్లి గర్భంలో పడినప్పుడే చవి చూసింది అనిచెప్పుటలో ఎటువంటి సందేహం లేదు అని స్కోతుస్ నొక్కి ఒక్కానించి చెప్పారు. మానవతా దృక్పథంతో అలోంచిస్తే ఇది ఎలా సాధ్యం అనే ప్రశ్నలు తలెత్తడం సహజం. దేవునికి అంతయు సాధ్యమే (లూకా 1:37) అనే మాట ఆ ప్రశ్నకు సమాధానంగా నిలుస్తుంది. అంతేగాక సర్వకాల వ్యాప్తి అయిన దేవుడు అన్ని కాలాలకు భూతావర్తన భవిష్యత్తు కాలాలకు అతీతుడు, అంటే జరిగిన దానిని, జరుగుచున్నదానిని, జరగబోవు దానిని కూడా ఆయన దర్శించగలడు. కాబట్టి ఆయనకు ముందు వెనక అనే కాలపరిమితులు, భేదాలు ఏమియు లేవు. అంతేకాదు కాలం ఆయన ఆధీనంలో ఉంటుంది. కాల గతిలో తద్వారా

జరగబోయే సంఘటనలను ఫలితాలను ముందుగానే వర్తింప చేయగలడు. రేపటి ప్రభావాన్ని నేటి సంఘటనలపై చూపగలడు. కాబట్టి మరియ జన్మం తర్వాత జరిగిన యేసు శిలువ యాగ ఫలితము పాప ప్రక్షాళన ప్రభావం ముందుగానే మరియతల్లిని అమలోద్భవి గా రూపొందించింది అని తన బోధన ద్వారా విశ్వాస సత్యాన్ని ప్రకటించాడు. మరిమాత నిష్కళంక ఉద్భవం గురించి తలెత్తుతున్న ప్రశ్నలకు సమాధానంగా నిలిచాడు.

## 7. శ్రీసభ అధికార పత్రాల ప్రబోధం:

శతాబ్దాలు గడుస్తున్న కొద్ది మరిమాత నిష్కళంకోద్భవం యెడల భక్తి కార్యాలు అనేక ప్రాంతాల్లో విరివిగా వ్యాపించాయి. తద్వారా 19 శతాబ్దంలో పలు మరియ భక్తి సమాజాలు, ఉద్యమాలు, సంఘాలు, మరికొందరు ప్రముఖులు మరిమాత నిష్కళంక ఉద్భవంను ఒక వేద సత్యంగా ప్రకటించాలని పాపు గారిని కోరారు. తరువాత 9వ భక్తునాధ పాపుగారు ఈ విషయమై కార్డినల్సుతో, పీఠాధిపతులతో సమావేశమై వారి అనుకూల ప్రతిస్పందనతో 1854వ సంవత్సరము డిసెంబర్ 8వ తేదీన మరియ మాత నిష్కళంకోద్భవి అని 9వ భక్తునాధ పాపు గారు అధికార పూర్వకంగా ప్రకటన చేశారు. అందు ఈ విధంగా చెప్పబడింది,

"సర్వశక్తి గల సర్వేశ్వరుని కృపానుగ్రహం వలన మానవాళి రక్షకుడు యేసుక్రీస్తుని ప్రాశస్త్యం వలనను, పరిశుద్ధ కన్య మరియ తన పుట్టుక ప్రారంభం నుండే జన్మ పాప కళంకం లేకుండా కాపాడబడింది" అనే సత్యాన్ని దేవుడు ఎరుకపరిచాడని విశ్వాసులందరూ దీనిని గట్టి నమ్మకంతో విశ్వసించాలని మన దేవుడైన యేసుక్రీస్తు, అపోస్తులైన పునీత పేతురు పౌలుల వారసత్వంలో మేము అధికార పూర్వకంగా ప్రకటన చేయుచున్నాము అని శ్రీసభ విశ్వాస సత్య ప్రకటన చేసింది.

## 8. నిష్కలంక మాత పట్ల భక్తి భావాలు:

లోక రక్షణార్థమై నిష్కళంకోద్భవిగ జన్మించిన మరియ పాత్ర ప్రత్యేకము అని శ్రీసభ ఆదిమ కాలం నాటి నుండి ప్రబోధిస్తుంది. అంతేగాక ఆ తల్లి పేరు మీద పండుగలను, ప్రత్యేక ప్రార్థనలను, భక్తి కార్యక్రమాలను జరుపుతూ

ఉంది. ఇంతటి ప్రత్యేక స్థానం గౌరవం కేవలం శ్రీసభ ఆ తల్లికి ఇచ్చినది కాదు. సాక్షాత్తు దేవుడై ఆ తల్లికి అంతటి ప్రత్యేక స్థానమును, గౌరవం కలుగజేశాడు. కావుననే నేడు శ్రీ సభ తండ్రిని విధేయిస్తూ, కుమారుడిని అనుసరిస్తూ, వారు ఆ తల్లికి ఒసగిన ప్రత్యేక స్థానాన్ని గౌరవిస్తూ వివిధ భక్తి కార్యాల ద్వారా, ప్రార్థన ద్వారా శ్రీసభ ఆ తల్లి ఎడల ఉన్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఉంది. అంతేకాక డిసెంబర్ 8వ తేదీన మరియమాత నిష్కళంక ఉద్భవం పేరు మీదుగా పండుగ జరుపుమని ఆదేశించింది. అప్పటినుండి మరియమాత యందు భక్తి కార్యక్రమాలు ప్రపంచమంతటా వ్యాపించాయి. పలుచోట్ల ఆ తల్లి నిష్కళంక ఉద్భవం పేరు మీద దేవాలయాలు నిర్మించారు. అందు మన భారతదేశంలో గోవా రాష్ట్రమందు పంజిమ్ (panjim) అనే ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దేవాలయం ఉండటం విశేషం. ఈ దేవాలయాన్ని 1541 సంవత్సరంలో నిర్మించారు.

ఆ నిష్కళంక మాత దరిచేరి ప్రార్థించిన వారందరి జీవితాలలో నూతన వెలుగులో నింపబడ్డాయి ఆ తల్లి ప్రార్థన సహాయం వేడిన ఏ ఒక్కరు కూడా నిరాశ చెందరు అని పునీత బెర్నాడు గారు తెలియజేశారు. ఎందుకంటే ఆ తల్లి ప్రార్థన, మనం మన పాపమాలిన్యాన్ని వదిలి తన కుమారుడైన క్రీస్తును అనుసరించుటకు సిద్ధపరుస్తుంది మరియు దేవుని అనుగ్రహములకు పాత్రులను చేస్తుంది. ఎందరో భక్తులు గురువులు పీఠాధిపతులు పునీతుల సహితం ఆ తల్లి మాతృ వాత్సల్యంలో ఓలలాడారని, ప్రయోజనం పొంది కుమారుడైన క్రీస్తుకు సాక్షిగా తమ జీవితాలను మలుచుకొని జీవించారు అన్న సత్యాన్ని పునీతుల చారిత్రక గ్రంధాలను పరిశీలన ద్వారా మనము తెలుసుకోవచ్చును. వారి జీవిత ధ్యానం మనకి ఆదర్శంగా నిలుస్తుంది.


**ముగింపు**

మరియమాత నిష్కళంక ఉద్భవి అనటం ఆమె తన తల్లి గర్భాన జీవం పోసుకున్న క్షణానికి మాత్రమే వర్తించే విశ్వాస ప్రకటన కాదు. ఎందుకంటే ఆమె జీవితంలోని ప్రతి క్షణం దేవుని అనుగ్రహంతో నింపబడింది అనే సత్యాన్ని గ్రహించాలి. అంతేగాక ఆమె తన జీవితాంతం ప్రభువునకు విధేయిస్తూ ప్రభువు

చిత్తాన్ని నెరవేరుస్తూ జీవించింది. మనకి స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ, ఒక జీవన పాఠం నేర్పింది నేర్పించింది. ప్రస్తుత సమాజంలో పాపము దాని స్వభావము ఎక్కడ చూసినా వివిధ కోణాలలో విస్తృతంగా విజృంభిస్తున్న ఈ సమయంలో ఆ తల్లి నిష్కళంక తత్వమును, పవిత్ర జీవన విధాన ధ్యానము, మనం మన పాప మాలిన్యమును వదిలి ఆ తల్లి వలే నిష్కళంకంగా జీవిస్తూ కుమారుడైన క్రీస్తును అనుసరించుటకు దోహదపడుతుంది అని విశ్వసిద్దాం. ప్రార్థిద్దాం.

# 4. నాలుగవ మరియ విశ్వాస సిద్ధాంతం: మరియ మోక్షారోపణం (శ్రీసభ విశ్వాస ప్రబోధనం)

ఫాదర్ పిల్లి అంతోని దాస్



కతోలిక శ్రీసభలో మరియకు సంబంధించిన విశ్వాస సిద్ధాంతాలలో నాలుగవది: మరియ – మోక్షారోపణం. నవంబర్ 1, 1950 పన్నెండవ పయస్ పాపుగారు తన అపోస్తోలిక నిర్మాణ పత్రం "అత్యంత ఔదార్యముగల దేవుడు" (Munificentissimus Deus) లో ఈ విధంగా ప్రకటిస్తున్నాడు: "పరిశుద్ధ అమలోద్భవి దేవుని తల్లి నిత్య కన్యక మరియ, ఈ లోకములో తన యాత్ర ముగిసిన తర్వాత, ఆత్మ శరీరములతో పరలోక మహిమలోనికి కొనిపోబడింది. ఇది దైవీక సాక్షాత్కార విశ్వాస సిద్ధాంతంగా మేము ప్రకటిస్తున్నాము, ప్రబోధిస్తున్నాము, నిర్వచిస్తూ ఉన్నాము."

ఈ ప్రకటన అద్భుతంగా అనిపించినప్పటికీ, అసలు మరియ మరణించినదా, లేక శారీరక మరణం లేకుండానే ఆమె శాశ్వత జీవితమునకు లేవనెత్తబడినదా అను ప్రశ్న మాత్రం ఇంకా సమాధానం లేకుండా మిగిలిపోయింది. దీనికి సమాంతరంగా తూర్పు ఆర్థోడాక్స్ శ్రీసభలో ఒక విశ్వాసం ఉంది: దేవుని తల్లి మరియ నిద్ర లేదా "దేవుని తల్లి విశ్రాంతి". ఈ మరియ భౌతిక మరణం గురించి ఇంకా సందేహం కొనసాగుతూనే ఉంది.

పన్నెండవ పయస్ పాపుగారు తన అపోస్తోలిక నిర్మాణ పత్రంలో కన్య మరియ భౌతిక పరలోక ఆరోపణం గురించి తన నమ్మకమును వ్యక్తం చేస్తున్నాడు: ఈ విశ్వాస సిద్ధాంతం మన పునరుత్థానం నందు మనకు ఉన్న నమ్మకమును బలపరుస్తుంది, ఫలభరితం చేస్తుంది. ఇదే సత్యమును కతోలిక

శ్రీసభ విశ్వాసప్రబోధం కొనసాగిస్తుంది: పరిశుద్ధ కన్య మరియ మోక్షారోపణం తన కుమారుని పునరుత్థానంలో ప్రత్యేకమైన భాగస్వామం పొందినది అనుటకు ఒక సంకేతం, క్రైస్తవ విశ్వాసుల పునరుత్థానము కూడా ఖచ్చితంగా ఉంది అని చెప్పుటకు ఒక ఆదర్శం.

## 1. మరియ మోక్షారోపణం – శ్రీసభ సాంప్రదాయం:

మోక్షారోపణం వివరణలకు సంబంధించిన కొన్ని విషయాల ప్రకారం: మోక్షారోపణం ఎఫేసు నగరం లోని కన్య మరియ ఇంట్లో చోటుచేసుకుంది. ఇది తరువాత వచ్చిన ప్రచారంలోనికి వచ్చిన ఒక ప్రాంతీయ విషయం. దీనికంటే ముందుకంటే కొన్ని ప్రచారాలు ఉన్నాయి. వాటి ప్రకారం మరియ జీవితం యెరుసలేములో ముగిసింది అని తెలుస్తుంది.

కన్యమరియ నిద్ర గురించి ఏడవ శతాబ్దపు ఆరంభంలో అరిమత్తయి యోసేపుకు ఆపాదించిన ఒక ప్రచారం "పరిశుద్ధ కన్య మరియ ప్రవాసం" అను గ్రంథంలో ఈ క్రింది కథనం ప్రచారంలో ఉంది. మరియ మరిణించిన సమయంలో అపోస్తులుడు తోమాస్ అక్కడ లేడు. అతడు తిరిగి వచ్చిన తర్వాత సంగతిని తెలుసుకున్న తోమాస్ సమాధిని తెరచి చూడాల్సిందే అని పట్టు బట్టాడు. తోమాస్ మాట ప్రకారం సమాధిని తెరచి చూడగా ఆమె వస్త్రాలు తప్ప సమాధిలో ఆమె శరీరం లేదు. చివరగా, ఈ సంఘటనకు సూచనగా మరియ పరలోకం నుండి తన నడుముపట్టీని ఒక అపోస్తులునికి అందించింది. ఈ సంఘటనే తదుపరి మరియ మోక్షారోపణ చిత్ర లేఖనాలలో తరచుగా కనిపిస్తుంది.

క్రైస్తవ ప్రపంచంలో మరియ మోక్షారోపణం గురించి అనేక ప్రబోధనలు విస్తృతంగా ప్రభలినాయి. ఐదవ శతాబ్దంలోనే ఈ మోక్షారోపణ పండుగను కొనియాడడం మొదలుపెట్టారు. దీనిని తూర్పు దేశాలలో మౌరిస్ అను చక్రవర్తి ఒక వేడుకగా స్థిరపరచాడు. జాన్ దమసీన్ తన ప్రసంగంలో యూతిమయిక్ చరిత్ర మూడవ సంపుటిని ఉటంకిస్తూ ఇలా ప్రబోధం చేస్తాడు: "యెరుసలేము మేత్రానులు పునీత యువేనల్ చాల్సదన్ సమావేశంలో (451) ఇలా తెలియజేసాడు. మార్సియన్ చక్రవర్తి మరియు పుల్కేరియ మరియ భౌతిక దేహం కావాలని కోరుకుంటాడు. అప్పుడు యువేనల్ మేత్రానులు వారితో ఇలా అంటాడు. దేవుని తల్లి మరియ అపోస్తులుల సన్నిధిలో మరణించింది అని, తర్వాత తోమాస్ అభ్యర్ధన ప్రకారం సమాధిని తెరచి చూడగా అది

ఖాళీగా కనిపించింది అని, అందువలన, మరియ మోక్షమునకు కొనిపోబడినది అని అపోస్తలులు విశ్వసించారు అని, కాబట్టి ఆమె శరీరము సమాధిలో లేదు అని తెలియజేస్తాడు.

## 2. మరియ మోక్షారోపణం - చారిత్రక నేపథ్యం:

మరియ నిద్ర మరియు మరియ మోక్షారోపణం సంబందించిన ఆనవాళ్ళు శ్రీసభ ఆరంభ చరిత్రలోనే అనగా నిగుప్తమైన గ్రంధాలలో (అపోక్రిపల్ బుక్స్) కనిపిస్తాయి అని కొంతమంది వేదపండితులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యముగా స్టీఫెన్ జె. షూమేకర్ ఇలా అంటాడు: "ఉదాహరణకు, బాల్డి, మస్కోని, కోతెనేట్ అను వారు మరియ నిద్రలో ఉన్న భౌతికము గురించి విభిన్నమైన ఒక దృష్టితో చూడాలని భావించారు. ఈ మరియ నిద్ర అనేది ముందుగా ఒక భాషాసాంప్రదాయంలో బలంగా కనిపిస్తుంది. ఆ తర్వాతే లిఖితపూర్వక సాంప్రదాయంలో అది గోచరమవుతుంది. అయినప్పటికీ, లీబెర్ రెక్వియే మరియే (మరియ భౌతిక విమోచనం) మరియు దోర్మిషన్ అపోక్రిఫన్ ఆరు పుస్తకాలు – రెండవ మూడవ శతాబ్దాలలో కనిపించు ఈ రెండు గ్రంధాలలో ఈ సత్యాల పూర్వ ఆనవాళ్ళు ఉన్నట్టుగా తెలుస్తుంది.

షూమేకర్ ప్రకారం, లీబెర్ రెక్వియే మరియే – మరియ విశ్రాంతి గ్రంథము అను పుస్తకం మరియ అంతిమ జీవితం, ఆమె మోక్షారోపణం అను అంశాల గురించి మొదట ప్రస్తావించిన పుస్తకం. ఇది బహుశా రెండవ లేదా మూడవ శతాబ్దానికి చెందిన సాంప్రదాయం. "దోర్మిషన్ అపోక్రిఫన్ ఆరు పుస్తకాలు" అను గ్రంథము ఆరు భాగాలుగా లిఖించబడినది. నాలుగవ శతాబ్దపు మధ్యలో కనిపించిన ఈ గ్రంథంలో మరియతల్లి మోక్షారోపణం గురించి మాత్రమే గాక, కన్య మరియ భక్తి కూడా చాలా అనాదిగా మొదలైంది అని తెలుపుతుంది. ఎఫేసు సమావేశం కంటే వందేళ్ళు ముందుగానే మరియ యెడల భక్తి ప్రభలంలో ఉన్నట్టు దీనిద్వారా తెలుస్తుంది.

"మరియ నిద్ర గురించి గ్రీకు సంబాషణ" లేదా "మరియ విశ్రాంతి నిద్ర గురించి యోహాను గ్రంథం" అను పుస్తకంలో కూడా మరియ అంతిమ యాత్ర లేదా జీవితానంతర స్థితి గురించి కనిపస్తుంది. ఇది అన్నిటికంటే మొదటి పుస్తకముగా, "మరియ విశ్రాంతి గ్రంథం" కంటే ఇంకా ముందుగానే ఉన్నట్టు తెలుస్తుంది.

మరియ అంతిమ జీవితం గురించి పరిశుద్ధ గ్రంధం ఎటువంటి విషయమును చెప్పలేదు. నాలుగవ శతాబ్దంలో సలామిస్ వాసి ఎపిఫనియుస్ అను రచయిత మరియ జీవితం ఎలా ముగిసిందో అని చెప్పడానికి సరియైన ఆధారాలు కనిపించడం లేదు అని రాస్తాడు. మరియ నిజంగా మరణించిందా లేక అమరజీవిగా నిలిచిపోయిందా అను విషయాలలో పరిశుద్ధ గ్రంధ, శ్రీసభ సాంప్రదాయం ఏమని పలుకుతుందో అని నిర్ధారించుకొనే లోపే, ఎపిఫనియుస్ తన కాలములోనే మరియ అంతిమ జీవితం గురించి మూడు అభిప్రాయాలను తెలుసుకున్నాడు: మొదటిది – మరియ సాధారణ సమాధాన మరణము పొందినది అని, రెండవది – ఒక వేదసాక్షిలా ఆమె మరణించినది అని, మూడవది – అసలు ఆమె మరణించలేదు అని ఈ మూడు విషయాలు గ్రహించాడు. అన్నిటికీ మించి, మరియ ఎలిషా వలె మరణించకుండా మోక్షానికి ఆరోపణ అయ్యింది అని ఎపిఫనియుస్ ప్రకటించాడు.

మరియ మోక్షారోపణం గురించి ప్రస్తావించిన మరికొన్ని గ్రంధాలు ఉన్నాయి. నిగుప్త ప్రబోధనలలో భాగంగా “దే ఒబితు సాంతో దోమినే”అను పుస్తకం. ఇది పునీత యోహాను పేరు మీద కనిపిస్తుంది. అయితే ఇది నాలుగవ లేదా ఐదవ శతాబ్దంలో గోచరమవుతుంది. ఈ ప్రస్తావన “దే త్రాన్సితుస్ బెయాత మరియే విర్జినిస్” అను నిగుప్త గ్రంధంలోనూ కనిపిస్తుంది. ఇది తప్పుగా సార్దిస్ వాసి మెలితో కు ఆపాదించబడినప్పటికీ, వాస్తవానికి ఆరియోపాజితే వాసి డెనిస్ కి సంబంధించినది.

ఇంకనూ, ఆరవ శతాబ్దంలో దమసీను వాసి యోహాను రచించిన ‘యేయుతిమియాక్ చరిత్ర’ అను గ్రంధంలో మరియ ఏవిధంగా పరలోకానికి కొనిపోబడినదో వివరించాడు. ఈ చరిత్ర ద్వారా ఈ మరియ మోక్షారోపణం గురించి ఒక విశ్వాస సాంప్రదాయమును ఏర్పరచాడు. అతడు అంటాడు: మరియ శిష్యుల సమక్షంలో మరణించింది, తోమాస్ అభ్యర్ధన ప్రకారం సమాధిని తెరచి చూడగా అది ఖాళీగా కనిపించింది, దానితో మరియ శరీరముతో పరలోకానికి కొనిపోబడినది అని విశ్వసించారు.

“మరియ నిద్ర” అను పండుగ తూర్పు దేశాల నుండి గైకొనబడి ఏడవ శతాబ్దంలో పశ్చిమ దేశాలలో ప్రభలి ప్రతి సంవత్సరం ఆగష్టు 15 వ తేదీ జరుపుకొనబడడం మొదలైంది. తొమ్మిదవ శతాబ్దం నాటికి పేరు కాస్త మారి

'మోక్షారోపణం' గా దైవార్చన క్యాలండర్లో కొనియాడబడింది. అదే శతాబ్దంలో నాలుగవ లియో పాపుగారు (847–855) ఈ పండుగకు గొప్ప ఘనతను ఇచ్చి, ఎనిమిది రోజుల సంసిద్ధతను చేయాలని, పండుగ ముందు రోజు జాగరణ కూడా జరపాలని ఆజ్ఞాపించాడు. మొదటి నికోలస్ పాపుగారు (858–867) ఈ పండుగను క్రీస్తుజయంతి, పునరుత్థాన పండుగలకు సమాంతరంగా నిలబెట్టాడు. పదునాలుగవ బెనెడిక్ట్ పాపుగారు (1740–1758) ఈ పండుగను ఉన్నత స్థానములో నిలబెట్టి, ఈ మరియ మోక్షారోపణ సత్యమును నిరాకరించడం అంటే అవిశ్వాసంతో, దైవదూషణతో సమానం అని ప్రకటించాడు.

"స్తుడియుం బిబ్లికుం ఫ్రాంచిస్కానుం" అను వేదాంత పాఠశాల శాస్త్రవేత్తలు ఒక విషయమును కనిపెట్టారు: మరియ జీవితానంతం తర్వాత యెరుసలేములో కొంతమంది యూదియా క్రైస్తవులు అపోస్తొలిక కాలం తర్వాత కన్యమరియ అంతిమ జీవిత విషయాలను గురించి ఒక 'ప్రచార' సాంప్రదాయమును భద్రపరచినట్లు తెలుస్తుంది. వారు ఈ ప్రచారమును ఆధారముగా చేసుకొని మోక్షారోపణమునకు మరియు నిద్రకు సంబంధించిన విషయముల 'చారిత్రాత్మక వాస్తవికత' కొరకు అన్వేషణ మొదలుపెట్టారు. అంతోయినే వెంగర్ ప్రకారం "మరియ మోక్షారోపణం, మరియ విశ్రాంతి గురించిన ఇన్ని గొప్ప వైవిధ్యమైన సాంప్రదాయాలు మరియ భక్తిప్రపత్తుల నుండి ఉద్భవించాయి అని గ్రహించాలి గాని, ఒకే సాంప్రదాయం నుండి అంచెలంచలుగా ఎదిగిన ఒక విషయంగా చూడకూడదు."సైమన్ క్లౌదే మిమౌని, అతనికి ముందుగా ఉన్నవారు, ఒక అభిప్రాయమును వ్యక్తం చేసారు: "కన్య మరియ మోక్షారోపణ విశ్వాసం ఒక వేదాంత సిద్ధాంత ప్రకటన పురోగతికి ఒక చివరి మెట్టు అని గుర్తించాలి గాని, అన్ని సాంప్రదాయాలకు అది ఆధారము అని కాదు."

మరియ మోక్షారోపణం గురించి అనేకానేక భాషలలో రకరకాల విధాలుగా ప్రకటింపబడింది. ప్రధానంగా గ్రీకు, లతీను, కోప్టిక్, సిరియాక్, ఇథియోపియా, అరబిక్ భాషలలో బోధింపబడింది. గ్రీకు భాషలోని ప్రచారం సువార్తీకుడు యోహానుకు ఆపాదించబడింది. లతీను భాషలోని ప్రచారం సార్దిస్ వాసి మెలీతో కు ఆపాదించబడింది. షూమేకర్ అంటాడు: ఈ ప్రాచీన సాంప్రదాయాలు మోక్షారోపణ విశ్వాస సిద్ధాంతానికి అనుకూలంగా ఉన్నాయని లేదా ప్రతికూలంగా ఉన్నాయని స్పష్టముగా ఏకగ్రీవంగా చెప్పలేక పోతున్నాయి.

## 3. మరియ మోక్షారోపణం - పరిశుద్ధ గ్రంథ ఆధారాలు:

పన్నెండవ భక్తినాథ పాపుగారు, అత్యంత ఔదార్యముగల దేవుడు (Munificentissimus Deus) అను అధికార పత్రమును అందిస్తూ ఇలా అంటాడు: "శ్రీసభ పితరుల మరియు వేదాంతవేత్తల అన్ని రుజువులు, అన్ని ఆలోచనలు పరిశుద్ధ గ్రంథమునే తమ అమూల్యమైన ఆధారముగా చూపెడుతున్నాయి."

పరలోక సంకేతము - దర్శనగ్రంథము 12:12: మరియ మోక్షారోపణము నకు సంబంధించి మనకు ఇవ్వబడిన అతి విలువైన ప్రధానమైన సాక్ష్యము దర్శన గ్రంథము 12:12: "అంతట దివియందు ఒక గొప్ప సంకేతము గోచరించెను. ఒక స్త్రీ దర్శనము ఇచ్చెను. సూర్యుడే ఆమె వస్త్రములు, చంద్రుడు ఆమె పాదముల కింద ఉండెను. ఆమె శిరముపై పన్నెండు నక్షత్రములు గల కిరీటము ఉండెను...." ఎపిఫనియుస్ ఈ వాక్యమును ఆధారముగా చేసుకొని ఇతర మానవులవలె మరియ అసలు మరణించలేదు, కాని ఆమె అమరముగా నిలబడిపోయింది అని అంటాడు. అయితే తనకు కూడా ఈ విషయము పట్ల పూర్తి స్పష్టత లేనట్లే, దానిని ప్రబోధించకుండా ఆగిపోతాడు ఎపిఫనియుస్. సంపూర్ణ స్పష్టత లేని ఆలోచనతో ఎపిఫనియుస్ ఇలా అంటాడు: ఆమె అమరజీవిగా ఉందని నేను చెప్పడం లేదు, అలా అని ఆమె మరణించినది నేను ధ్రువీకరించడం లేదు. శ్రీసభ పితరుల కాలమునుండి కూడా "సూర్యుడు ఆమె వస్త్రము" అను ఆలోచనలో మూడు సంకేతాలు ఉన్నాయని భావించారు: మొదటిది - పూర్వ ఇశ్రాయేలు ప్రజలకు సంకేతం, రెండవది - శ్రీసభకు సంకేతం, మూడవది - మరియకు అది సంకేతం.

పరలోక వాగ్దానం - ఆది 3:15 అనేకమంది మేత్రానులు మరియ మోక్షారోపణమునకు సంబంధించిన ఆధారాలలో మరో ముఖ్యమైనది తండ్రి దేవుని వాగ్దానం. దేవుడు ఏదేను వనములో సర్పమును ఉద్దేశించి పలికే మాటలు మరియ మోక్షారోపణమునకు ప్రాధమిక సాక్ష్యము అని అభిప్రాయ పడుతున్నారు. "నీకును, స్త్రీకిని, నీ సంతతికిని, ఆమె సంతతికిని మధ్య వైరము కలుగ చేయుదును. ఆమె సంతతి నీ తల చితకగొట్టును. నీవేమో వాని మడమను కరిచెదవు" (ఆది 3:15). యేసు మరియను 'అమ్మ' గా కాకుండా ఒక 'స్త్రీ' గా సంబోధిస్తాడు (యోహాను 2:4,19:26). ఇలా యేసు మరియను 'స్త్రీ' అని పిలవడంలో ఒక గొప్ప వేదాంత సత్యము దాగి ఉంది అని అనేకమంది

శాస్త్రవేత్తలు అంటారు. ఇలా సంబోధించడంలో యేసు 'ఆది కాండములో వాగ్దాన స్త్రీ', నూతన నిబంధనలోని 'మరియ' ఒకటేనని, మరియ వాస్తవముగా 'నూతన ఏవ' అని ధ్రువీకరిస్తున్నాడు. ఈ నూతన ఏవ గబ్రియేలు మంగళవార్త సమయములో దేవుని వాక్కును విధేయతతో విశ్వసించి స్వీకరించి సాతాను తలను నలగదొక్కింది, మెస్సయ్యాను తన గర్భములో మోసింది (లూకా 1:38).

ఆదికాండములోని మానవ పాపము (ఆది 3వ అధ్యాయం) ఒక సూచనకరమైన భాషను కలిగి ఉంది అని శ్రీసభ సత్యోపదేశ సంక్షేమం ప్రబోధిస్తుంది. మోసపూరితమైన సర్పము స్వరము ద్వారా మానవుడు దైవ సన్నిధిని నుండి పడిపోతున్నారు. ఈ సర్పము 'పడిపోయిన దూత' లేదా సాతానుకు, లేదా దెయ్యానికి సంకేతముగా ఉంది. అదే విధంగా, దర్శనగ్రంథము పన్నెండవ అధ్యాయంలోని 'గొప్ప సర్పము' కూడా సాతానుకు సూచనగా కనిపిస్తుంది. ఏదేనులో పడిపోయిన ఈ సర్పము లేదా సాతాను ఈ స్త్రీతో వైరమును కలిగి ఉంది. అందువలన, కతోలిక ఆలోచన ప్రకారం, వాగ్దాన స్త్రీకి మరియ మోక్షారోపణమునకు మధ్య ఒక అమోఘమైన సంబంధం ఉంది అని తెలుస్తుంది.

## 4. ఇతర పరిశుద్ధ గ్రంథ వాక్యాలు:

కీర్తన 132:8 – "ప్రభూ లెమ్ము! నీ బల సూచకమైన మందసముతో నీ విశ్రాంతి స్థలమునకు కదలిరమ్ము." ఇది దైవ మందసము యెరుసలేమునకు తిరిగి రావడమును సూచిస్తుంది. ఆ మందసమే మరియ. ప్రభువును మోసిన మరియ తల్లి, దివ్య మందసము, అంతే బలముతో, అంతే పవిత్రతతో, అంతే మహోన్నతతో తిరిగి ఆ దేవుని చెంతకే చేరింది అని చెప్పడానికి ఈ వాక్యము తోడ్పడుతుంది.

దర్శన గ్రంథము 11:19 – "దివియందలి దేవుని ఆలయము తెరువబడెను." ఇక్కడ యోహాను తన దర్శనములో వాగ్దాన మందసమును చూస్తున్నాడు, ఆ మందసమే సూర్యుని తన వస్త్రముగా ధరించింది అని తరువాతి వాక్యములోనే సెలవిస్తున్నాడు (దర్శన గ్రంథము 12:1).

లూకా 1:28 – "అనుగ్రహ పరిపూర్ణురాలా! నీకు శుభము." గబ్రియేలు దూత మరియను ఇటువంటి గొప్ప పలుకులతో సంబోధిస్తుంది. పరలోక అనుగ్రహాలు అన్ని కూడా ఆమెలో పరిపూర్ణంగా ఉన్నాయి. కాబట్టి ఈ పరిపూర్ణ అనుగ్రహ ప్రభావమే, ప్రతిఫలమే ఆమె మోక్షారోపణం.

1 కొరింతీ 15:23 (15వ అధ్యాయం అంతా కూడా) మరియు మత్తయి 27వ అధ్యాయంలో యేసును విశ్వసించిన వారి శరీరాలు పునరుత్థాన మహిమను పాత్రులు అవుతాయి గ్రహించగలం.

## 5. మరియ మోక్షారోపణం – కతోలిక మరియ దర్శనములు:

పన్నెండవ శతాబ్దంలో ఒక జర్మనీ కన్యస్త్రీ స్కూనావు ఎలిజబెత్తు ఒక దర్శనమును పొందింది. మరియ తన కుమారునితో ఆమెకు దర్శనమిచ్చింది. పశ్చిమ క్రీసభ విశ్వాస సాంప్రదాయంలో ఈ దర్శనం ఒక గొప్ప ప్రభావమును చూపించింది. ఆమె లిఖించిన పుస్తకం "విసియో దే రేజురెక్సియోనే బెయాతే విర్జినిస్ మరియే" లో మరియ ఏవిధంగా ఆత్మ శరీరములతో మోక్షమునకు కొనిపోబడినదో ఆమె వివరించారు.

మే 1, 1950 లో గిల్లెస్ బూహవర్స్ అను ఒక మరియ భక్తుడు పన్నెండవ పయస్ పాపుగారికి ఒక సమాచారమును అందించినట్టు తెలుస్తుంది. పరిశుద్ధ కన్య మరియ మోక్షారోపణమును ఒక 'వేదాంత సత్యముగా' ప్రకటించమని మరియతల్లి స్వయముగా తనకు దర్శనమిచ్చి, దీనిని పాపుగారికి తెలియజేయమని తనను ఆజ్ఞాపించినట్టుగా ఆ భక్తుడు పయస్ పాపుగారికి తెలిపాడు. పయస్ పాపుగారు కూడా 1950 పవిత్ర సంవత్సరంలో అసలు 'మరియ మోక్షారోపణం' ఒక విశ్వాస సత్యముగా ప్రకటించవచ్చా లేదా, ఇది దైవ సంకల్పంగా కాదా, అని ఆయన దేవుని అడిగినట్టుగా తెలుస్తుంది. అదే సమయంలో ఈ గిల్లెస్ అను మరియ భక్తుడు ఈ సందేశమును మోసుకొని వచ్చాడు. పయస్ పాపుగారు ఈ గిల్లెస్ సందేశమును తాను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక సత్యానికి వాస్తవముగా దైవసందేశవే అని నిర్ధారించుకున్నాడు. గిల్లెస్ దర్శన సందేశము పొందిన తరువాత ఆరు నెలలకు పన్నెండవ పయస్ పాపుగారు ఒక విశ్వాస సత్యమును బాహాటముగా ప్రకటించాడు: "పరిశుద్ధ కన్య మరియ ఆత్మ శరీరములతో మోక్షమునకు కొనిపోబడినది."

## 6. మరియ మోక్షారోపణం – ఒక మోక్షారోపణమా లేక ఒక నిద్రనా?

మరియ మోక్షానికి కొనిపోబడక ముందు మరణించింది అని కొంతమంది కతోలికులు అభిప్రాయపడుతున్నారు. అయితే మోక్షారోపణం కాకముందు ఆమె అద్భుతవిధంగా జీవముతో లేపబడింది అని వారు విశ్వసిస్తున్నారు. ఇది

ఒక నైతికపరమైన సిద్ధాంతముగా కనిపిస్తుంది. అసలు మరణింపక మునుపే మరియ పరలోకానికి తీసుకొని పోబడినది అని ఇంకొందరు కతోలికులు నమ్ముతున్నారు. ఇది ఒక అనైతికపరమైన సిద్ధాంతముగా కనిపిస్తుంది. అయితే ఈ రెండు విధానాలు కతోలిక క్రైస్తవ విశ్వాస అభిప్రాయాలు. ఒకే ఒక వ్యత్యాసం: తూర్పుదేశ కతోలికులు "మరియ విశ్రాంతి" పండుగగా కొనియాడతారు, రోమీయ కతోలికులు మాత్రము "మోక్షారోపణ" పండుగగా కొనియాడుతున్నారు. అయితే కతోలిక సాంప్రదాయంలో ముఖ్యముగా దైవార్చన, నిగుప్త గ్రంధాలు, సంస్కృతి పరమైన అంశాలలో నైతికపరమైన సిద్ధాంతానికి ఎక్కువ ఆధారాలు ఉన్నాయి: అనగా, మరియ ముందు మరణించింది, ఆ తరువాత పరలోకానికి కొనిపోబడినది. అంతేకాదు, పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు ఈ నైతికపరమైన అన్వయింపు సిద్ధాంతానికి తన ప్రసంగంలో కూడా అనుకూలతను తెలియజేసాడు. కతోలిక శ్రీసభలో 'మరియ మోక్షారోపణము' ను ఒక విశ్వాస సత్యముగా (డాగ్మా) ప్రకటించారని, అదే తూర్పు ఆర్థోడాక్స్ శ్రీసభలో 'మరియ విశ్రాంతి' (దోర్మిషన్) ని ఒక విశ్వాస సత్యముగా కాకుండా, ఒక బలమైన దైవార్చన అంశంగా, ఒక పరమరహస్యంగా ప్రకటించారని పలురకాల వేదాంత పండితులు తరచుగా రెండు విశ్వాసాల మధ్య వ్యత్యాసాన్ని పోల్చి చూస్తారు. ఈ వ్యత్యాసాలు కేవలము రెండు సిద్ధాంతాల గురించి లభ్యమగు అనేక ఆధారాలు, విశ్వాస భక్తి క్రియల మీద ఆధారపడి ఉంటాయి. కతోలిక శ్రీసభ ఒక శక్తివంతమైన సంస్థాగత నిర్మాణం కాబట్టి, ఇందులో విశ్వాస సత్యాలు అధికారపూర్వకంగా ప్రకటింపబడతాయి. తూర్పు ఆర్థోడాక్స్ శ్రీసభ బలమైన సంస్థాగత నిర్మాణం కాదు కాబట్టి 'తక్కువ స్థాయిలో' విశ్వాస ప్రకటనలు జరుగుతూ ఉంటాయి.

లతీను శ్రీసభ మరియ మోక్షారోపణ పండుగను ఆగస్టు 15న కొనియాడుతుంది. తూర్పు ఆర్థోడాక్స్ శ్రీసభ లేక తూర్పు కతోలికులు 'దేవుని తల్లి మరియ విశ్రాంతి' అను వేడుకను, అదే రోజు, పదునాలుగు రోజుల ఉపవాస వేడుకలతో కొనియాడతారు. మరియ సహజమైన మరణమును పొందినదని, మరణము తరువాత ఆమె ఆత్మను క్రీస్తు స్వీకరించాడని, ఆమె మరణం తర్వాత ఆమె శరీరము కూడా లేపబడినదని, ఆమె శరీరముతో పరలోకానికి కొనిపోబడినదని, మృతుల పునరుత్థానానికి ఇది ఒక ముందస్తు

సంకేతం అని తూర్పు కతోలికులు విశ్వసిస్తారు.

ఆర్థోడాక్స్ సంప్రదాయం 'మరియ విశ్రాంతి' గురించి ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన ఒక విశ్వాసమును కలిగి ఉంది: "పవిత్ర కన్య, తన కుమారుని వలె, శారీరక మరణమును చవిచూచింది. అయితే ఆమె శరీరము, తన కుమారుని శరీరమువలె, మరణమునుండి జీవముతో లేపబడింది. ఆమె శరీరముతో, ఆత్మతో కూడా పరలోకానికి తీసుకొని పోబడింది. ఆమె మరణమును, తీర్పును దాటుకొని, రానున్న కాలములో పరిపూర్ణముగా నివసిస్తుంది. ఆమె విషయంలో 'శరీర ఉత్థానము' ముందస్తుగానే జరిగింది, అది ఆమెలో నెరవేరిన ఒక వాస్తవ ప్రక్రియ. అంటే, దీని మూలముగా ఆమె తక్కిన మానవాళితో సంబంధమును కోల్పోయిందని అర్థం కాదు, అందరికంటే భిన్నముగా మరో వర్గానికి చెందనదని కాదు. ఎందుకంటే, మనమందరం ఒకరోజు శరీర ఉత్థానమును పొంది, అదే మహిమలో పాపుపంచుకుంటాము, ఆమెతో కలిసి ఇప్పుడు ఆమె అనుభవించు ఆనందంలో మనము ఆనాడు భాగస్తులమవుతాము."

## 7. మరియ మోక్షారోపణం – ఇతర క్రైస్తవ సంఘాల అభిప్రాయం:

**ప్రొటెస్టెంట్ దృక్కోణం:** ప్రొటెస్టెంట్ వర్గాలలో భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. వేదాంతశాస్త్ర పరిధిలో స్థాయిలో కతోలిక సిద్ధాంతమైన 'మరియ మోక్షారోపణం' గురించి విశ్వసిస్తున్నప్పటికీ చాలామంది ప్రొటెస్టెంట్ వారు మాత్రం ఈ విశ్వాసమును ప్రకటించడం లేదు.

**లూథరన్ దృక్కోణం:** మరియ మోక్షారోపణ పండుగను లూథరన్ చర్చి సంస్కరణ (Reformation) తర్వాత నిలిపివేసింది. ఎవాంజెలికల్ లూథరన్ ఆరాధన ఆగస్టు 15న 'మరియ, ప్రభువు తల్లి' అను చిన్న వేడుకను జరుపుకుంటుంది. ప్రస్తుత లూథరన్ ఆరాధనా గ్రంథం ఈ పండుగను అధికారపూర్వకంగా "పరిశుద్ధ మరియ, మన ప్రభువు తల్లి" అని నిర్దేషించబడింది.

**ఆంగ్లికన్ దృక్కోణం:** ఆంగ్లికన్ విశ్వాసంలో మరియ మోక్షారోపణను కొందరు అంగీకరిస్తారు, మరికొందరు నిరాకరిస్తారు లేదా అదియఫోరా అనగా 'ఉదాసీన విషయం' (ఇండిఫ్ఫెరెంట్) గా పరిగణిస్తారు. ఈ విశ్వాసం ఆంగ్లికన్ ఆరాధన నుండి 1549 లోనే మాయమైపోయింది. తిరిగి ఇది ఇరువది శతాబ్దంలో ఆంగ్లోకతోలిక సంప్రదాయంలో పలు నామాలలో కనిపిస్తుంది.

ఇంగ్లాండ్ చర్చి మరియ పండుగను ఆగుస్ట్ 15న ఎటువంటి ప్రత్యేకత లేని ఒక పరిశుద్ధ కన్య మరియ వేడుకగా జరుపుకుంటుంది. ఇదే పండుగను స్కాట్లాండ్ ఎపిస్కోపల్ చర్చి కేవలం 'పరిశుద్ధ మరియ కన్య' అను నామముతో పిలుస్తుంది. అదే పండుగను అమెరికా ఎపిస్కోపల్ చర్చిలో "పరిశుద్ధ మరియ కన్య: మన ప్రభువైన యేసుక్రీస్తు తల్లి" ను పేరుతో జరుపుకుంటుంది. మరికొన్ని ఆంగ్లికన్ సంఘాలు ఈ పండుగను 'మరియ విశ్రాంతి' వేడుకగా కొనియాడుతాయి. ఉదాహరణకు, కెనడా ఆంగ్లికన్ చర్చి ప్రార్థన పుస్తకం (1962) ఈ రోజును 'పరిశుద్ధ కన్య మరియ నిద్ర' గా జరుపుకుంటుంది.

ఆంగ్లికన్ – రోమన్ కతోలిక అంతర్జాతీయ కమిషన్, రెండు విశ్వాసాల మధ్య ఒక సత్సంబంధం నెలకొల్పాలని ప్రయత్నిస్తూ, 2004 వ సంవత్సరంలో అధ్యయనానికి, పరిశీలనకు అవసరమైన ఒక అనాధికార ప్రకటనా పత్రమును, 'సీయాట్టెల్ ప్రకటన' గా విడుదల చేసింది. ఈ 'అంగీకార పత్రము' ఈ క్రింది సంయుక్త ప్రకటనను చేసింది: "మోక్షారోపణం మరియు నిష్కళంక ఉద్భవం అను మరియ గురించిన ఈ రెండు ప్రబోధములు, పరిశుద్ధ గ్రంధ పరిధిలో నిరీక్షణ అనుగ్రహం అను దృక్పదంలో అర్ధం చేసుకోబడుతున్నాయి. ఇవి పరిశుద్ధ గ్రంథంలోనూ, ప్రాచీన సాంప్రదాయంలోనూ ప్రబోధనా సత్యాలుగా కనిపిస్తున్నాయి."

**ఇతర ప్రొటెస్టెంట్ విశ్వాసాల దృక్కోణం:** ప్రొటెస్టెంట్ సంస్కరణ వాది హెయిన్రిచ్ బుల్లింగర్ మరియ మోక్షారోపణమును విశ్వసించాడు. 1539 లో అతడు విగ్రహారాధనకు వ్యతిరేఖముగా ఒక పత్రమును లిఖించాడు. అందులో, మరియ అతిపరిశుద్ధ శరీరము దూతల ద్వారా పరలోకానికి తీసుకొని పోబడింది అని తన విశ్వాసమును వ్యక్తం చేసాడు. అతని విశ్వాసం గమనిద్దాం: "ఈ కారణంగా కన్య మరియ, దేవుని ప్రియ పుత్రిక, పరమ పవిత్రమైన మందసం, పవిత్రాత్మ ఆలయం, అనగా, ఆమె అతి పవిత్రమైన శరీరము, దూతల ద్వారా మోక్షానికి కొనిపోబడినది."

## 8. మరియ మోక్షారోపణం – వేడుకల విధానం:


ఆర్థోడాక్స్ క్రైస్తవులు మరియ మోక్షారోపణ పండుగకు ముందు పదునాలుగు రోజులు ఉపవాసం చేస్తారు. శారీరక కలియకకు కూడా దూరంగా ఉంటారు. ఉపవాసంలో భాగంగా కొన్నిరకాల ఆహార పదార్ధాలను వారు

నిరాకరిస్తారు. మరియ విశ్రాంతి వేడుక సందర్భంగా వార దినములలో వారు కటినమైన నియమాలను పాటిస్తారు. ద్రాక్షారసమును మరియు నూనెను కేవలం వారాంతములలో మాత్రమే తీసుకుంటారు, చేప కేవలం ఆగుస్ట్ 6న అనగా దివ్య రూప ధారణ పండుగ రోజు మాత్రమే స్వీకరిస్తారు. మిగిలిన అన్నీ రోజులు చాలా నిష్టతో కూడిన ఉపవాసమును ఆచరిస్తారు.

మరియ మోక్షారోపణ పండుగ చాలామంది క్రైస్తవులకు, ముఖ్యముగా కతోలికులకు, ఆర్థోడాక్స్ చాల ముఖ్యమైన వేడుక, అనేకమంది లూథరనులకు, ఆంగ్లికన్ క్రైస్తవులకు కూడా ఈ వేడుక కన్య మరియ పరలోక జననంగా చాలా ముఖ్యమైన పండుగ. మరియ పరలోక మహిమలోనికి స్వీకరించబడింది అను విశ్వాసము క్రైస్తవులకు ఒక వాగ్ధానము: తనకోసం జీవించి మరణించిన వారిని కూడా తాను పరలోకములో స్వీకరిస్తాను అను యేసుక్రీస్తు వాగ్దానానికి ఈ వేడుక ఒక ఆధారం.

తూర్పు శ్రీసభలో మరియ మోక్షారోపణ పండుగను ఆరవ శతాబ్దంనుండే ఆగుస్ట్ 15వ తేదీన జరుపుకోవడం ప్రారంభం అయ్యింది. పశ్చిమ శ్రీసభ ఈ పండుగను ఈ తేదీని స్వీకరించి పరిశుద్ధ కన్య మరియ మోక్షారోపణమును ఒక 'నిర్భంద జ్ఞాపకార్ధముగా' జరుపుకోడం మొదలు పెట్టింది. ఈ నిర్భంద వేడుక ద్వారా, మరియ పాపరహిత ఆత్మ, ఆమె నిర్మల శరీరము వాస్తవముగా, భౌతికముగా పరలోకానికి కొనిపోబడినది అను విశ్వాసమును ప్రకటిస్తుంది. మరియ మోక్షారోపణం ఒక విశ్వాస ప్రబోధం అని విశ్వసిద్దాం. మరియతల్లి మహిమలో పాలుపంచుకుందాం.

❋ ❋ ❋ ❋








**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing